అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 05-11-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 306 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50



హిందీ లేఖకు మలయాళంలో జవాబు !

బిట్టూ వర్సెస్ బ్రిట్టాస్

సీపీఐ (ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ వినూత్న నిరసన

కేంద్ర మంత్రి చర్యపై ఆగ్రహం

హిందీని బలవంతంగా రుద్దుతున్నారంటూ ఆగ్రహం

సంప్రదాయాలను గౌరవించాలని హితవు

న్యూఢిల్లీ : కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ తనకు హిందీలో లేఖ రాయడాన్ని సీపీఐ (ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ తప్పుపట్టారు. కేంద్ర మంత్రి చర్యను నిరసిస్తూ ఆయనకు మలయాళంలో ప్రత్యుత్తరం ఇచ్చారు. 'కేంద్ర మంత్రులు దక్షిణాది రాష్ట్రాల ఎంపీలకు ఆంగ్లంలో లేఖలు రాయడం సాంప్రదాయంగా వస్తోంది. అయితే తాజాగా కేంద్ర మంత్రి రవ్‌నీత్ బిట్టూ దానికి విరుద్ధంగా పూర్తిగా హిందీలో లేఖ రాశారు. దీంతో నేను ఆయనకు మలయాళంలో జవాబు ఇవ్వాల్సి వచ్చింది' అని బ్రిట్టాస్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. రైల్వేలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖల సహాయ మంత్రి రవ్‌నీత్ తనకు హిందీలో రాసిన లేఖలను కూడా ఆ పోస్ట్‌తో పాటు షేర్ చేశారు. 'ఈ ఏడాది పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో నేను చేసిన ప్రత్యేక ప్రస్తావనలు, లేవనెత్తిన జీరో-అవర్ నోటీసుకు సమాధానంగా రవ్‌నీత్ లేఖలు రాశారు. పదేపదే హిందీలో మాత్రమే సమాధానాలు పంపడాన్ని చూస్తుంటే అది ఉద్దేశపూర్వక విధానంగా కనిపిస్తోంది' అని బ్రిట్టాస్ తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలలో హిందీ అధికార భాష కాదని, పైగా దానిని విస్తృతంగా మాట్లాడరని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తన అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలలోనూ, పార్లమెంటులోనూ హిందీతో పాటు ఆంగ్ల భాషను కూడా ఉపయోగించేందుకు 1963వ సంవత్సరపు అధికార భాషల చట్టం అనుమతిస్తోంది. హిందీ మాట్లాడని రాష్ట్రాలతో సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవడానికి ఆంగ్ల భాషను ఉపయోగించవచ్చునని ఆ చట్టం చెబుతోంది. వివిధ అధికారిక పత్రాలు, నివేదికల కోసం ఈ రెండు భాషలూ వాడవచ్చునని తెలిపింది. చట్టంలోని ఈ నిబంధనల ప్రాధాన్యతను తక్కువ చేయకూడదుఅని బ్రిట్టాస్ తన లేఖలో తెలియజేశారు.

కేవలం హిందీలో మాత్రమే సమాధానాలు ఇచ్చే ధోరణిని చూస్తుంటే చట్టబద్ధమైన భాషా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు అర్థమవుతోందని బ్రిట్టాస్ విమర్శించారు. హిందీయేతర భాషలు మాట్లాడే ఎంపీలు తమ పార్లమెంటరీ కార్యకలాపాలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు, ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకునేందుకు ప్రభుత్వ వైఖరి అడ్డంకిగా మారిందని చెప్పారు. గతంలో కేంద్ర ప్రభుత్వాలు హిందీయేతర భాషలు మాట్లాడే రాష్ట్రాల ప్రతినిధులతో ఆంగ్లంలోనే సమాచారాన్ని పంచుకునేవని ఆయన గుర్తు చేశారు. 'చారిత్రకంగా కేంద్ర ప్రభుత్వాలు చట్టపరమైన కర్తవ్యాలను, సాంప్రదాయాలను పాటిస్తూ భాషకు సంబంధించిన నిబంధనలను గౌరవించాయి. హిందీయేతర భాషలు మాట్లాడే ఎంపీలకు ఆంగ్లంలోనే సమాచారాన్ని పంపేవి. అయితే ఈ పద్ధతికి ఇటీవల సృష్టి చెప్పినట్లు కన్పిస్తోంది. దీనిని వెంటనే సరిచేయాలి' అని కోరారు.

కేంద్రంలోని అధికార బీజేపీ ప్రభుత్వం బలవంతంగా హిందీ భాషను రుద్దేందుకు చేస్తున్న ప్రయత్నాలపై గతంలో వివిధ పార్టీలు, హిందీ మాట్లాడని రాష్ట్రాల నేతలు పలు సందర్భాలలో నిరసన ...13లో

బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయలేదు?

13లో..



ఢిల్లీ సర్కారుకు సుప్రీం ప్రశ్న

మహారాష్ట్ర డీజీపీని బదిలీ చేయండి

ప్రతిపక్షాల ఫిర్యాదుపై కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం


నూతన డీజీపీ నియామకానికి ముగ్గురు ఐపీఎస్‌ల పేర్లు పంపాలని సూచన 3లో..



ఒక్కో జిల్లాకు ఒక్కో ఐఏఎస్

ధాన్యం కొనుగోళ్లపై ముఖ్యమంత్రి రేవంత్ నిర్ణయం

కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చూడాలంటూ ఆదేశాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలంటూ ఉన్నతాధి కారులకు ఆయన సూచించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లపై సోమవారం ఆయన అధికారులతో సమీక్ష జరిపారు. కొనుగోళ్ల కు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు ఒక్కో ఉమ్మడి జిల్లాకు ఒక్కో ఐఏఎస్‌ను ప్రత్యేకాధికారిగా నియమించా రు. ఈ మేరకు ముఖ్య మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆయా ప్రత్యేకాధికారు లు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను సైతం సమర్థవంతం గా అమలు చేయించాలని సీఎం ఆదేశించారు. కొనుగోళ్ల ప్రక్రియ పూర్త య్యేంతవరకూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని వారికి సూచించారు. ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే అక్కడికక్కడే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ప్రత్యేకాధికారులుగా ఆదిలా బాద్‌కు కృష్ణ ఆదిత్య ,ఉమ్మడి కరీంనగర్‌కు ఆర్‌వీ కర్ణన్ , నిజామా బాద్‌కు డాక్టర్ ఏ.శరత్ ,మెదక్‌కు దాసరి హరిచందన, వరంగల్‌కు టి.వినయ కృష్ణారెడ్డి , ఖమ్మంకు కె.సురేంద్ర మోహన్ , నల్లగొండకు అనితా రామచంద్రన్ , మహబూబ్‌నగర్‌కు రవి , రంగారెడ్డికి డి.దివ్యలను నియమించారు.

మూసీ పరివాహక ప్రాంతంలో 8న సీఎం పర్యటన

వలిగొండ మండలం సంగెం నుంచి ప్రారంభం

అదే రోజు యాదాద్రి ఆలయ సందర్శన

అనంతరం రైతులతో మాట్లాడనున్న సీఎం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 8న భువనగిరి జిల్లాలోని మూసీ పరివాహక ప్రాంతంలో పర్యటించనున్నారు. ఆ రోజు ఆయన తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ సమేతంగా యాదాద్రి ఆలయాన్ని సందర్శిస్తారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ గోపురానికి సంబంధించిన బంగారు తాపడం పనులను పరిశీలిస్తారు. ఆ తర్వాత వలిగొండ మండలం సంగెం నుండి ప్రారంభించి, మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటిస్తారు. ఆ నది ప్రక్షాళనకు మద్దతుగా భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రలో సీఎం పాల్గొంటారు. ఆ సందర్భంగా అక్కడి రైతులతో ఆయన ముచ్చటిస్తారు. మూసీ పునరుజ్జీవంపై వారి అభిప్రాయాలను తెలుసుకుంటారు. మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయం వేడెక్కిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా ...13లో

సమాజానికి సేవ చేస్తే హీరోలవుతాం

చదువు, సామాజిక స్పృహ రెండూ ముఖ్యమే

విద్యార్థులకు సీఎం రేవంత్ దిశా నిర్దేశం

వివరాలు 5లో



నువ్వా..? నేనా..?

కమలా హారీస్, డోనాల్డ్ ట్రంప్ మధ్య హోరాహోరీ పోటీ

ఉత్కంఠగా అమెరికా అధ్యక్ష ఎన్నికలు - పీఠాన్ని దక్కించుకునేదెవరు?

నేడే తుది పోరు

వాషింగ్టన్: ఉత్కంఠగా ఎదురు చూస్తున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల పోరు మరికొన్ని గంటల్లో ముగియనుంది. ఈ ఎన్నికల్లో డెమొక్రాట్ల అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలాహారిస్, రిపబ్లికన్ల అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ హోరాహోరీగా తలపడుతున్నారు. ఈ ఇద్దరిలో ఎవరు పీఠాన్ని దక్కించుకుంటారో ఫలితాలు వెలువడే వరకు వేచిచూడాల్సిందే. అయితే అమెరికాలోని 50 రాష్ట్రాల్లో చాలావరకు రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీల్లో ఏదో ఒకదానికి స్పష్టంగా మద్దతిచ్చేవే కావడంతో వాటిని సేఫ్ స్టేట్స్‌గా పిలుస్తారు. ప్రతి అధ్యక్ష ఎన్నికల్లోనూ సదరు రాష్ట్రాలను ఆయా పార్టీలే గెలుచుకుంటాయి. ఎటూ తేల్చుకోని ఓటర్లు ఎక్కువగా ఉండే కొన్ని రాష్ట్రాలపై పోటీ ఆధారపడడంతో అవి స్వింగ్ స్టేట్స్‌గా మారాయి. నువ్వా? నేనా? అనేలా పోటీ ఉండే స్వింగ్ స్టేట్స్ అమెరికాలో ఏడున్నాయి. పెన్సిల్వేనియా, విస్కాన్సిన్, మిషిగన్, నార్త్ కరోలినా, జార్జియా, నెవడా, అరిజోనా.. ఈ ఏడు రాష్ట్రాల్లో 93 ఎలక్టోరల్ ఓట్లు ఉన్నాయి. వీటిలో మెజారిటీ ఓట్లు సాధించినవారే అమెరికా అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకుంటారు.

50 రాష్ట్రాల్లో 538 ఎలక్టోరల్ ఓట్లు

అమెరికాలో మొత్తం 538 ఎలక్టోరల్ ఓట్లున్నాయి. గెలవడానికి మ్యాజిక్ ఫిగర్ 270 ఓట్లు.. అయితే.. సేఫ్ స్టేట్లన్నీ ఈసారి కూడా ఆయా పార్టీల ఖాతాల్లోనే పడే అవకాశం ఉండడంతో కమలా హారిస్‌కు 226 ఓట్లు, ట్రంప్‌కు 219 ఓట్లు వచ్చే అవకాశాలున్నాయని అంటున్నారు. స్వింగ్ స్టేట్లలోని 93 ఓట్లు అత్యంత కీలకంగా మారాయి. ట్రంప్ గెలవాలంటే ఆ 93లో కనీసం 51 ఓట్లు సాధించాలి. హారిస్‌కు మాత్రం 44 ఓట్లు సరిపోతాయి. అలాగే.. 19 ఎలక్టోరల్ ఓట్లున్న పెన్సిల్వేనియా ఈసారి అమెరికా దృష్టిని ఆకర్షిస్తోంది. అక్కడ నెగ్గిన అభ్యర్థే అధ్యక్షుడయ్యే అవకాశం 90 శాతం వరకూ ఉండడంతో పెన్సిల్వేనియాలో హారిస్, ట్రంప్ మధ్య హెూరాహెూరీ పోటీ ...6లో

మతోన్మాద దాడులను వ్యతిరేకించాలి

15 నుంచి రాష్ట్రవ్యాప్త క్యాంపెయిన్

వామపక్ష పార్టీల నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ దుశ్చర్యలకు పాల్పడడాన్ని వామపక్ష పార్టీల సమావేశం తీవ్రంగా ఖండించింది. మత సామరస్యాన్ని కాపాడాలనీ, మతోన్మాదాన్ని వ్యతిరేకించాలని కోరుతూ ఈనెల 15 నుంచి వచ్చేనెల 15 వరకు నెలరోజుల పాటు రాష్ట్రవ్యాప్త క్యాంపెయిన్ చేపట్టాలని నిర్ణయించింది. అన్ని జిల్లాల్లో వామపక్ష పార్టీలతోపాటు ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులతో సదస్సులు, సెమినార్లు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరింది. ఈ క్యాంపెయిన్‌ను జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. సోమవారం హైదరాబాద్ లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో రాష్ట్రంలోని పది వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జెవి చలపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య ...13లో

కాంగ్రెస్ పాలన ప్రజాస్వామ్యయుతంగా లేదు

ఇచ్చిన హామీలు అమలు చేయలేదు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రజాస్వామ్యయుతంగా లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. మూడు రోజుల పాటు ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్ (హెచ్‌కెఎస్)లో జరుగుతున్న సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశాలకు హాజరైన ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా పాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎక్కడికక్కడ సీపీఐ(ఎం) నేతలను, కార్యకర్తలను అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. గ్రూప్-1 అభ్యర్థులు వ్యతిరేకించినప్పటికీ జీవో 20 అమలు చేశారని, దామగుండం ఫారెస్టులో వేల చెట్లు నరికి నావెల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు వంటి ఒకట్రెండు హామీలు మాత్రమే అమలు చేశారని, మెజార్టీ హామీలను విస్మరించారని దుయ్యబట్టారు.ప్రభుత్వం ఏర్పడి పదినెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ రైతు భరోసా'కు అతీగతీ లేదని, కౌలు రైతులకు ఇస్తామన్న రూ.12 వేలు, మహిళలకు మహాలక్ష్మి కింద ఇస్తామన్న నెలకు రూ.2,500, నిరుద్యోగ భృతి రూ.4,000 వంటివేమీ అమలు చేయలేదని విమర్శించారు. అలాగే అసంఘటిత రంగ కార్మికులకు ఇచ్చిన హామీలనూ అమలు చేయలేదని పేర్కొన్నారు. మరోపక్క హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూల్చుతున్నారని, మూసీ ప్రక్షాళన అంటూ భారీ బడ్జెట్‌తో ముందుకు వచ్చారని అన్నారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా ఒక్క అఖిల పక్ష సమావేశం కూడా నిర్వహించలేదని ధ్వజమెత్తారు. గత మూడేండ్లలో తాము చేపట్టిన పోరాటాలపై కేంద్ర కమిటీలో చర్చ జరుగుతోందని, అలాగే తమిళనాడులోని మధురైలో 2025 ఏప్రిల్‌లో జరిగే సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభకు రాష్ట్రాల వారీగా ప్రతినిధుల సంఖ్య కేటాయింపు జరుగుతోందని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

నేటినుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ

సమర్పణకు తుదిగడువు 20

జనవరి 1 నుంచి 20 వరకు

ఆన్‌లైన్‌లో పరీక్షలు 13లో

టెట్ నోటిఫికేషన్ విడుదల



పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచుల ఆందోళన

అరెస్టు చేసి తిరుమలగిరి పీఎస్‌కు తరలింపు

అక్కడ వారికి మద్దతుగా హరీశ్‌రావు నిరసన

చలో హైదరాబాద్ పిలుపు నేపథ్యంలో జిల్లాల్లో అరెస్టులు

బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మకండి..

మీ బిల్లులు మేం క్లియర్ చేస్తాం : మంత్రి సీతక్క

13లో..





ఆదాయం పెంచండి

జాయింట్ సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు

చిన్న పరిశ్రమలకు చేయూతనివ్వండి : సబ్‌కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రజలపై భారం పడకుండా ఆదాయాన్ని పెంచే మార్గాలపై అధికారులు దృష్టి పెట్టాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ సమావేశం సోమవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జాయింట్ వెంచర్స్‌లో విలువైన ఆస్తులు ఉన్నాయనీ, ప్రయివేటు వ్యక్తులు న్యాయస్థానాలకు వెళ్లి వివాదాలు సృష్టించి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని అభిప్రాయపడ్డారు. జాయింట్ వెంచర్స్ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు అధ్యక్షతన మున్సిపల్, హౌసింగ్, న్యాయశాఖ కార్యదర్శితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. వారంలోగా ఈ కమిటీ జాయింట్ వెంచర్ల సమస్యలకు పరిష్కారాలు చూపుతూ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కాలుష్య పరిశ్రమల నిర్వాహకులు నగరం విడిచి, ఔటర్ రింగ్ రోడ్డు బయటకు వెళ్తామని మంత్రివర్గ ఉపసంఘానికి విజ్ఞప్తి చేశారనీ, వాటిని పరిశీలించి సహకరించాలని చెప్పారు. పురపాలకశాఖ ఆధ్వర్యంలో నిరంతర ప్రక్రియగా జరిగే ప్లాట్ల బహిరంగ వేలంపై మంత్రివర్గ ఉపసంఘం అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంది. భూముల వేలాన్ని పటిష్టంగా నిర్వహించి ప్రభుత్వ ఖజానాకు అధిక ఆదాయం సమకూర్చాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. రాజీవ్ స్వగృహ పెండింగ్ ప్లాట్లపై కూడా మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష నిర్వహించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఐదెకరాల విస్తీర్ణంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు కోసం ఇండస్ట్రియల్ పార్కులు నిర్మించాలని పరిశ్రమల శాఖ అధికారులకు చెప్పారు. దీనివల్ల గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక చేయూత లభిస్తాయని అన్నారు. అలాగే మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించిన అంశాలు మినిట్స్ రూపంలో నమోదు చేయాలనీ, వచ్చే వారంలో జరిగే సమావేశానికి అధికారులు ఏం చర్యలు తీసుకున్నారో వివరిస్తూ నివేదికతో రావాలని చెప్పారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కే రామకృష్ణారావు, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, సీసీఎల్ఏ ...13లో



3లో..

ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం

- లోయలో పడిన బస్సు
- 36 మంది దుర్మరణం

గెజిట్ మేరకు సర్టిఫికెట్లలో పేరు మార్పు : హైకోర్టు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం పిటిషనర్‌కు చెందిన విద్యాపరమైన సర్టిఫికెట్లలో పేరు మార్పు రెండు వారాల్లోగా చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. తన పేరు మార్చుకున్నట్టు గెజిట్ జారీ అయినప్పటికీ ఎస్ఎస్‌సీ, ఇంటర్ బోర్డు, ఉస్మానియా యూనివర్సిటీ సర్టిఫికెట్లలో పేరు మార్పు చేయలేదంటూ హయత్‌నగర్‌కు చెందిన వి మధుసూదన్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. 1961లో జారీ చేసిన జీవో నెంబర్ 1263లో పేరు మార్పునకు వీలు లేకపోవడం అన్యాయమని తెలిపారు. పిటిషనర్ విజ్ఞప్తికి ప్రభుత్వం అంగీకారం చెప్పినందున పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె శ్రీనివాస్‌రావు డివిజన్ బెంచ్ ఇటీవల ప్రకటించింది.

మార్గదర్శి కేసు 7కి వాయిదా

తమ సంస్థ మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఇతరులు మీడియాతో మాట్లాడకుండా ఉత్తర్వులు ఇవ్వాలన్న ఆ సంస్థ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. మీడియాతో మాట్లాడకుండా ఆర్డర్ ఇవ్వాలని మార్గదర్శి ఫైనాన్సియర్స్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా సోమవారం హైకోర్టును కోరారు. తమ ముందున్న పిటిషన్‌పై విచారణ చేపట్టకుండానే ఉత్తర్వులు ఇవ్వబోమని హైకోర్టు స్పష్టం చేసింది. లూథ్రా వినతిపై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అభ్యంతరం చెప్పారు. సుప్రీంకోర్టు సూచన మేరకు హైకోర్టులో కేసు విచారణలో సహకారం మాత్రమే అందిస్తున్నట్టు వివరించారు. ఎవరి తరపున వకాల్తా తీసుకుని వాదించడం లేదన్నారు. రూల్స్‌కు విరుద్ధంగా మార్గదర్శి డిపాజిట్లను సేకరించిందనే కేసు తదుపరి విచారణను ఈనెల ఏడో తేదీకి వాయిదా వేసింది.

మంత్రి కోమటిరెడ్డితో యాదాద్రి జిల్లా ప్రజాప్రతినిధుల భేటీ

- సీఎం టూర్ నేపథ్యంలో చర్చ



నవతెలంగాణ -హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈనెల ఎనిమిదిన యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటన నేపథ్యంలో ఆ జిల్లా ప్రజాప్రతినిధులు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో భేటీ అయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రుల నివాసంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా యాదాద్రి-భువనగిరి జిల్లా సమస్యలపై చర్చించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవాలనీ, అలాగే ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో తీసుకుపోవాలని నిర్ణయించారు. ఈ భేటీలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవరెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలల బాలమేధావుల ప్రపంచ రికార్డు వేడుక

- 600 మ్యాథ్స్ ఫార్ములాలు ఏకకాలంలో

10 వేల మంది విద్యార్థులు పఠనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శ్రీచైతన్య పాఠశాలల్లో చదువుతున్న బాలమేధావుల ప్రపంచ రికార్డు వేడుకకు సన్నద్ధమవుతున్నారు. పది వేల మంది విద్యార్థులు 600 మ్యాథ్స్ ఫార్ములాలను ఏకకాలంలో పఠనం చేస్తారు. బుధవారం సాయంత్రం 5.30 గంటలకు తుది తీర్పు వెలువడే అవకాశమున్నది. ఇది ప్రపంచ రికార్డును తక్షణమే ప్రామాణీకరిస్తుంది. ఈ మేరకు శ్రీచైతన్య విద్యాసంస్థ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గణితంలో బాల మేధావుల ప్రతిభాపాటవాలను విశ్వవ్యాప్తం చేసేందుకు సంకల్పించి ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేసింది. దాన్ని విజయవంతంగా నిర్వహించడానికి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూకేతో కలిసి పనిచేస్తున్నది.

ఈ భాగస్వామ్యం ద్వారా భారీ స్థాయి విజయాలను అందించడానికి ప్రయత్నిస్తున్నది. విద్యార్థులకు ఉత్తమమైన విద్యను అందించడం మాత్రమే కాకుండా శ్రీచైతన్య సాధించే రికార్డులతో విద్యార్థులకు ప్రేరణ కల్పించాలనే లక్ష్యాన్ని కూడా నిర్దేశించుకుంది. చరిత్ర సృష్టించేందుకు సిద్ధంగా ఉన్న బాల మేధావులందరికీ శుభాకాంక్షలు తెలిపింది.

ఎంఈవోలకు ఎఫ్ఏసీ ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధం

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి ఎల్సీజీటీఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మండల విద్యాధికారులు (ఎంఈవో)గా పూర్తి అదనపు బాధ్యతలను సీనియర్ హెడ్మాస్టర్లకు అప్పగిస్తూ పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఇచ్చిన ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్సీజీటీఏ) తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం వీరాచారి, ఎం లక్ష్మీకాంతరెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆర్టికల్ 309 ప్రకారం, ఫండమెంటల్ రూల్స్ 49 ప్రకారం ఒక ప్రభుత్వ పోస్టులోకి జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులకు అదనపు బాధ్యతలను ఇవ్వరాదంటూ స్పష్టంగా ఉందని తెలిపారు.

అయినప్పటికీ పాఠశాల విద్యాశాఖ సంచాలకులు జిల్లా పరిషత్ హెచ్ఎంలకు ప్రభుత్వ పోస్టు అయిన ఎంఈవోగా అదనపు బాధ్యతలు ఇచ్చారని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమనీ, ఆ సంచాలకులు ఇచ్చిన ఎఫ్ఏసీ ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆ ఎఫ్ఏసీలలో ప్రభుత్వ స్కూళ్లలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇవ్వాలని సూచించారు. లేదంటే తమ న్యాయ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలి

- వేం నరేందర్‌రెడ్డికి టీఎస్‌జీహెచ్ఎంఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సర్వీసు రూల్స్ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్‌జీహెచ్ఎంఏ కోరింది. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్ సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. పాఠశాల విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పది నెలల్లో పరిష్కరించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సర్వీస్ రూల్స్ సమస్య వల్ల 20 ఏండ్లుగా ప్రధానోపాధ్యాయులకు పదోన్నతుల్లేవని పేర్కొన్నారు. తాము గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నప్పుడు క్లర్కుగా చేరిన వ్యక్తి పలు పదోన్నతులను పొంది ఇప్పుడు తమకే రెండంచెల పై స్థాయి అధికారిగా అంటే జిల్లా విద్యాధికారి (డీఈవో)గా వస్తున్నారని తెలిపారు. వారి వద్ద తాము కింది స్థాయిలో విధులు నిర్వహించాల్సిన ఇబ్బందికరమైన పరిస్థితులు వస్తున్నాయని వివరించారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల నామినీక్లేచర్‌ను ప్రిన్సిపల్‌గా మార్చాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారనీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానంటూ హామీ ఇచ్చారని తెలిపారు.

కోల్‌కతా అభయ కేసులో సీబీఐ విచారణ పూర్తి చేయాలి

దోషులను కఠినంగా శిక్షించాలంటూ ప్రదర్శన

- 9న ధర్నాలు, ఆందోళనలకు పిలుపు
- కుట్ర బయటపెట్టాలంటూ మహిళా సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ రౌండ్ టేబుల్ డిమాండ్
- త్వరలో గవర్నర్, మహిళా కమిషన్‌కు వినతులు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

పశ్చిమబెంగాల్ కోల్‌కత్తా ఆర్‌జీకర్ ఆస్పత్రి జూనియర్ డాక్టర్ అభయపై లైంగిక దాడి కేసులో సీబీఐ విచారణను సత్వరమే పూర్తి చేయాలని మహిళా సంఘాల ఐక్యకార్యాచరణ తెలంగాణ కమిటీ డిమాండ్ చేసింది. పూర్తిస్థాయి విచారణ ద్వారా కుట్రను ఛేదించి దోషులను కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేసింది. పశ్చిమబెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ చేస్తున్న ఆందోళనకు మద్దతు ప్రకటించింది. ఈమేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి నారాయణగూడ చౌరస్తా వరకు ప్రదర్శన నిర్వహించారు. ఇందులో పదుల సంఖ్యలో మహిళలు, విద్యార్థులు, న్యాయవాదులు, మెడికోలు, డాక్టర్లు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు. జూనియర్ డాక్టర్ అభయకు న్యాయం చేయాలి, మహిళలకు భద్రత కల్పించాలి, ఆర్‌జీకర్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. అనంతరం ఎస్‌వీకేలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, పీవోడబ్ల్యూ సంధ్య , ఏఎన్ఎఫ్‌డబ్ల్యూ నాయకులు జ్యోతి, కృష్ణకుమారి, పీవోడబ్ల్యూ ఝాన్సీ, పీవోడబ్ల్యూ అనుసూయ తదితర సంఘాల నాయకులు, డాక్టర్ ప్రతిభాలక్ష్మి(ఉస్మానియా), డాక్టర్ సమీర(మెడికో), అడ్వకేట్ లక్ష్మి, ఐఎఫ్‌టీ అనురాధ, పీడీఎస్‌యూ పద్మ, పీవైఎల్ ప్రదీప్, విజ్ఞాన దర్శిని రమేష్, సీఎంఎస్ అరుణ తదితరులు పాల్గొనగా వివిధ మహిళా సంఘాల నాయకులు నాగలక్ష్మి వరలక్ష్మి, అనసూయ అధ్యక్షత వహించారు. కోల్‌కత్తా ఘటన, డాక్టర్స్ ఫ్రంట్ ఆందోళన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం, భవిష్యత్తు కార్యాచరణపై రౌండ్‌టేబుల్‌లో చర్చించారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ పిలుపు మేరకు ఈనెల 9న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. కవాతులు, మానవహారాలు, నిరసన సమావేశాలు, సాంస్కృతిక నిరసన, పాటలు, నాటికల ద్వారా స్పందించి నిరసన తెలపాలని విజ్ఞప్తి చేశారు. జూనియర్ డాక్టర్లకు సీనియర్ డాక్టర్లు సంఘీభావం తెలిపి ఆందోళనల్లో భాగస్వాములు కావడాన్ని అభినందించారు. జూనియర్ డాక్టర్ అభయకేసులో సీబీఐ విచారణ నత్తనడకన సాగుతున్నదని తప్పుబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేసేందుకు రాష్ట్ర గవర్నర్, మహిళా కమిషన్‌కు వినతిపత్రాలు ఇవ్వనున్నట్టు తెలియజేశారు.

డాక్టర్ అభయకు అందరూ సంఘీభావం చెప్పాలని పిలుపునిచ్చారు. లైంగిక దాడికి పాల్పడిన ప్రిన్సిపాల్ ప్రతిష్టాత్మక సంస్థలో పోస్టింగ్ ఇవ్వడాన్ని ఖండించారు. అభయకు మద్దతుగా గత అక్టోబరు తొమ్మిదిన 70 మందికిపైగా సీనియర్ డాక్టర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేయడాన్ని స్వాగతించారు. డాక్టర్లకు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా మోడీ ప్రభుత్వం చడీచప్పుడు చేయకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు.

రుణమాఫీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి

గ్యారెంటీలు, డిక్లరేషన్ల పేరుతో కాంగ్రెస్ మోసం : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రైతురుణమాఫీ పూర్తిస్థాయిలో చేశామని గొప్పలు చెప్పుకోవడం గాదు..దమ్ము, చిత్తశుద్ధి ఉంటే రుణమాఫీ ఎంత మేరకు పూర్తయిందనే దానిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. డిక్లరేషన్‌లు, గ్యారెంటీలు ఇచ్చిన ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంకగాంధీలు ఎక్కడకు పోయారని ప్రశ్నించారు. తెలంగాణలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అని మోసం చేశారనీ, ఏడాది పూర్తికావస్తున్నా ఇచ్చిన హామీలు ఎప్పటిలోగా అమలు చేస్తారనే దానిపై స్పష్టత లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సర్కారు తెలంగాణలో సంపద పెంచేలా ఆలోచన చేయడం లేదనీ, కేవలం అప్పులను మొబలైజేషన్ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలివ్వలేని ఆర్థికశాఖ దివాళా తీసిందని చెప్పారు. 17 పంటలకు కనీస మద్దతు ధరతో బోనస్ ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని నిలదీశారు. జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణలో రుణమాఫీ చేశామని రాహుల్‌గాంధీ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఎక్కడ పూర్తిచేశారని ప్రశ్నించారు.

కౌలు రైతులకు రూ. 15 వేలు, రైతు కూలీలకు రూ. 12 వేలతో రైతు భరోసా ఏమైందని నిలదీశారు. నిరుద్యోగులకు రూ. 4 వేల భృతి, ప్రతి మహిళలకు రూ. 2500 ఆర్థిక సాయం, వివాహం చేసుకున్న అమ్మాయిలకు తులం బంగారం, విద్యార్థునులకు స్కూటీల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దళిత, గిరిజన బంధులు ఉన్నట్టా? లేనట్టా? అని అడిగారు.

ఎంసీహెచ్‌ల తరహాలో ఎన్‌సీడీ క్లినిక్స్

- అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మాతా, శిశు ఆరోగ్య కేంద్రాల (ఎంసీహెచ్) తరహాలో నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) క్లినిక్కులను ఏర్పాటు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రతి ఏటా ఎన్‌సీడీ వ్యాధులు పెరుగుతున్నాయనీ, వ్యాధుల్లో 60 శాతం ఎన్ సీడీకి సంబంధించి ఉంటున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ వ్యాధుల నియంత్రణతో పాటు, చికిత్సపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలనీ, ప్రజలకు తెలిసేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. బోధనాస్పత్రుల్లో ఈ క్లినిక్కులను ఏర్పాటు చేయాలనీ, ఇప్పటికే ఉంటే వాటిని ఆధునీకరించాలని సూచించారు. నిష్ణాతులైన వైద్యుల నియామకం, రోగనిర్ధారణ పరికరాలు, ఔషధాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. తర్వాత ఏరియా ఆస్పత్రుల వరకు వాటిని విస్తరించాలని కోరారు. ఆరోగ్యశ్రీ పనితీరుపై మంత్రి ఆరాతీశారు. గతంలో కంటే ఎక్కువ మంది ఆరోగ్యశ్రీ సేవలను ఉపయోగిం చుకుంటున్నారని అధికారులు మంత్రికి తెలిపారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీకి స్వాగత ఏర్పాట్లలో కాంగ్రెస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేడు హైదరాబాద్‌కు రాహుల్‌గాంధీ రానున్న నేపథ్యంలో ఆయనకు ఘనంగా స్వాగతం చెప్పేందుకు కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లలో మునిగింది. సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేసిన ఆయన, టీపీసీసీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారిగా వస్తున్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి బోయినపల్లి వరకు ఎనిమిది కిలోమీటర్లు ఆయన రోడ్డు మార్గంలో ఐడియాలజీ సెంటర్‌కు వెళ్లనున్నారు. దీంతో ఆ మార్గం భారీ కటౌట్లు, వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలను కార్యకర్తలు ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు, సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డితో పాటు మహేష్ కుమార్ గౌడ్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. హైదరాబాద్ చుట్టుపక్కల నాలుగు పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో ఇంఛార్జిలను మహేష్ కుమార్ గౌడ్ నియమించారు.

ఏడాది పాలనలో వందేండ్ల విధ్వంసం

- కాంగ్రెస్ నేతలు ప్రజలకు క్షమాపణ చెప్పాలి :

రాహుల్‌కు కేటీఆర్ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ఏడాది పాలనలో వందేండ్ల విధ్వంసం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి సోమవారం బహిరంగ లేఖ రాశారు. 'రైతులు, చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లు మీ పాలన మొదలు కాగానే ఆత్మహత్యలు చేసుకోవడం మొదలుపెట్టారు. ప్రతి వర్గాన్ని రోడ్డెక్కించారు. కంపెనీలు తరలిపోతున్నాయి. రాష్ట్ర ఆదాయం తగ్గిపోతోంది. పాలన అనుభవం లేని బ్లాక్ మెయిలింగ్ ముఖ్యమంత్రితో తెలంగాణ భవిష్యత్ ప్రమాదంలో పడింది. హైదరాబాద్‌లో నిరసనలు చేసేందుకు వీలు లేకుండా ఆంక్షలు పెట్టే దుస్థితి మీ ప్రభుత్వానిది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంచనా వేయకుండా నేల విడిచి మీరు చేసిన సాము కారణంగా రాష్ట్రం దివాళా అంచుకు చేరింది. తీరా చేయాల్సిన అన్యాయ మంతా చేసి కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జు ఖర్గే సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.

నేడు రాష్ట్రానికి రాహుల్ గాంధీ రాక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేడు రాష్ట్రానికి ఏఐసీసీ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ రానున్నారు. మంగళవారం బోయిన్‌పల్లి గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో కులగణన, కుటుంబ సర్వేపై జరగనున్న సంప్రదింపుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. సాయంత్రం 5 గంటలకి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయంకు చేరుకుంటారు. బేగంపేట విమానాశ్రయం నుంచి నేరుగా రోడ్డు మార్గాన గాంధీ ఐడియాలజీ సెంటర్‌కు చేరుకుంటారు. సాయంత్రం 5.30 నుండి 6.30 వరకు ఐడియాలజీ సెంటర్‌లో మేధావులతో మాట్లాడుతారు. గంటపాటు కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, మేధావులతో చర్చిస్తారు. రాహుల్‌గాంధీ.కులగణనపై మేధావుల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటారు. కులగణన ద్వారా జరిగే లాభాలను ఆయన వివరించనున్నారు. ఈ సమావేశంలో కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, నాయకులు, మేధావులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేసిన అభ్యర్థులు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, సలహాదారులు, కార్పొరేషన్ల చైర్మెన్లు సుమారు 400 మంది పాల్గొననున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన మహేష్ కుమార్ గౌడ్

గాంధీ ఐడియాలజీ కేంద్రంలో ఏర్పాట్లను సోమవారం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పరిశీలించారు. ఆయన వెంట రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి తదితరులున్నారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్ట్ అక్రమం

- మాజీ ఎమెల్యే చంటి కిరణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెండింగ్ బిల్లుల కోసం ఆందోళన చేస్తున్న మాజీ సర్పంచుల అరెస్ట్ అక్రమని మాజీ ఎమ్మెల్యే చంటి కిరణ్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పెండింగ్ బిల్లులను చెల్లించిన ప్రభుత్వం సర్పంచుల పెండింగ్ బిల్లులు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర పర్యటనకు వస్తున్న రాహుల్ కాంగ్రెస్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికల ముందిచ్చిన ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శిం చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్‌వీ అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, రఘురామ్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

అక్కడ అన్నీ సవాళ్లే !

పట్టణీకరణతో పెరుగుతున్న సమస్యలు

- మురికి వాడలే ఆవాసాలు
- వాతావరణ మార్పులు, అసమానతలతో కుదేలు
- వేధిస్తున్న మౌలిక వసతుల కొరత
- ప్రణాళికల రూపకల్పనలో వైఫల్యాలు

న్యూఢిల్లీ : ప్రస్తుతం ప్రపంచ పట్టణ జనాభా 4.7 బిలియన్లకు చేరుకున్నదని అంచనా. అంటే ఇది ప్రపంచ జనాభాలో 57.5 శాతం. 2050 నాటికి పట్టణ జనాభా రెట్టింపవుతుందని భావిస్తున్నారు. అయితే ప్రపంచంలోని పలు నగరాలు అనేక అసాధారణ సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.

సవాళ్లు ఇవే


నగరాలలో కనిపిస్తున్న ప్రధాన సమస్య వాతావరణ మార్పు. ఓ వైపు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీలు) సాధన కోసం కృషి జరుగుతుంటే మరోవైపు పట్టణ కేంద్రాలు పేదరికం, అసమానతలు, పర్యావరణం దెబ్బతినడం వంటి సవాళ్లతో కొట్టుమిట్టాడుతున్నాయి. ముఖ్యంగా ఆర్థికంగా, పారిశ్రా మికంగా అంతగా అభివృద్ధికి నోచుకోని దేశాలలో ఈ సవాళ్లు మరింత అధికంగా ఉంటున్నాయి. ఎందుకంటే అక్కడ పట్టణీకరణ వేగంగా జరిగిపోతోంది. మౌలిక సదుపాయాల కొరత అధికంగా ఉంది. వనరులేమో పరిమితంగా ఉన్నాయి. నగరాలలో గృహ నిర్మాణ సమస్య ఎక్కువగా కన్పిస్తోంది. ప్రజలకు రక్షిత మంచినీరు సరిగా లభించడం లేదు. పారిశుధ్య సమస్య గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. మరీ ముఖ్యంగా వాతావరణ సంబంధమైన పరిణామాలు చోటుచేసుకున్నప్పుడు పట్టణాలు, నగరాలు చిగురుటాకుల్లా వణికిపోతున్నాయి.

ఇండియాలో కాలం చెల్లిన ప్రణాళికలు

2021లో జనగణన జరగలేదు. దీంతో మన దేశంలో పట్టణ జనాభాపై సరైన సమాచారం అందుబాటులో లేదు. ప్రపంచబ్యాంక్ అంచనా ప్రకారం మన దేశంలో 40 శాతం మంది పట్టణాలలోనే నివసిస్తున్నారు. ప్రణాళికలు సరిగా లేకపోవడం, వాతావరణ మార్పులు, పెద్ద ఎత్తున జరుగుతున్న వలసలు, పెరుగుతున్న అసమానతలు, సామాజిక విభజన, ప్రభుత్వానికి ఉన్న పరిమితులు వంటివి దేశంలోని నగరాలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు. పట్టణ ప్రణాళికా సంస్థలకు ప్రధానంగా రెండు సమస్యలు



ఎదురవుతున్నాయి. ప్రాదేశిక, తాత్కాలిక ప్రణాళికలకు కాలం చెల్లిపోయింది. పెరుగుతున్న జనాభా అవసరాలను అవి తీర్చలేకపోతున్నాయి. 1980వ దశకం నుండి పారిశ్రామిక తిరోగమనం కారణంగా అహ్మదాబాద్, ఢిల్లీ, సూరత్, ముంబయి వంటి నగరాలలో నిరుద్యోగం పెరిగింది. ఉపాధి కోల్పోయిన వారు శివారు ప్రాంతాలకు తరలిపోవడంతో అవన్నీ జనసమ్మర్దంగా మారిపోయాయి. ప్రస్తుతం 40 శాతం పట్టణ జనాభా మురికి వాడలలోనే నివసిస్తోంది. ప్రణాళికలు తరచుగా ప్రజల అవసరాలపై కాకుండా పెట్టుబడుల వృద్ధి పైనే దృష్టి పెట్టాయి. దీంతో స్థానిక నాయకత్వం కొరవడింది. అది ప్రణాళిక రూపకల్పనలో భాగస్వామి కాలేకపోయింది. ఇక భారతీయ నగరాలను అతలాకుతలం చేస్తున్న మరో సమస్య వాతావరణ మార్పు. నగరాలలో జనాభా రోజురోజుకూ పెరిగిపోతోంది. దీంతో కాలుష్యం అధికమవుతోంది. దేశంలో అత్యంత కాలుష్య కేంద్రాలుగా పేరు తెచ్చుకున్న పది నగరాలలో ఎనిమిది ఢిల్లీ చుట్టుపక్కల ఉన్న ఎన్‌సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్) ప్రాంతంలోనివే.



పెరుగుతున్న అంతరాలు

ఒకప్పుడు నగరాలు, పట్టణాలు అంటే సామాజికంగా, మతపరంగా తటస్థంగా ఉండేవి. ఇప్పుడలా లేవు. అసమానతలు పెరిగిపోతున్నాయి. సంపన్నులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయి. అదే సమయంలో లక్షలాది మందికి తలదాచుకునేందుకు కనీసం గూడు కూడా లేదు. ఉదాహరణకు గురుగ్రామ్‌లో డీఎల్‌ఎఫ్‌కు చెందిన 'ది దహ్లియాస్' ప్రాజెక్టులో ఒక్కో ప్లాటు వెల రూ.100 కోట్లతో ప్రారంభమ వుతుంది. ఇటు చూస్తే రెండు కోట్ల మంది పట్టణ ప్రజలకు ఇళ్లు లేవు. నగరాల్లో దాదాపు 90 శాతం ఉద్యోగాలు అనధికారిక రంగం లోనివే. అక్కడ పని పరిస్థితులు దారుణంగా ఉంటాయి. ఉద్యోగ భద్రత ఉండదు.

భారత్‌లో పట్టణీకరణ

సంపన్న దేశాలతో పోలిస్తే భారత్‌లో పట్టణీకరణ భిన్నంగా ఉంది. పశ్చిమ దేశాలలో పట్టణీకరణతో పాటే పారిశ్రామికీకరణ కూడా జరుగుతుంది. గ్రామాల నుండి వలస వచ్చే కార్మికులకు ఉపాధి లభిస్తుంది. వలస పాలకుల కాలంలో ఇంగ్లండ్ ఆర్థిక వ్యవస్థకు భారత్ ఒక్కటే 45 ట్రిలియన్ డాలర్లు సమకూర్చిందని ఆర్థికవేత్త ఉత్సా పట్నాయక్ తెలిపారు. దీనికి భిన్నంగా మన దేశంలో పట్టణీకరణ ఆర్థికపరమైన ఇబ్బందులకు దారితీస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు, పట్టణాల నుండి గ్రామీణ ప్రాంతాలకు వలసలు కొనసాగుతున్నాయి. కోవిడ్ సమయంలో పట్టణ ప్రణాళికల్లోని డొల్లతనం బయటపడింది. పట్టణ ప్రాంతాల నుండే గ్రామాలకు వలసలు పెరగడం మౌలిక సదుపాయాల లేమిని సూచించింది.

పేరుకే పట్టణ ప్రభుత్వాలు

74వ రాజ్యాంగ సవరణ అమలులో ఉన్నప్పటికీ అనేక నగరాలు అప్రజాస్వామిక సంస్థల నియంత్రణలోనే ఉన్నాయి. నగరాలలో ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు ఉన్నా వారికి పట్టణ ప్రణాళికలపై పట్టు లేదు. వాటిని వ్యక్తులు లేదా ప్రైవేటు సంస్థలకు ఔట్‌సోర్సింగ్ ఇస్తారు. ఉదాహరణకు 12వ షెడ్యూలులోని 18 పనులలో కేవలం మూడింటిని మాత్రమే పట్టణ ప్రభుత్వాలకు బదిలీ చేశారు. అంతర్ ప్రభుత్వ బదిలీలలో నగరాలు జీడీపీలో కేవలం 0.5 శాతం మాత్రమే పొందుతున్నాయి.



ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం


- లోయలో పడిన బస్సు
- 36 మంది దుర్మరణం

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో మర్చులా సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ఘోర ప్రమాదంలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. 42 మంది ప్రయాణికులతో వెళుతున్న బస్సు అదుపు తప్పి లోయలో పడిపోయింది. కిరత్ నుండి రామ్‌నగర్ వెళుతుండగా బస్సు ప్రమాదానికి గురైందని అధికారులు తెలిపారు. ప్రమాద తీవ్రత అధికంగా ఉన్నదని, చాలా మంది ప్రయాణికులు బస్సులో నుండి ఎగిరి కింద పడ్డారని వారు చెప్పారు.

సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని జిల్లా విపత్తు నిర్వహణ అధికారి వినీత్ పాల్ అన్నారు. బస్సు 150 మీటర్ల లోయలో పడిపోయిందని ఉదయం 8.45 గంటలకు జిల్లా అధికారులకు సమాచారం అందింది. ఆ వెంటనే ధూమల్‌కోట్ నుండి స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయ కార్యక్రమాలు చేపట్టింది. కాగా ఈ ఘటనకు సంబంధించి కొందరు అధికారులను సస్పెండ్ చేశామని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ తెలిపారు. మృతుల కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయలు, గాయపడిన వారికి లక్ష రూపాయల చొప్పున పరిహారం ప్రకటించారు. ప్రమాదంపై మెజిస్టీరియల్ విచారణ ప్రారంభించాల్సిందిగా ఆదేశించారు. 'ఇది చాలా విచారకరమైన వార్త. సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించాము. ప్రమాదంలో గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలిస్తున్నారు. అవసరమైతే తీవ్రంగా గాయపడిన వారిని విమానాలలో తరలించాలని ఆదేశించాము' అని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపారు.

మహారాష్ట్ర డీజీపీని బదిలీ చేయండి

ప్రతిపక్షాల ఫిర్యాదుపై ఈసీ ఆదేశం



ముంబయి : మహారాష్ట్ర డీజీపీ రష్మీ శుక్లాను తక్షణమే బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాల ఫిర్యాదు మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. అత్యంత సీనియర్ అయిన మరో అధికారికి వెంటనే బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. నూతన డీజీపీ నియామకం కోసం మంగళవారం మధ్యాహ్నానికి ముగ్గురు ఐపీఎస్ అధికారుల పేర్లు పంపాలని సూచించింది.

డీజీపీ రష్మీ శుక్లా బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఆమె ఆ పదవిలో ఉంటే రాష్ట్రంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగవని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) నేత సంజయ్ రౌత్ శుక్రవారం ఆరోపించారు. 'రాష్ట్ర డీజీపీపై ఇది చాలా తీవ్రమైన ఆరోపణ. 2019లో మేము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు ఈ డీజీపీ బీజేపీ కోసం బహిరంగంగానే పనిచేశారు. మా ఫోన్లను ట్యాప్ చేసి, మా కార్యాచరణపై దేవేంద్ర ఫడ్నవీస్‌కు సమాచారం చేరవేశారు' అని ఆయన చెప్పారు. రష్మీ శుక్లాను పదవి నుండి తొలగించాలని గత నెల 31న పీసీసీ అధ్యక్షుడు నానా పటోలే కూడా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు ఓ లేఖ రాశారు. కాంగ్రెస్, శివసేన (ఠాక్రే), ఎన్సీపీ (శరద్ పవార్) సహా రాష్ట్రంలోని అన్ని ప్రతిపక్ష పార్టీల పట్ల ఆమె వివక్ష చూపుతున్నారని అందులో తెలిపారు. గత 20 రోజులలో రాష్ట్రంలో ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొని అనేక హింసాత్మక ఘటనలు జరిగాయని వివరించారు. ప్రతిపక్ష నేతలపై పెద్ద ఎత్తున కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రాగానే జార్ఖండ్‌లో డీజీపీని తొలగించారని అంటూ మరి మహారాష్ట్రలో ఆ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని అన్నారు. పూనే పోలీస్ కమిషనర్‌గా, రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం కమిషనర్‌గా పనిచేసినప్పుడు ఆమె ప్రతిపక్ష నేతల ఫోన్లను చట్టవిరుద్ధంగా ట్యాప్ చేశారని గుర్తు చేశారు.

ఇదా.. మర్యాద..!

డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలంటూ 'మర్యాద వారోత్సవాలు' నిర్వహించే ఆర్టీసీ అధికారులు.. సంస్థలో పనిచేసే కండక్టర్లు, డ్రైవర్లతో మాత్రం మర్యాద కాదు కదా.. కనీసం మనిషిగా చూడట్లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య చెప్పకుందామని ఆఫీస్‌కు వెళ్లిన ఉద్యోగుల్ని ఉన్నతాధికారులు కనీసం మాట్లాడడానికి కూడా ఇష్టపడట్లేదు. ఖాళీలను భర్తీ చేయకుండా డబుల్ డ్యూటీ చేయిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. కేఎంపీఎల్ పేరిట, టార్గెట్ మేరకు నగదు ఆదాయం తేలేదని, వేసిన డ్యూటీ చేయలేదంటూ చిన్న చిన్న కారణాల్ని చూపి ఇంక్రిమెంట్ల కోత, సస్పెండ్, రిమోల్ వంటి పనిషెంట్లకు గురి చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆర్టీసీ కార్మికులు తమ గోసను రవాణా శాఖ మంత్రికి విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రద్దు చేసిన యూనియన్లను పునరుద్ధరించాలని, గతంలో తీసుకొచ్చిన చట్టాల్లో మార్పులు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్టీసీలో.. పని భారం, వివక్ష

- డ్రైవర్ పోస్టుల ఖాళీతో అదనపు పని భారం
- కేఎంపీఎల్ రాకపోయినా చర్యలే
- నగదు టార్గెట్స్ పేర వేధింపులు, సస్పెండ్లు
- ఇబ్బందులు పడుతున్న వేలాది మంది ఉద్యోగులు
- యూనియన్లను పునరుద్ధరించాలని డిమాండ్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా 97 ఆర్టీసీ డిపోలుండగా, వీటి పరిధిలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, లెగ్జరీ, సూపర్ లెగ్జరీ బస్సులు కలిపి 9094 వరకు ఉన్నాయి. ఇందులో 6420 సొంత బస్సులు కాగా, 2738 అద్దెబస్సులు. 39767 మంది సిబ్బంది ఉన్నారు. మెదక్ రీజియన్ పరిధిలోని 8 ఆర్టీసీ డిపోల్లో 670 వరకు బస్సులు నడుస్తున్నాయి. మహాలక్ష్మి పేరిట మహిళలకు ఉచిత ప్రయాణం షురూ అయ్యాక ఒక్కో బస్సుల్లో రెండింతల మంది ప్రయాణిస్తున్నారు. ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. అయితే ప్రయాణికుల సంఖ్య పెరిగిన మేరకు బస్సులు, డ్రైవర్లు, కండక్టర్లను పెంచలేదు. పాత బస్సులతోనే కుస్తీ పడుతున్న ఆర్టీసీ కార్మికులు సంస్థకు ఆదాయాన్ని తెచ్చి పెడుతున్నారు. అదనపు పని భారాన్ని భరిస్తూ డబుల్ డ్యూటీలు చేస్తున్నా వేధింపులు తప్పట్లేదంటున్నారు.

పెరిగిన పని భారం

రాష్ట్రంలో ఫ్రీ జర్నీ ప్రారంభం కాకముందు ఉన్న ఉద్యోగులు ఇప్పుడు లేరు. పైగా పోస్టుల భర్తీ చేస్తామంటున్నారే తప్ప ఇప్పటివరకు ఆ ఊసే లేదు. రిటైర్మెంట్ తప్ప రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో ఉన్న వాళ్లతోనే అదనపు పని చేయిస్తున్నారు. ప్రతి డిపో పరిధిలో 15 నుంచి 20 డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దాంతో ఉన్న డ్రైవర్లకే డబుల్ డ్యూటీ వేస్తూ పనిచేయిస్తున్నారు. డ్రైవర్, కండక్టర్ ఇద్దరు చేయాల్సిన పనిని ట్రిమ్ డ్యూటీలంటూ డ్రైవర్‌తోనే చేయిస్తున్నారు. అతనే బస్సు నడుపుతూ టికెట్ తీసుకోవడం, నగదు ఆదాయం కోసం ప్రతి చోటా ఆపి ప్రయాణికుల్ని ఎక్కించుకోవడం, దించడంతో సమయం పడుతుంది. ఉదాహరణకు మెదక్ నుంచి జేబీఎస్‌కు ఒక ట్రిప్ పోయి వస్తే డ్యూటీ అయిపోయేది. ప్రస్తుతం రెండు ట్రిపులు పోయి రావాలి. అంటే అదనపు పని భారం అవుతుంది. ఒక్కో బస్సులో 40-50 మధ్యనే ప్రయాణికులు ఎక్కేది. ఫ్రీ ప్రయాణం అయ్యాక 80-90 మంది ప్రయాణికులు ఎక్కుతున్నారు. వీరందరికీ టికెట్ ఇష్యూ చేయడం కష్టంగా మారుతుందని చెబుతున్నారు. నారాయణఖేడ్ నుంచి యాదగిరిగుట్ట, మెదక్ నుంచి జేబీఎస్, నారాయణఖేడ్-జేబీఎస్, జహీరాబాద్-జేబీఎస్ రూట్లలో ఒక ట్రిప్ పోయి రావడానికి గతం కంటే అదనంగా 4 గంటల వరకు పడుతుంది. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ రోజుకు 8 గంటలు పనిచేయాలి. అలా వారంలో 48 గంటలు మాత్రమే డ్యూటీ చేయాలి. కానీ..! మహాలక్ష్మి పథకం వచ్చాక రోజుకు 12-16 గంటల వరకు పనిచేయిస్తున్నామని వాపోతున్నారు.

చిన్న చిన్న కారణాలతో పనిష్మెంట్లు

ఆర్టీసీలో ఆర్ఎం, డీఎం, సీఐ స్థాయిలో ఉన్న అధికారుల వేధింపులు అధికమయ్యాయని ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. చిన్న చిన్న కారణాల్ని చూపి పనిష్మెంట్స్ ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుబ్బాక డిపోలో 5 నిమిషాల ముందు బస్సు డిపోకు వచ్చినందుకు డ్రైవర్‌కు 6 నెలల ఇంక్రిమెంట్స్ రద్దు చేశారు. మెదక్ డిపోలో డ్యూటీ చేసి దిగిపోయే డ్రైవర్‌కు మళ్లీ డబుల్ డ్యూటీ వేశారు. అలా డ్యూటీ చేయను అన్నందుకు అతనిపై చర్యలు తీసుకున్నారు. డ్రైవర్లు ఆందోళన చేసినా అధికారుల తీరు మారలేదు. జహీరాబాద్ డిపో పరిధిలో 'లో ఎర్నింగ్ ఫర్ కిలో మీటర్ల' పేరిట చర్యలు తీసుకున్నారు. సింగిల్ డ్రైవర్ డ్యూటీకి వెళ్లనందుకు, ఇద్దరు కండక్టర్లు బయట తిట్టుకున్నారంటూ, డ్యూటీ మారిస్తే పోనందుకు ఇటీవల ఐదుగుర్ని సస్పెండ్ చేశారు. మహిళకు ఉచిత టికెట్ ఇచ్చాక టిమ్‌లో క్యాన్సిల్ అని కొట్టాలి. అలా చేయకుండా డబ్బుల టికెట్ ఇస్తే కండక్టర్‌పై చర్యలు తీసుకుంటురని చెబుతున్నారు. నగదు ఆదాయం బాగా తీసుకురావాలని టార్గెట్స్ ఇస్తున్నారు. అది రీచ్ కాకపోయినా ఇంక్రిమెంట్స్ కోత, సస్పెండ్ అంటూ బెదిరిస్తున్నారని చెప్పుకుంటే బాధపడుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పట్ల అమర్యాద.. వేధింపులు..

ఆర్టీసీలో రీజియన్ మేనేజర్లు, డిపో మేనేజర్లు, ఛీఫ్ ఇన్స్‌పెక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సంస్థకు ఆదాయం పెంచేందుకు కష్టపడి పనిచేస్తున్న కండక్టర్లు, డ్రైవర్ల పట్ల మాత్రం ఆర్ఎం, డీఎం, సీఐలు అమర్యాదగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పట్ల వివక్ష పూరితంగా వ్యవహరిస్తున్నట్టు పలువురు కండక్టర్లు, డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. ఇదేమిటని అడిగితే వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. మెదక్, దుబ్బాక, జహీరాబాద్, సంగారెడ్డి, గజ్వేల్1-ప్రజ్ఞాపూర్, సిద్దిపేట, నర్సాపూర్, నారాయణఖేడ్ అన్ని డిపోల్లోనూ వేధింపులు అధికమయ్యాయి. నిజామాబాద్, కరీంనగర్ లాంటి చోట్ల ఇలాంటి వేధింపులు జరిగాయని మీడియాలో వార్తలు వచ్చాయి. యూనియన్లను పునరుద్ధరించాలనే డిమాండ్ ఉంది.

ఆరోపణలు సరికాదు

వేధింపులు, కక్షసాధింపు చర్యలు అనేవి ఆరోపణలు మాత్రమే. తప్పులు జరిగితే చర్యలుంటాయి. పని భారం అందరిపైన పడుతుంది. సంస్థలో ఖాళీల్ని భర్తీ చేయడం, బస్సుల్ని పెంచడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ప్రభులత, ఆర్ఎం, మెదక్

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కెఎన్ రాజన్ కన్నుమూత

పార్టీ, ప్రజాసంఘాల నాయకుల నివాళి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంటరీ వ్యవహారాల ఇన్‌చార్జీగా పనిచేసిన కెఎన్ రాజన్ (79) కన్నుమూశారు. సోమవారం తెల్లవారుజామున ఉదయం ఐదు గంటలకు సికింద్రాబాద్ బోయగూడలోని స్వగృహంలో అనారోగ్యంతో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య కెఎన్ ఆశాలత, కూతురు ఉన్నారు. ఆయన భార్య ఆశాలత ప్రస్తుతం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. ఆయన విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు భావాలవైపు ఆకర్షితులయ్యారు. రాజన్ సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయంలో పార్లమెంటరీ వ్యవహారాల ఇన్‌చార్జీగా నాలుగు దశాబ్దాలపాటు సేవలందించారు. ఏకే గోపాలన్, ఈఎంఎస్ నంబూద్రిపాద్, బీటీ రణదివే, హరికిషన్ సింగ్ సూర్జిత్‌ల నాయకత్వంలో ఆయన పార్టీ వ్యవహారాలను చూశారు. వారి స్వస్థలం నాగ్‌పూర్. ఆయన తండ్రి తపాలా శాఖలో పనిచేశారు. పోస్టల్ యూనియన్ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. తర్వాత ఢిల్లీకి వెళ్లారు. అక్కడ పార్టీ కేంద్ర కార్యాలయం, పార్లమెంటరీ వ్యవహారాల ఇన్‌చార్జీగా నాలుగు దశాబ్దాలపాటు పనిచేసిన తర్వాత 2012లో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. అయితే కెఎన్ రాజన్ సతీమణి ఆశాలత తండ్రి ఆదినారాయణ తపాలా శాఖలో పనిచేశారు. పోస్టల్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా కార్మికవర్గానికి సేవలందించారు. ఆయన ఢిల్లీలో ఉన్నప్పుడే కెఎన్ రాజన్‌తో పరిచయం ఏర్పడింది. రాజన్‌కు 1974లో ఆశాలతతో వివాహమైంది. ఆశాలత స్వస్థలం సికింద్రాబాద్ బోయగూడ కావడంతో రాజన్ కూడా 2012 నుండి ఇక్కడికి వచ్చి నివాసముంటున్నారు. సోమవారం ఆయన మరణించడంతో వారి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయన భౌతిక కాయాన్ని సోమవారం సాయంత్రం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీకి కుటుంబ సభ్యులు అప్పగించారు. ఆయనకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ, ఐద్వా, సీఐటీయూ, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, తపాలా యూనియన్‌తో పాటు ఇతర ప్రజాసంఘాల నాయకులు తుదివీడ్కోలు పలికారు. ఆయన భౌతిక కాయాన్ని ఆయా సంఘాల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, టి జ్యోతి, డిజి నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం శ్రీనివాస్, జి జగదీశ్, జె బాబురావు, రాష్ట్ర నాయకులు కేవీఎస్ఎన్ రాజు, నగర నాయకులు ఎం శ్రీనివాసరావు, పీఎస్ఎన్ మూర్తి, ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్, ప్రతినిధి సోమయ్య, ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి, నాయకులు నాగలక్ష్మి, వినోద, శశికళ, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేశ్, పద్మశ్రీ, కూరపాటి రమేష్, ఉపాధ్యక్షులు ఎస్వీ రమ, కె ఈశ్వర్‌రావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ నాయక్, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, తపాలా యూనియన్ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



మేడ్చల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి భౌతికకాయం అప్పగింత

నిబద్ధతతో పని చేశారు : డీజీ నరసింహారావు

కెఎన్ రాజన్ నిబద్ధతతో పనిచేశారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు అన్నారు. రాజన్ సంతాప సభలో ఆయన మాట్లాడుతూ ఏకే గోపాలన్, ఈఎంఎస్ నంబూద్రిపాద్, హరికిషన్ సింగ్ సూర్జిత్‌ల కాలంలో పార్టీ కార్యాలయం, పార్లమెంటరీ వ్యవహారాల ఇన్‌చార్జీగా పనిచేశారని చెప్పారు.

విద్యార్థి దశ నుంచే ఆయన కమ్యూనిస్టు భావాలవైపు ఆకర్షితులయ్యారని అన్నారు. కార్మికోద్యమంలో పనిచేశారని వివరించారు. ఆయన మరణం పార్టీకి, కార్మికోద్యమానికి తీరని లోటని చెప్పారు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సంతాపం

కెఎన్ రాజన్ మరణం పట్ల సీపీఐ(ఎం) సంతాపం తెలిపింది. సోమవారం ఢిల్లీలో జరిగిన ఆ పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో ఆయన మరణం పట్ల సంతాప సూచకంగా మౌనం పాటించారు. దశాబ్దాలపాటు ఆయన పార్టీ పార్లమెంటరీ కార్యాలయంలో అంకితభావంతో పనిచేశారని పేర్కొంది.

పార్టీ ఎంపీల సహాయం కోసం వచ్చే వేలాది మంది ప్రజలకు చేదోడువాదోడు ఉండి వివిధ రూపాల్లో సహకారం అందించారని తెలిపింది. వివిధ అంశాలపై ఆయన చేసిన పరిశోధన పార్లమెంటులో ఎంపీలకు ఎంతగానో దోహదపడిందని గుర్తు చేసింది.

తమ్మినేని, శ్రీనివాసరావు సంతాపం

కెఎన్ రాజన్ మరణం పట్ల సీపీఐ(ఎం) తెలంగాణ, ఏపీ రాష్ట్రాల కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, వి శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. పార్టీ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులుగా పనిచేసినపుడు ఢిల్లీ కేంద్ర శాఖల ఇన్‌చార్జీగా రాజన్ పనిచేశారని శ్రీనివాసరావు అన్నారు. ఆ సమయంలో ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు.

అభ్యుదయ భావాలతో ప్రజల కోసం పనిచేశారు : మల్లు లక్ష్మి

విద్యార్థి దశ నుంచే అభ్యుదయ భావాలను అలవర్చుకుని కమ్యూనిస్టు పార్టీలో చేరి ప్రజల కోసం నిబద్ధతతో పనిచేశారని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆయన క్రమశిక్షణతో ఆదర్శంగా జీవించారని చెప్పారు. కుటుంబం కంటే పార్టీ కోసం ఎక్కువ సమయం ఇచ్చి పనిచేశారని వివరించారు. వారి ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు ఇచ్చే నివాళి అని అన్నారు.

సీఐటీయూ సంతాపం

కెఎన్ రాజన్ మరణం పట్ల సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ సంతాపం తెలిపారు. ఎకె గోపాలన్, నంబూద్రిపాద్, సూర్జిత్ వంటి దిగ్గజ కమ్యూనిస్టు నాయకుల హయాంలో రాజన్ నిబద్ధతతో పనిచేసి మన్ననలు పొందారని పేర్కొన్నారు.

మీరు వాయిదాలు వేయొచ్చుకానీ, కాలం మీ కోసం వాయిదాలు వేసి కూర్చోదు - బెంజిమన్ ఫ్రాంక్లిన్

సంపాదకీయం

అమెరికా ఎన్నికల్లో నరాలు తెగే ఉత్కంఠ!

అమెరికా ఎన్నికల్లో నరాలు తెగే ఉత్కంఠ. ఏం జరుగుతుందో తెలియని స్థితి. పది రోజులుగా వివిధ సంస్థలు జరుపుతున్న సర్వేలు స్థిరంగా ఒకశాతానికి అటూ ఇటూగా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ వైపే మొగ్గుచూపాయి. ఈ స్వల్ప తేడా ఓటింగ్ సమయానికి ఏ మాత్రం అటూ ఇటైనా ఫలితాలు తారుమారౌతాయి. గతంలో 2016లో సర్వేలన్నీ హిల్లరీ క్లింటన్ గెలుస్తారని చెప్పినప్పటికీ డోనాల్డ్ ట్రంప్ గెలిచాడు. అయితే దేశం మొత్తంగా జనం వేసిన ఓట్లు చూస్తే హిల్లరీకి 30లక్షలకు పైగా మెజారిటీ వచ్చినప్పటికీ 538 ఎలక్టరల్ కాలేజీలో ట్రంప్‌కు మెజారిటీ వచ్చింది. రెండువేల సంవత్సరంలో కూడా ఇదే మాదిరి ఫలితాలు వచ్చాయి. అదే మరోసారి పునరావృతం అవుతుందా? అంటున్న వారు కూడా లేకపోలేదు. ఎలక్టరల్ కాలేజీలో ఇద్దరికీ సమంగా వస్తే వాటితో పాటు ప్రతి రాష్ట్రం ఒక ఓటు చొప్పున వేసి ఫలితాన్ని నిర్ధారించాల్సి ఉంటుంది. అమెరికా చరిత్రలో ఇప్పటికి మూడు సార్లు అలా జరిగింది. ఈ సారి అదే పరిస్థితి వస్తే మొత్తం 50రాష్ట్రాలలో రిపబ్లికన్లు 26చోట్ల అధికారంలో ఉన్నందున ఒక్క ఓటు మెజారిటీతో ట్రంప్ గెలిచే అవకాశాలు లేకపోలేదు. ఇవన్నీ వివిధ దృశ్యాల ఊహాగానాలే. గత ఎన్నికల్లో జో బైడెన్‌కు 306, ట్రంప్‌కు 232 ఓట్లొచ్చాయి. అంతకు ముందు ఎన్నికల్లో ట్రంప్‌కు 304, హిల్లరీ క్లింటన్‌కు 227, ఇతరులకు ఏడు ఓట్లొచ్చాయి.

లోవా రాష్ట్రంలో గత రెండు ఎన్నికల్లో ట్రంప్‌కు మెజారిటీ వచ్చింది. తాజా సర్వేలో అక్కడి మహిళాఓటర్లు కమల వైపు మొగ్గు చూపుతున్నట్లు సర్వేలు వెల్లడించాయి. స్వింగ్ రాష్ట్రాలన్నింటా ఇదే వైఖరి ఉంటుందని ట్రంప్ విజయంపై ఆశలు పెట్టుకున్న బెట్టింగ్ బంగార్రాజులు కంగారు పడుతున్నట్లు వార్తలు. అమెరికా ఎన్నికల సమయంలో తిమ్మినిబమ్మిని చేయటంలో మీడియా, సామాజిక మాధ్యమాలు పెద్ద పాత్రనే పోషిస్తాయి గనుక చివరి క్షణంలో వచ్చే ఇలాంటి వార్తలను ఎంతవరకు నమ్మాలో తెలియదు.



సాంప్రదాయంగా డెమోక్రాట్లు, రిపబ్లికన్లకు మెజారిటీ వచ్చే రాష్ట్రాలలో అదే పరిస్థితి ఉన్నప్పటికీ ఏడు రాష్ట్రాలలో ఓటర్ల నాడి ఎలా ఉందో తెలియటం లేదు. వీటిని స్వింగ్ రాష్ట్రాలు అంటున్నారు. అంటే ఎటుమొగ్గేదీ చివరివరకు తెలియదు. పదిశాతం మంది రెండు రోజుల ముందువరకు ఎవరికి ఓటువేసేదీ నిర్ణయించు కోలేదని చెబుతున్నారు. ఏడింటిలో గత ఎన్నికల్లో ఆరుచోట్ల డెమోక్రాట్లు మెజారిటీ తెచ్చుకోగా ఒక రాష్ట్రంలో రిపబ్లికన్లు పైచేయి సాధించారు. బైడెన్ గెలిచాడు. అంతకుముందు ఎన్నికల్లో అధిక రాష్ట్రాల్లో రిపబ్లికన్లు గెలవటంతో ట్రంప్ నెగ్గాడు. తాజా ఎన్నికల్లో ఇది రాసిన సమయానికి నాలుగు రాష్ట్రాలో డెమోక్రాట్లు, మూడుచోట్ల రిపబ్లికన్లు మెజారిటీలో ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. అందుకే నరాలు తెగే ఉత్కంఠ కారణంగా ట్రంప్-కమల ఈ రాష్ట్రాల్లో సుడిగాలి పర్యటనలు జరిపారు. లోవా రాష్ట్రంలో గత రెండు ఎన్నికల్లో ట్రంప్‌కు మెజారిటీ వచ్చింది. తాజా సర్వేలో అక్కడి మహిళాఓటర్లు కమల వైపు మొగ్గు చూపుతున్నట్లు సర్వేలు వెల్లడించాయి. స్వింగ్ రాష్ట్రాలన్నింటా ఇదే వైఖరి ఉంటుందని ట్రంప్ విజయంపై ఆశలు పెట్టుకున్న బెట్టింగ్ బంగార్రాజులు కంగారు పడుతున్నట్లు వార్తలు. అమెరికా ఎన్నికల సమయంలో తిమ్మినిబమ్మిని చేయటంలో మీడియా, సామాజిక మాధ్యమాలు పెద్ద పాత్రనే పోషిస్తాయి గనుక చివరి క్షణంలో వచ్చే ఇలాంటి వార్తలను ఎంతవరకు నమ్మాలో తెలియదు. మహిళలు, రెడ్ ఇండియన్లు (అమెరికాలో ఆదివాసులు), వలసొచ్చిన వారు,స్పానిష్ భాష మాట్లాడే వారంతా ట్రంప్‌ను ఓడించేందుకు ముందుగానే పోలింగ్ కేంద్రాలకు వచ్చినట్లు కూడా కొన్ని వార్తలొచ్చాయి.గత ఎన్నికల్లో స్వింగ్ రాష్ట్రాలన్నింటా రెడ్ ఇండియన్లు డెమోక్రాట్లవైపు మొగ్గటంతో స్వల్ప మెజారిటీలతో బైడెన్ గెలిచాడు.

పోలింగ్ తరువాత తమ విజయ రహస్యాన్ని వెల్లడిస్తామని న్యూయార్క్ సభలో ట్రంప్ ప్రకటించాడు. అంతకు ముందు భారీ సంఖ్యలో పోల్ అవుతున్న ముందస్తు ఓట్లను చూస్తే అక్రమాలు జరుగుతున్నట్లుగా అనుమానం ఉందని ట్రంప్ అన్నాడు. అమెరికా దురాక్రమణకు గురైందంటూ రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నాడు. పరుషపదజాలం, నోటి దురుసు సరేసరి. ఈ వ్యాఖ్యలపై వెలువడుతున్న భాష్యాలను చూస్తే తన ఓటమిని ట్రంప్ పసిగట్టాడని, అందుకే తాను ఓడితే ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లే అని ప్రచారం చేస్తున్నట్లు చెబుతున్నారు. గత ఎన్నికల్లో ఓటమిని అంగీకరించకుండా 2021జనవరి ఆరున ఫలితాలను ఖరారు చేసే అమెరికా అధికార కేంద్రం కాపిటల్ హిల్‌పై తన అనుచరులతో చేయించిన దాడి పునరావృతం అవుతుందేమో అని కూడా భయపడుతున్నారు. ఇలాంటి ఫాసిస్టు శక్తిని ఓడించాలని అమెరికా కమ్యూనిస్టు పార్టీ ఓటర్లకు పిలుపునిచ్చింది. ప్రాజెక్టు 2025పేరుతో అమెరికాను అగ్రస్థానంలో నిలుపుతానంటూ కార్మికవ్యతిరేకమైన అజెండాతో ట్రంప్ ముందుకు వచ్చినట్లు పేర్కొన్నది. డెమోక్రాట్లు గెలిస్తే కార్మికవర్గ హక్కుల రక్షణకు పోరాటాలు చేసేందుకు అవకాశం ఉంటుందని, ట్రంప్ అత్యంత ప్రమాదకారి అని పేర్కొన్నది. కమ్యూనిస్టులు, అభ్యుదయ వాదులు ఉన్నంతలో ఎవరు తక్కువ ప్రమాదకారి అని ఎంచుకోవటం తప్ప, ఎవరు గెలిచినా అమెరికా బహుళజాతి గుత్త సంస్థల అజెండాను ముందుకు తీసుకుపోవటం తప్ప మరొకటి కాదన్నది గత చరిత్ర రుజువు చేస్తున్నది.

ఆర్థిక సిద్ధాంతాల మాయాజాలం



ప్రభాత్ పట్నాయక్

ఇప్పుడు "ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం"గా పిలవబడేదంతా సత్యాన్ని వెలికితీసే లక్ష్యంతో కాకుండా దానిని మసిపూసి మారేడుకాయ చేసే లక్ష్యంతో నడుస్తోంది. ఆర్థిక శాస్త్రానికి ఉన్న ఈ సైద్ధాంతిక స్వభావాన్ని కార్ల్‌మార్క్స్ లోతుగా గ్రహించాడు గనకనే 'సాంప్రదాయ ఆర్థిక శాస్త్రం', 'అసభ్యకర ఆర్థిక శాస్త్రం' (వల్గర్ ఎకనామిక్స్) అని రెండు రకాలుగా ఆర్థిక శాస్త్రాన్ని వేరుచేసి చూడాలని చెప్పాడు. ఈ రెండో రకపు అర్థశాస్త్రం ఉత్పత్తి ప్రక్రియను పట్టించు కోదు. మారకం మీద మాత్రమే తన దృష్టినంతటినీ పెడుతుంది. ఆ మారకం జరిగే మార్కెట్‌లో పాల్గొనే ప్రతీ వ్యక్తీ ఒకేస్థాయిలో ఉంటాడు కనుక ఉత్పత్తి రంగంలో జరిగే దోపిడీ సంగతి పూర్తిగా మరుగున పడిపోతుంది.

పెట్టుబడిదారీ విధానంలో అదనపు విలువ ఎలా వస్తుంది అన్న అంశం మీద మార్క్స్ ప్రధానంగా తన దృష్టి నంతా సారించాడు. కనుక ఆ కోణం నుంచే ఆర్థికశాస్త్రం సైద్ధాంతిక స్వభావాన్ని ఆయన చర్చించాడు. ఐతే, మొత్తం వ్యవస్థను పరిశీలించే విషయంలో 'ప్రధాన స్రవంతి ఆర్థికశాస్త్రం' సామ్రాజ్యవాదం అనేది ఒకటుందని గుర్తించదు. సామ్రాజ్యవాదాన్ని పట్టించు కోకపోవడం కాదు.అసలు సామ్రాజ్యవాదం అనేది ఉనికిలో ఉన్న వాస్తవాన్ని అది నిరాకరిస్తుంది.

ఇలా అంటున్నానంటే, ప్రస్తుతం ఆర్థిక శాస్త్ర రంగంలో ఉన్న పండితులందరిలోనూ నిజాయితీ లోపించిందని భావించకూడదు. వారి సిద్ధాంతం సంచరించే పరిధిని దాటడం వారికి సాధ్యం కావడం లేదు. అంతే. బోధనా రంగాన్ని వృత్తిగా ఎంచుకున్న వారు తమ వృత్తిలో పై స్థానాలకు ఎదగాలంటే, వారి పరిశోధనలు ప్రచురించ బడాలంటే, వారికి అవార్డులు, పదవులు రావాలంటే వారు 'ప్రధాన స్రవంతి ఆర్థికశాస్త్రం' పరిధిని అతిక్రమించ కుండా దానికి లోబడే వ్యవహరించాల్సి వుంటుంది. ఆ పరిధిని గనుక అతిక్రమించి 'సామ్రాజ్యవాదం' వంటి అంశాలను చర్చించడానికి పూనుకుంటే అందుకు వారు భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుంది. అందుచేత చాలా మంది ఆర్థిక శాస్త్ర పండితులు ఆ పరిధులకు లోబడే నడుచుకోడానికి నిర్ణయించుకుంటారు. ఆ 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' అనేదానిలోనే సామ్రాజ్యవాదం అన్న విషయం కనిపించదు కనుక వారు దాని ఊసెత్తరు. అంతే తప్ప వారంతా నిజాయితీ లేని పండితులు అని, కావాలనే వారంతా అలా వ్యవహరిస్తున్నారని మనం అనుకోవద్దు.

ఒకటి, రెండు ఉదాహరణలతో ఈ విషయాన్ని బాగా గ్రహించవచ్చు. మొదటిది ఆర్థికవృద్ధికి సంబంధించిన సిద్ధాంతం. 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' పెట్టుబడిదారీ సమాజంలో శ్రామికజనం వృద్ధి చెందే రేటుతో ఆ సమా జపు ఆర్థికవృద్ధిని ముడిపెట్టి చూస్తుంది. అంటే ఆ సమాజంలో జనాభా సహజంగా పెరిగే రేటుతో అది ముడిపడి వుంటుందని



భావిస్తుంది. ఈ దృక్పథంలో ఉన్న లోపం ఏమంటే అది సమాజం మొత్తంగా ఉన్న డిమాండ్ తాలూకు పాత్రను అది గుర్తించదు. ఆ దృక్పథం 'సే' సూత్రాన్ని విశ్వసిస్తుంది. సమాజంలో ఎంత ఉత్పత్తి అవుతుందో అదంతా చెల్లుబాటు అయిపోతుంది అని 'సే' సూత్రం అంటుంది. ఎక్కడైనా సూక్ష్మ స్థాయిలోనో, తాత్కాలికంగానో డిమాండ్ కొరత రావచ్చునేమో తప్ప మొత్తం మీద మార్కెట్‌లో ఎంత ఉత్పత్తి వస్తుందో అంత మేరకు సరిపడా డిమాండ్ ఉంటుందని ఆ సూత్రం చెప్తుంది. కాని ఇది చారిత్రికంగా చూసినప్పుడు వాస్తవం కాదు.

అమెరికా, కెనడా వంటి 'కొత్త ప్రపంచపు' దేశాలలో పెట్టుబడిదారీ విధానం నడవడానికి కావలసిన శ్రామిక జనాన్ని అందించడం కోసం 19వ శతాబ్దం వరకూ దాదాపు రెండు కోట్లమంది ప్రజలను ఆఫ్రికా నుండి బానిసలుగా పట్టి తెచ్చి నియోగించారు. వారిచేత గనుల్లో, తోటల్లో పని చేయించారు. అదే విధంగా భారత దేశం నుండి, చైనా నుండి దాదాపు ఐదు కోట్ల మంది శ్రామికులను ముందస్తు ఒప్పందాలు కుదుర్చుకుని ఆ కొత్త ప్రపం చానికి తరలించారు. ఇది దాదాపు మొదటి ప్రపంచ యుద్ధం దాకా కొనసాగింది. (అంతకు ముందే యూరప్ నుంచి దాదాపు ఐదు కోట్ల మంది ప్రజానీకం ఇష్టపూర్వకంగానే కొత్త ప్రపంచానికి వలసలు వచ్చారు. ఆ కొత్త ప్రపంచంలో అంతవరకూ జీవిస్తున్న స్థానికులను వారి ఆవాసాల నుండి తరిమివేసి ఆ భూములను ఆక్రమించుకున్నారు)

పెట్టుబడిదారీ విధానం విస్తరణ క్రమంలో ఇంత భారీ స్థాయిలో జనాభా ఒక దగ్గరినుండి మరొక చోటికి తరలించబడడం అనేది 'ప్రధాన స్రవంతి ఆర్థిక సిద్ధాంతం' చెప్పే వృద్ధి సిద్ధాంతానికి పూర్తిగా భిన్నంగా జరిగింది. జనాభా సహజ వృద్ధి మీద ఆధారపడి ఆర్థిక వృద్ధి జరుగుతుందనే ఆ సిద్ధాంతం ఇక్కడ వర్తించలేదు. అయినప్పటికీ, వాళ్లు ఇప్పటికీ అదే వృద్ధి సిద్ధాంతాన్ని ప్రవచిస్తున్నారు. ఒకవేళ 'సామ్రాజ్యవాదం' అనేది లేకపోయినట్లైతే ఈ వృద్ధి సిద్ధాంతం చెల్లుతుంది కదా అనే వాదన చేసినవాళ్లు ఉన్నారు. ఆస్ట్రియా కు చెందిన ఆట్టో బేయర్ అనే మార్క్సిస్టు ఈ విధమైన వాదనలనే చేశాడు. కాని పెట్టుబడిదారీ విధానం తన అవసరాల కోసం సాగించిన భారీ స్థాయి జనాభా తరలింపులను అతను గుర్తించనేలేదు. "21వ శతాబ్దంలో పెట్టుబడి" అనే గ్రంథాన్ని 2013లో రచించిన థామస్ పికెటీ సైతం చారిత్రకంగా ఖండాంతరాలను దాటి జరిగిన శ్రామిక జనుల నిర్బంధ తరలింపును తన సిద్ధాంతంలో పరిగణనలోకి తీసుకోలేదు.

ఇక రెండో ఉదాహరణ స్వేచ్ఛా వాణిజ్యానికి సంబంధించిన సిద్ధాంతం. స్వేచ్ఛా వాణిజ్యం ద్వారా ప్రతీ దేశమూ ప్రయోజనం పొందుతుంది అని ఈ సిద్ధాంతం చెప్తుంది. ప్రతీ దేశంలోనూ ఉత్పత్తి విధానంలో ఉండే అన్ని అంశాలూ (పరిశ్రమలు పూర్తి కెపాసిటీ మేరకు నడవడం, ముడిసరుకులు పూర్తి స్థాయిలో సరఫరా కావడం, కార్మికులు పూర్తి స్థాయిలో పనుల్లో నియోగించబడడం వగైరా) పూర్తి వినియోగంలో ఉంటాయన్నది ఈ సిద్ధాంతానికి ప్రాతిపదిక. స్వేచ్ఛా వాణిజ్యానికి అనుమతి నిచ్చిన తర్వాత కూడా ఉత్పత్తి విధానంలోని అన్ని అంశాలూ పూర్తి స్థాయిలో వినియోగించ బడుతూనే వుంటాయని, ఐతే, ఏ దేశం ఏ యే ఉత్పత్తులు చేస్తుందనేది మాత్రం మారుతుందని ఈ సిద్ధాంతం భావిస్తుంది. ప్రతీ దేశమూ తన వనరులను వినియోగించుకుంటూ మొత్తం ప్రపంచ మార్కెట్‌కు తగినట్టు పూర్తి స్థాయిలో ఉత్పత్తిని చేపడుతుందని, వివిధ దేశాల మధ్య పరస్పర సహకారం ఏర్పడుతుందని, దాని వలన అన్ని దేశాలూ వృద్ధి చెందుతాయని ఈ సిద్ధాంతం భావిస్తుంది. పరస్పర పోటీలో నిలదొక్కుకోగలిగినవారే మిగులుతారనే పోటీ సిద్ధాంతాన్ని అది తిరస్కరిస్తుంది.

అయితే ఇలా అన్ని దేశాలూ పూర్తి స్థాయిలో ఉత్పత్తిని చేపట్టగలగాలంటే ఆ ఉత్పత్తిని అంతటినీ పూర్తిగా వినియోగించగలిగే డిమాండ్ ఉండి వుండాలి. కాని ప్రపంచం మొత్తం మీద ఎంత డిమాండ్ ఉంటుందో అంతమేరకే ఉత్పత్తిని చేపట్టడం జరుగుతుంది కాని అందుకు భిన్నంగా కాదు. ఉన్న డిమాండ్‌కు మించి ఉత్పత్తి చేస్తే ఆ సరుకులు చెల్లుబాటు కాకుండా మిగిలిపోతాయి. అందుచేత ఒకానొక దేశంలో గనుక ఉత్పత్తి పెరిగితే, అది మరొక దేశంలో ఉత్పత్తి తగ్గిపోడానికి దారితీస్తుంది. అంటే స్వేచ్ఛా వాణిజ్యం ఫలితంగా అన్ని దేశాలూ వృద్ధి చెందుతాయనే వాదన చెల్లదు. కొన్ని దేశాలు బాగుపడడానికి మరికొన్ని దేశాల పరిస్థితులు దెబ్బ తినవలసిన పరిస్థితులను స్వేచ్ఛా వాణిజ్యం కల్పిస్తుంది. అందుకే వివిధ దేశాల నడుమ మార్కెట్ల మీద పట్టు కోసం పోరాటం జరుగుతూ వుంటుంది. ఇలా మార్కెట్లమీద అదుపు సాధించే లక్ష్యమే సామ్రాజ్యవాదం అనే స్వభావానికి మూలం. వాణిజ్యం అనేది ఒక పోరాటంగా చూడడం బదులు. అది పరస్పర సహకారంతో జరుగుతుందని చెప్పడం ద్వారా 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' సామ్రాజ్యవాదం అనే లక్షణాన్ని పూర్తిగా మరుగుపరుస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించే సిద్ధాంతవేత్త అయినప్పటికీ జాన్ మేనార్డ్ కీన్స్ ఈ మార్కెట్ల కోసం దేశాల నడుమ జరిగే పోరాటాన్ని గుర్తించాడు. అందుకే అతడు 'సే' సూత్రాన్ని తిరస్కరించాడు. ఒకానొక దేశం తన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకోవాలంటే మార్కెట్ల కోసం పోటీ పడవలసిందేనని అతడు తెలిపాడు. అటువంటి పోటీని తట్టుకోవాలంటే దేశీయ మార్కెట్‌లోని డిమాండ్‌ను బలోపేతం చేయాల్సి వుంటుందని, పూర్తిస్థాయిలో అందరికీ ఉపాధి కల్పించేవిధంగా ప్రభుత్వం జోక్యం కల్పించుకున్నప్పుడే దేశీయ డిమాండ్ బలపడుతుందని కీన్స్ ప్రతిపాదించాడు. అదే విధంగా దేశీయ మార్కెట్‌ను, ఉత్పత్తిదారులను, అంతర్జాతీయ పోటీ తాకిడినుండి కాపాడ డానికి సైతం ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని అతను చెప్పాడు. అంటే స్వేచ్ఛా వాణిజ్యం ప్రయోజనకరం అనే సిద్ధాంతాన్ని అతడు తిరస్కరించడాన్నమాట.

కాని ఇప్పటికీ, స్వేచ్ఛా వాణిజ్యం సిద్ధాంతాన్ని చిలక పలుకుల్లా వల్లించేవారు ఉన్నారు. వారంతా మార్కెట్ మొత్తం మీద డిమాండ్‌కు ఏర్పడే కొరతను పరిగణనలోకి తీసుకోరు. అందువలన మార్కెట్ కోసం అనివార్యంగా తీవ్రమైన పోటీ ఉంటుందనే వాస్తవాన్ని వారు గుర్తించలేకపోతున్నారు. ఆ పోటీ సామ్రాజ్యవాదానికి దారి తీస్తుందని వారు గుర్తించరు. నిజానికి సామ్రాజ్యవాదం అనే ధోరణిని కప్పిపుచ్చడానికే వాళ్ళు స్వేచ్ఛా వాణిజ్యం సిద్ధాంతాన్ని ముందుకు తెస్తున్నారు. దానిని సమర్థించుకోడానికి కాలం చెల్లిన 'సే' సూత్రాన్ని జపిస్తున్నారు.

మూడో ప్రపంచ దేశాలలో పరిశ్రమలను వలసపాలన కాలంలో నాశనం చేయడం, ఆ దేశాలకు తమ పారిశ్రామిక సరుకులను పెద్దఎత్తున దింపి మార్కెట్‌ను చేజిక్కించుకోవడం చారిత్రక వాస్తవం. కాని, ఈ చారిత్రక అనుభవాన్ని కూడా స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతకారులు గుర్తించరు. అందుచేత మూడో ప్రపంచ దేశాలలో నెలకొన్న పేదరికానికి మూలం సామ్రాజ్యవాదుల దోపిడీయే అన్న సత్యాన్ని, సంపన్న దేశాలతో వాణిజ్యం నిజానికి మూడో ప్రపంచ దేశాలకు ప్రతికూలంగా ఉంటుందనే సత్యాన్ని వారు కప్పిపుచ్చే పనిలో ఉన్నారు.అందుకే ఈ 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' అనేది నిష్పాక్షికమైనదేమీ కాదు. అది సామ్రాజ్యవాద దోపిడీని కప్పిపుచ్చే సైద్ధాంతిక మాయాజాలం.

(స్వేచ్ఛానుసరణ)

ఒకటి, రెండు ఉదాహరణలతో ఈ విషయాన్ని బాగా గ్రహించవచ్చు. మొదటిది ఆర్థికవృద్ధికి సంబంధించిన సిద్ధాంతం. 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' పెట్టుబడిదారీ సమాజంలో శ్రామికజనం వృద్ధి చెందే రేటుతో ఆ సమా జపు ఆర్థికవృద్ధిని ముడిపెట్టి చూస్తుంది. అంటే ఆ సమాజంలో జనాభా సహజంగా పెరిగే రేటుతో అది ముడిపడి వుంటుందని భావిస్తుంది. ఈ దృక్పథంలో ఉన్న లోపం ఏమంటే అది సమాజం మొత్తంగా ఉన్న డిమాండ్ తాలూకు పాత్రను అది గుర్తించదు. ఆ దృక్పథం 'సే' సూత్రాన్ని విశ్వసిస్తుంది. సమాజంలో ఎంత ఉత్పత్తి అవుతుందో అదంతా చెల్లుబాటు అయిపోతుంది అని 'సే' సూత్రం అంటుంది. ఎక్కడైనా సూక్ష్మ స్థాయిలోనో, తాత్కాలికంగానో డిమాండ్ కొరత రావచ్చునేమో తప్ప మొత్తం మీద మార్కెట్‌లో ఎంత ఉత్పత్తి వస్తుందో అంత మేరకు సరిపడా డిమాండ్ ఉంటుందని ఆ సూత్రం చెప్తుంది. కాని ఇది చారిత్రకంగా చూసినప్పుడు వాస్తవం కాదు.

మూడో ప్రపంచ దేశాలలో పరిశ్రమలను వలసపాలన కాలంలో నాశనం చేయడం, ఆ దేశాలకు తమ పారిశ్రామిక సరుకులను పెద్దఎత్తున దింపి మార్కెట్‌ను చేజిక్కించుకోవడం చారిత్రక వాస్తవం. కాని, ఈ చారిత్రక అనుభవాన్ని కూడా స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతకారులు గుర్తించరు. అందుచేత మూడో ప్రపంచ దేశాలలో నెలకొన్న పేదరికానికి మూలం సామ్రాజ్యవాదుల దోపిడీయే అన్న సత్యాన్ని, సంపన్న దేశాలతో వాణిజ్యం నిజానికి మూడో ప్రపంచ దేశాలకు ప్రతికూలంగా ఉంటుందనే సత్యాన్ని వారు కప్పిపుచ్చే పనిలో ఉన్నారు.అందుకే ఈ 'ప్రధాన స్రవ ంతి ఆర్థిక శాస్త్రం' అనేది నిష్పాక్షికమైనదేమీ కాదు. అది సామ్రాజ్యవాద దోపిడీని కప్పిపుచ్చే సైద్ధాంతిక మాయాజాలం.

ఎన్నో దాటెళ్లాలి..!

ఎన్నో నాదులు అవలీలగా
ఆడుతుంటేనే నేనింతసేపు
నడవగలుగుతున్నాను..
ఎన్నో బతుకు చిత్రాలు
మెదల్లో కదిలితేనే నేనింత భారం
మోయగలుగుతున్నాను..
ఇంకెన్నో జీవన దారుల ఒంపుల్ని
ఎన్ని మెలికలు తిరిగితేనో
సత్తువలేని పాదాల్ని
కదపగలుగుతున్నాను..

ఎన్ని పేగులు మెలికలు పడితేనో
ఆకలి తీరే గమ్యం వైపు
ఆత్రుతగా పయనం సాగిస్తున్నాను..
ఎన్నో రాళ్లు పాదాలకు గుచ్చుకుంటేనే
నాలుగు రాళ్లను
వెనకేయగలుగుతున్నాను..

ఎన్ని లక్షల అడుగుల్ని
ఈ నేలపై పరిస్తేనే
అనుకున్న గమ్యాన్ని
చేరుకోగలిగాను..
ఎన్ని జెండాలను మోయగలిగితేనో
ముద్దరేసిన వేలును శుభ్రం
చేసుకోగలిగాను..
ఎన్ని బతుకు చిత్రాల్ని
గీయగలిగితేనో
సగటు జీవనాన్ని
ఈదగలుగుతున్నాను...

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

'ధర్మ' పోరాటం...స్ఫూర్తిదాయకం



పి.సోమయ్య
9490098043

నేడు ధర్మా ప్రథమ వర్ధంతిని గిరిజన సమ్మేళనం రూపంలో జరుపు కుంటున్నాం. క్యాన్సర్ మహమ్మారితో జీవన,మరణ పోరాటం చేసి 2023 నవంబరు 5న ధర్మా కన్నుమూశాడు. అనారోగ్యంతో వున్నప్పుడు గతేడాది అక్టోబరు 19న ఆయన్ను చూడ్డానికి నేను, పగడాల నాగేశ్వరావు ఇద్దరం కలిసివెళ్లాం. ఖమ్మంలో తన కూతురి ఇంట్లో ఉన్నాడు. మంచి ఆరోగ్యం, పర్సనాల్టీతో, ఎప్పుడూ నవ్వుతూ ఉండే ధర్మా అనారోగ్యంతో కృశించిపోయి, బక్కచిక్కి కూతురి ఇంట్లో సోఫా సెట్‌లో కూలబడి వున్నాడు. చూసిన వెంటనే ధర్మాయేనా అని కాసేపు సందేహించాను. ధర్మా, ధర్మా అని నేను, నాగేశ్వరావు ఇద్దరమూ పిలిచాము. 'నేను సోమయ్యను వచ్చానని' చెప్పగానే ఎక్కడ లేని శక్తినంతా కూడదీసుకొని బలవంతంగా లేచి నిలబడ్డాడు, కౌగిలించుకున్నాడు, చేతిలో చెయ్యేసి కన్నీరు కార్చాడు. చాలా బాధనిపించింది. బలవంతంగా నేను, నాగేశ్వరావు కూర్చోబెట్టి ధైర్యం చెప్పాం, పరామర్శించాం. కన్నీరు తడుస్తూ 'ఏమీ కాదులే' అని ఓదార్చాం. ఆ కామ్రేడ్‌తో మాకున్న సంబంధం అలాంటిది. దాదాపు యాభై ఏండ్లు మేమిద్దరం అత్యంత సన్నిహితంగా కమూనిస్టు ఉద్యమంలో కలిసిపనిచేశాం. మాకు అదే ఆఖరిచూపు. మేము చూసివచ్చిన కొద్దిరోజులకే ఆయన మర ణించాడు. ధర్మాతో నాకున్న జ్ఞాపకాలన్నీ భారంగా నామదిలో మెదిలాయి.

ఉద్యోగాన్ని వదులుకుని...

ధర్మా కొత్తగూడెం సమీపంలోని మంగపేట వాసి. తండ్రి పోమ్లా నాయక్, తల్లి బీబీల పెద్ద కుమారుడు. పోమ్లానాయక్ వ్యవసాయంతో పాటు, లంబాడీ పెళ్లిళ్లకు పౌరోహిత్యం వహించేవాడు. ఆయన రెండో కుమారుడు భీమా ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేస్తున్నాడు. ధర్మా ఐటిఐ చదివి, క్యాంపస్ సెలక్షన్‌లో ఉత్తీర్ణుడై సింగరేణి కాలరీస్‌లో జాయిన్ అయ్యాడు. సింగరేణిలో సిడీఎస్ సమ్మె చాలా ఉధృతంగా జరుగుతున్న రోజులవి. సమ్మెకు సీఐటీయూ ముఖ్య నాయకులందరూ నాయకత్వం వహిస్తూ, సింగరేణి కోల్ ఏరియాలో విస్తృతంగా, చాలా బిజీగా తిరుగుతున్నారు.ఈ సమ్మెతో, సీఐటీయూ నాయకత్వంతో ధర్మాకు సంబంధాలు కలిగాయి, పరిచయాలూ పెరిగాయి. దీంతో సమ్మెలో చురుకైన పాత్ర వహించాడు. ఆ కాలంలోనే సీపీఐ(ఎం), సీఐటీయూ కార్యక్రమాల్లో పాల్గొంటూ కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షించబడ్డాడు. కొత్తగూడెంలో ప్రముఖ కమ్యూనిస్టు యోధులుగా వున్న పర్సా, మంచికంటి, ఏలూరి, జార్జి, కంగల బుచ్చయ్య గార్లను ఆదర్శంగా తీసుకున్నాడు. సింగరేణి సంస్థలో అంతవరకు చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి పార్టీలో పూర్తికాలం కార్యకర్తగా పనిచేయాలనే ధృఢ సంకల్పంతో 1974లో హోల్‌టైమర్‌గా చేరాడు. ప్రారంభంలో సీఐటీయూ నేతగా ఉన్న కామ్రేడ్ జార్జి గారి నాయకత్వంలో సింగరేణి కార్మికుల కోసం ఉద్యమించాడు. టింబర్ యార్డు కార్మికులకు సహకార సంఘాన్ని స్థాపించి, కూలీలకు కాంట్రాక్ట్ కూలి మొత్తం పంపిణీ అయ్యే విధంగా పోరాటం చేశాడు. క్రమేణా కూలీలకు సింగరేణిలో పర్మినెంట్ ఉద్యోగాల కోసం కృషి చేసి, విజయం సాధించాడు.

పోరాటాలు... విజయాలు

వ్యవసాయ కార్మిక రంగం, మైదాన గిరిజన రంగం (లంబాడీలు)లో దీర్ఘకాలం ధర్మా బాధ్యతలు నిర్వహించాడు. కొత్త గూడెం, సుజాతనగర్, పాల్వంచ, ములకలపల్లి ప్రాంతాల్లో కూలీ, భూ పోరాటాలకు ధర్మా, కాసాని ఐలయ్య, బరపటి సీతారాములు ప్రధానంగా నాయకత్వం వహించి పనిచేశారు. పోడు భూములు, తునికాకు పోరాటాలు, గ్రామాల్లో భూస్వామ్య, పెత్తందార్ల, దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా విస్తృతస్థాయిలో వ్యవసాయ కార్మికులను ఈ పోరాటాల్లోకి సమీకరించారు. ధర్మా నాయకత్వంలో తునికాకు కూలీ రేట్ల సమస్యపై సైకిళ్లపై దళాలుగా బయలుదేరి, ఏజెన్సీ గ్రామాల్లో వ్యవసాయ కార్మికులు, ఆదివాసులు, గిరిజనులు, దళితులు తదితర గ్రామీణ పేదల్లో కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేశారు. కట్ట రేటు పెరుగుదల కోసం తునికాకు కార్మికులు ఆ రోజుల్లో దీర్ఘకాలం సమ్మెలు చేశారు. కార్మికులు విజయం సాధించి రేట్లు పెంచుకున్నారు. ఆ పోరాటాల పునాదే ఈనాడు తునికాకు యాభై ఆకుల కట్టకు రెండు, మూడు రూపాయల వరకు పెరగడం. ఎక్స్‌గ్రేషియో కూడా నేడు ఆ కార్మికులకు అందుతున్నదంటే నాటి పోరాట ఫలితమే. మైదాన గిరిజనుల



కోసం (లంబాడీలు, ఎరుకలి, యానాది) ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో "మైదాన గిరిజన సంఘాన్ని" ప్రారంభించింది ఖమ్మం జిల్లాలోనే. ఆ తర్వాత ఈ సంఘం రాష్ట్ర వ్యాప్తంగా అవతరించింది. ధర్మా ఖమ్మం జిల్లా సంఘానికి ప్రధాన కార్యదర్శిగాను, రాష్ట్ర సంఘానికి అధ్యక్ష బాధ్యతలు కూడా నిర్వహించారు.

ప్రతి గిరిజన తండాకు విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని, అయిదు వందల జనాభా కలిగిన ప్రతి గిరిజన తండాను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ధర్మా పాదయాత్ర నిర్వహించాడు. వందల, వేల సంఖ్యలో గిరిజనులు ఇందులో పాల్గొన్నారు. ర్యాలీలు, పెద్ద బహిరంగ సభలు నిర్వహించారు. ఒక్కమాటలో చెప్పాలంటే, ఈ కోర్కెల అమలుకు తండాలన్నీ కదిలాయి. ఈ పాదయాత్ర తండాలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ ఆనాడు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన ఫలితంగానే అయిదు వందల జనాభా గల తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసింది గత బీఆర్ఎస్ సర్కార్. టేకులపల్లి మండలం, కోయగూడెం ప్రాంతంలో ఓపెన్ కాస్ట్ మైనింగ్ నిర్మాణంలో ఆ ప్రాంత గిరిజనులు తమ భూములు, నివాసాలు, ఉపాధి అవకాశాలను భారీస్థాయిలో కోల్పోయే సమస్య ఆనాడు ముందుకొచ్చింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం), సీఐటీయూ, ప్రజా సంఘాలు, గిరిజనులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాయి. ఈ సమస్య హైకోర్టు వరకు వెళ్లింది. ఈ పోరాటాల వల్ల గిరిజనులు ఎట్టకేలకు సింగరేణి సంస్థ నుండి తగిన పరిహారం, మైనింగ్‌లో ఉద్యోగాలు సాధించుకున్నారు. నేటి కోయగూడెం వర్కర్స్ చారిత్రాత్మక విజయం వెనుక నాటి ఇల్లందు డివిజన్ కార్యదర్శిగా ధర్మా నిర్వహించిన కృషి, నిర్వహించిన పాత్ర మరువ లేనిది. ఆ భూపోరాటాల్లో అనేకసార్లు ధర్మాను అరెస్టు చేశారు.జైళ్లలో నిర్బంధించారు.అయినా దృఢంగా నిలబడ్డాడు.

ప్రజాప్రతినిధిగానూ సేవలు...

1978 శాసనసభ ఎన్నికల్లో ఇల్లందు నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థిగా కంగల బుచ్చయ్య గారు పోటీచేశారు. ఈ ఎన్నికల సందర్భంగా నేను, ధర్మా టేకులపల్లి మండలంలోని సులానగర్ తండాలో ఒక ఎన్నికల సభలో పాల్గొన్నాం. ధర్మా మొదటిసారిగా ఈ సభలో "లంబాడీ భాష"లో ప్రసంగించాడు. సభలో పాల్గొన్న లంబాడీలందర్నీ ఈ ప్రసంగం ఉత్సాహపరిచింది. ఇది వారిని ఎంతగా ఆకట్టుకుందంటే, వారందరూ ధర్మాను పూలదండలతో సత్కరించారు. కొంతమంది లంబాడీలు డ్యాన్సు చేస్తూ, ధర్మాను ఆలింగనం చేసుకుని, ఎత్తుకుని ఊరేగించారు. లంబాడీ భాషలో "ధాల్లీ, సుత్తి, తారాకో" మన ఓటంటూ నినదించారు. 1983లో ఇల్లందు అసెంబ్లీ నియోజకవర్గానికి పార్టీ అభ్యర్థిగా ధర్మా పోటీచేసి, స్వల్ప తేడాతో ఓడిపోయారు. 1999లో ఖమ్మం లోక్‌సభ స్థానానికి పార్టీ అభ్యర్థిగా పోటీలో వుండి గణనీయమైన సంఖ్యలో ఓట్లు సాధించారు. ధర్మాను పార్టీ ఖమ్మం జిల్లా పరిషత్ ఛైర్మన్ అభ్యర్థిగా నిర్ణయించినప్పటికీ, అది కొన్ని సాంకేతిక కారణాలతో కార్యరూపం దాల్చలేదు. జూలూరుపాడు జడ్పీటీసీ సభ్యునిగా ఎన్నికై ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడ్డాడు. ఐటిడిఎ నుండి నిధులు రాబట్టి, గ్రామాల్లో అభివృద్ధి పనులను సమర్థవంతంగా నిర్వ హించాడు. పార్టీ ఏ ఏరియాకు పంపినా, ఏ బాధ్యతలు అప్పగించినా ధర్మా ఏనాడు వెనుకడుగు వేయలేదు.

ధర్మా మంచి కమ్యూనిస్టు, అంకితభావం గల నేత. కమ్యూనిస్టు విలువలు, ప్రమాణాలు, క్రమశిక్షణ, పట్టుదల ఈ సుగు ణాలన్నీ ధర్మా స్వంతం. ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలలో మంచి గుర్తింపు కలిగిన నాయకుడు. సామాన్య గిరిజనుల నుండి, అన్ని తరగతుల గిరిజనులు ఆయన్ను ప్రత్యేకంగా గౌరవిస్తారు. ఈ ప్రత్యేకత రాష్ట్రంలోనూ ఆయనకుంది. పార్టీలో అంతరంగిక పోరాటం చేయడంలో కూడా ధర్మా దిట్ట. చర్చల్లో నిర్మోహమాటంగా, నిస్సందేహంగా, ఎలాంటి శషబిషలు లేకుండా మాట్లాడే స్వభా వం. నేటి రాజకీయాల్లో డబ్బు, సంపాదన, అవకాశవాదం, ఫిరాయింపులు, పదవీ వ్యామోహం విశృంఖలంగా చెలామణి అవుతున్నాయి. ఈ ఒత్తిడులన్నింటిని తట్టుకొని, ధర్మా అయిదు దశాబ్దాల పాటు కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేయడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. ఒక ఆదర్శ కమ్యూనిస్టుగా, ప్రజాతంత్ర ఉద్యమాలకు ఆయన చేసిన సేవలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకం.

టేకులపల్లి మండలం, కోయగూడెం ప్రాంతంలో ఓపెన్ కాస్ట్ మైనింగ్ నిర్మాణంలో ఆ ప్రాంత గిరిజనులు తమ భూములు, నివాసాలు, ఉపాధి అవకాశాలను భారీస్థాయిలో కోల్పోయే సమస్య ఆనాడు ముందు కొచ్చింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం), సీఐటీయూ, ప్రజా సంఘాలు, గిరిజనులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాయి. ఈ సమస్య హైకోర్టు వరకు వెళ్లింది. ఈ పోరాటాల వల్ల గిరిజనులు ఎట్టకేలకు సింగరేణి సంస్థ నుండి తగిన పరిహారం, మైనింగ్‌లో ఉద్యోగాలు సాధించుకున్నారు. నేటి కోయగూడెం వర్కర్స్ చారిత్రాత్మక విజయం వెనుక నాటి ఇల్లందు డివిజన్ కార్యదర్శిగా ధర్మా నిర్వహించిన కృషి, నిర్వహించిన పాత్ర మరువ లేనిది. ఆ భూపోరాటాల్లో అనేకసార్లు ధర్మాను అరెస్టు చేశారు.జైళ్లలో నిర్బంధించారు. అయినా దృఢంగా నిలబడ్డాడు.

ప్రజా గొంతుకనౌతా.. మరో అవకాశమివ్వండి

- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ విద్యారంగం బలోపేతం.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం పోరాటం చేస్తున్న తనకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మరో అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని బీసీ వెల్ఫేర్ జూనియర్ కళాశాల, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశమై ఓటు నమోదు చేసుకొని మొదటి(1) ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలతోపాటు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా గొంతుకగా పని చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీగా శాసనమండలిలో తన వంతు పాత్ర పోషించి.. ఏండ్ల తరబడి జరగని ఉద్యోగోన్నతులు, బదిలీలు, నూతన ఉద్యోగాల కల్పన కోసం కృషి చేసినట్టు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని, వారి సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, మండల శాఖ బాధ్యులు రవీందర్ రెడ్డి, ఆదినారాయణ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ సంస్థలతో యూనివర్సిటీకున్న ఒప్పందం రద్దు

- వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ జానయ్య





నవతెలంగాణ-రాజేంద్రనగర్

2022 జులై వరకు వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కొన్ని ప్రయివేట్ సంస్థలు చేసుకున్న అవగాహనా ఒప్పందాలు విశ్వవిద్యాలయ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఉన్నందున వాటిని రద్దు చేసుకున్నట్టు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీతో భాగస్వామ్యం ఉందని చెప్పుకొంటున్న ప్రయివేట్ సంస్థలతో ఉన్న ఒప్పందాలను సోమవారం రద్దు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ప్రయివేట్ సంస్థలకు వ్యవసాయ విశ్వవిద్యాలయంతో ఎలాంటి సంబంధం లేదన్న విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. ప్రయివేట్ సంస్థలతో వ్యవసాయ విద్యా కోర్సుల కోసం భాగస్వామ్యంగానీ, గుర్తింపు ఇవ్వడంతో గానీ సంబంధం లేదని స్పష్టం చేశారు. కొన్ని ప్రయివేట్ సంస్థలు అగ్రికల్చర్ యూనివర్సిటీ పేరును వాడుకొని వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా, బ్రోకర్ల ద్వారా సీట్లు ఇప్పిస్తామని, అలాగే ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీతో అనుబంధం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాలను నమ్మవద్దని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించారు.

ఏపీ కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కారుకు ప్రమాదం

- వాణి ప్రసాద్‌కు స్వల్పగాయాలు





నవతెలంగాణ-మునగాల

ఆంధ్రప్రదేశ్ కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్ కారు ప్రమాదానికి గురైంది. ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని ఆకుపాముల సమీపంలో 65జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళుతున్నారు. ఈ క్రమంలో ముందు వెళుతున్న శాంత్రో వెహికిల్‌ను ఆ కారు ఢీకొట్టి.. అదుపుతప్పి రోడ్డు పక్కన వరి పొలంలోకి దూసుకుపోయింది. దీంతో ఆమె స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆమెను అంబులెన్స్‌లో సూర్యాపేట ఏరియాస్పత్రికి తరలించారు. ఆ తరువాత ఆమె హైదరాబాద్‌కు వెళ్లినట్టు సమాచారం. ఘటనా స్థలాన్ని కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని స్థానిక ఎస్ఐ బి.ప్రవీణ్ కుమార్‌ను తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

- మెదక్-చేగుంట రహదారిపై రైతుల రాస్తారోకో



నవతెలంగాణ-చిన్నశంకరంపేట

వరి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం కొరివిపల్లి కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చినా కొనుగోలు చేయకపోవడంతో రైతులు రోడ్డుపై ధాన్యం పోసి బైటాయించారు. వరి కోతలు కోసి నెల రోజులు గడుస్తున్నా కొనుగోలు ప్రారంభించకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. తెచ్చిన అప్పులు తీర్చలేక, కోత మిషన్లకు డబ్బులు కట్టలేక పోతున్నామని వాపోయారు. పండించిన పంటలో చారాన వంతు టాపర్ల కిరాయి చెల్లించాల్సి వస్తుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు. కాగా, రైతుల ఆందోళనతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి ప్రయాణికులకు అంతరాయం ఏర్పడింది.

కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం

- చనగాని దయాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ కులగణన చేసి బీసీలకు అవకాశాలు ఇవ్వబోతున్నదని చెప్పారు. బీఆర్ఎస్ బీసీలకు ద్రోహం చేసిందని విమర్శించారు. రాహుల్‌గాంధీ ఆలోచనను సీఎం రేవంత్ రెడ్డి అమలు చేశారని తెలిపారు. గ్రూప్ 1 మెయిన్స్‌లో బీసీలకు జీవో 29తో ఎక్కడా నష్టం జరగదని స్పష్టం చేశారు. దీనిపై బీఆర్ఎస్, బీజేపీలు చేసేవి విషప్రచారమే అని కొట్టిపారేశారు. గ్రామగ్రామాన బీసీలు రాహుల్ గాంధీకి, సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలపాలని పిలుపునిచ్చారు.

అరకొర వేతనాలు.. అదనపు భారం

పెండింగ్‌లో ఉన్న పారితోషికం డబ్బులు చెల్లించాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి : సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాల ధర్నా



నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో చేయించిన సర్వేల తాలుకూ పారితోషికం ఇప్పటికీ చెల్లించలేదని, ఆశాలతో అనేక పనులు చేయించుకుంటూ అదనపు భారం మోపుతున్నారని కానీ పారితోషికాలు మాత్రం సకాలంలో చెల్లించడం లేదని, వెంటనే బకాయి డబ్బులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని విన్నవించుకుంటున్నా.. పాలకులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లోని ధర్నాచౌక్‌లో సోమవారం ఆశాలు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. గ్రామీణ పేదలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తున్న ఆశా కార్యకర్తల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంబించడం సరైంది కాదన్నారు. సర్వేల పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వెట్టిచాకిరి చేయించుకుంటూ.. పనికి తగిన వేతనం మాత్రం ఇవ్వడం లేదని విమర్శించారుఅరకొర వేతనం అందిస్తూ అదనపు పని భారం మోపుతున్నారని తెలిపారు. కోవిడ్ సమయంలో వీరు అందించిన సేవలు వెలకట్టలేనివని, కోవిడ్ పాజిటీవ్‌గా తేలిన వారికి అవసరమైన మందులు అందించడం, నిరంతరం వారి ఆరోగ్య సంరక్షణ తెలుసుకుంటూ వైద్యారోగ్యశాఖకు సమాచారం అందించేవారని గుర్తు చేశారు.

ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.వెయ్యి చొప్పున అదనపు పారితోషికం అందిస్తామని చెప్పి మూడు నెలలు మాత్రమే చెల్లించినట్టు తెలిపారు. కోవిడ్ ప్రభావం 2021 వరకు కొనసాగగా అప్పటి వరకు వీరు సేవలందించారని, కానీ మిగితా రెండేండ్లకు సంబంధించిన పారితోషికం ఇప్పటికీ జమ చేయలేదని తెలిపారు. పోలియో సర్వే పారితోషికం రూ.950 ఇప్పటికీ వారి ఖాతాల్లో జమ కాలేదని వెంటనే అమలు చేయాలని అన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా పారితోషికాలను రూ.18,000కు పెంచి, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, ప్రతినెలా 2వ తేదీన పారితోషికాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశాలకు రూ.50 లక్షల ఇన్సూరెన్స్, మట్టి ఖర్చులు రూ.50 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించేలా సర్క్యులర్ జారీ చేయాలని కోరారు.

ఇస్తున్న పారితోషికాల్లో సగం పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పారితోషికం లేని పనులు చేయించొద్దని, బీపీ, షుగర్ టెస్టు, ఎన్సీడీ, అబా కార్డ్స్ తదితర ఏఎన్ఎంల పనులను ఆశాలతో చేయించొద్దని కోరారు. ఈ ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నన్నేసాబ్, జిల్లా నాయకులు నాయక్ వాడి శ్రీనివాస్, కటారి రాములు ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయ, జిల్లా ఉపాధ్యక్షులు సుకన్య, బాలమణి, స్వప్న, సర్ప, ఆసియా, లలిత, రేణుక, రేవతి, శోభ, లత, సబిత, భూలక్ష్మి, విజయ, దివ్య, సాహిర, లావణ్య, వహీదా తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇండ్లు



మొదటి విడతలో ఇచ్చేందుకు నిర్ణయం

- రెండో విడత రేషన్‌కార్డు ఉంటేనే అర్హులు
- నాలుగేండ్లలో 20 లక్షల ఇండ్లు నిర్మించడమే లక్ష్యం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ- ఖమ్మం

అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నదని, రేషన్‌కార్డు లేకపోయినా మొదటి విడతలో పేదలు, నిరుపేదలు.. ఇలా కేటగిరీల వారీగా పరిశీలించి ఇండ్లు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నామని రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఖమ్మంలోని 59వ డివిజన్ దానవాయిగూడెంలో పర్యటించి రూ.25 లక్షల ఎస్‌డీఆర్ఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. త్వరలోనే రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ మొదలవుతుందని, రెండో విడత నుంచి రేషన్‌కార్డు ఉంటేనే ఇందిరమ్మ ఇండ్లు పొందేందుకు అర్హులవుతారని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణలోని పది జిల్లాల పరిధిలో 19.56 లక్షల ఇండ్లను వైఎస్ఆర్ చేతుల మీదుగా పేదలకు కట్టిచ్చామని గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరిట మంజూరు చేస్తామని, 400 చదరపు అడుగులతో ఇల్లు నిర్మిస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నాలుగు దశల్లో నిధులు విడుదల చేస్తామని తెలిపారు. పునాది వేసినప్పుడు రూ.లక్ష, లెంటల్ లెవెల్‌లో రూ.1.25లక్షలు, స్లాబ్ దగ్గర రూ.1.75లక్షలు, గృహప్రవేశం సమయానికి మరో లక్ష లబ్దిదారులకు నేరుగా అందించనున్నట్టు చెప్పారు. ఈనెల 20 తర్వాత గ్రామసభల ద్వారా ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. రాబోయే నాలుగేండ్లలో 20 లక్షల ఇండ్లకు తగ్గకుండా నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. సాంకేతికతను వినియోగిస్తూ ప్రత్యేక యాప్ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పర్యవేక్షిస్తామని తెలిపారు. అలాగే, గతంలో ప్రారంభించి పూర్తి కాని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి కరెంటు, తాగునీరు, వంటి మౌలిక వసతులు కల్పించి లబ్దిదారులకు కేటాయిస్తామని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు స్థానికంగానే నివాసం ఉండాలని, పనిలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ కృష్ణలాల్, డీఈ మాధవి దేవి, ఏఈ కుమారస్వామి, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మెయిన్ అంగన్‌వాడీల్లో 'మినీ' జీతాలా..?

- వేతనాల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సునీత
- కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

మినీ అంగన్‌వాడీ నుంచి మెయిన్ అంగన్‌వాడీగా మార్చిన ప్రభుత్వం వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు సునీత అన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు వచ్చారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించి, సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చిందని చెప్పారు. కానీ, జనవరి నుంచి టీచర్లు, ఆయాలకు మినీ అంగన్‌వాడీ వేతనాలే ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తర్వుల్లో కాదు.. ఆర్థిక శాఖలో కూడా వీరిని మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చాలని డిమాండ్ చేశారు. 13, 14 సంవత్సరాల నుంచి ఐసీడీఎస్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, కుల గణన సర్వే నుంచి అంగన్‌వాడీలను మినహాయించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో 75 నుంచి వంద అంశాలను ఇచ్చారని, సర్వేకు అంగన్‌వాడీలను నియమించడం సరైంది కాదని అన్నారు. అంగన్‌వాడీల్లో ఎక్కువగా 7 నుంచి పదో తరగతి వరకు చదువుకున్న వారే ఉన్నారని, వారికి సర్వే నిర్వహించడం కష్టంగా మారుతుందని చెప్పారు. కేంద్రాలు మూసేసి సర్వే చేయాల్సి వస్తుందన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, సహాయ కార్యదర్శి సురేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకటమ్మ, నాయకులు పార్వతి, భారతి, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

సన్నాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్



నవతెలంగాణ-గోవిందరావుపేట

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రైతులకిచ్చిన హామీ ప్రకారం 33 రకాల సన్నధాన్యాన్ని ఎలాంటి కొత్త ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్‌మిల్ అసోసియేషన్లు సన్నధాన్యాన్ని మిల్లింగ్ చేయలేమంటూ ప్రభుత్వ అధికారులు, కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి నిల్వ చేయాలని కోరారు. సన్న ధాన్యం కొనుగోలు కోసం ప్రత్యేక మిషన్లను ఏర్పాటు చేసి పరిశీలించి కొంటామని చెప్పడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. సాకులతో ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేయడం లేదా తప్పుకోవడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్టు ఉందని విమర్శించారు. ఖరీదులో ఎక్కడ తేడా వచ్చిన రైతాంగాన్ని సమీకరించి ఆందోళనలు చేస్తారని హెచ్చరించారు. రూ.2లక్షల రుణమాఫీలోనూ ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. రేషన్ కార్డు, ఇతర నిబంధనల పేరుతో లక్షల్లోపు వారికీ, రెండు లక్షలపై ఉన్న వారికి రుణమాఫీ వర్తించలేదని, పై డబ్బులు చెల్లిస్తే వర్తిస్తుందంటే రైతు ఎక్కడ నుంచి తెచ్చి కడతాడని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను సక్రమంగా అమలు చేయలేకపోయిందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు కాంగ్రెస్ కమిటీలుగా మారడంతో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. అఖిలపక్ష కమిటీలను ఏర్పాటు చేసి పంచాయతీ సభల ద్వారా నిజమైన లబ్దిదారులను ఎంపిక చేస్తే అర్హులైన వారికి న్యాయం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోడు భూములకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయిందని, దాంతో గిరిజనులు సకాలంలో వ్యవసాయం చేసుకోలేక, రుణాలు రాక, పంట వేయక నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పోడు భూములపై విధివిధానాలను రూపొందించి పోడు రైతాంగానికి న్యాయం చేయాలని అన్నారు. గోదావరి ప్రవహిస్తున్న ఈ నియోజకవర్గంలోని గ్రామాల్లో ఒక్క చెరువు కూడా గోదావరితో నిండకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పారదర్శకంగా ఉండాలని తెలిపారు. సర్వేలోని ప్రశ్నల్లో కుటుంబ రాజకీయ స్థితిని ప్రశ్నించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బందారు రవికుమార్, జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, గ్యానం వాసు, కొప్పుల రఘుపతి, చిట్టిబాబు, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమాజానికి సేవ చేస్తే హీరోలవుతాం

- చదువు, సామాజిక స్పృహ రెండూ ముఖ్యమే
- విద్యార్థులకు సీఎం రేవంత్ దిశా నిర్దేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాజానికి సేవ చేస్తే ప్రజల దృష్టిలో హీరోలవుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. విద్యార్థులకు చదువు, సామాజిక స్పృహ రెండూ ముఖ్యమేనని ఆయన దిశా నిర్దేశం చేశారు. అందువల్ల పాఠశాలల్లో విద్యతోపాటు పిల్లలకు సామాజిక అవగాహన కల్పించేందుకు వీలుగా బృంద చర్చలు (గ్రూప్ డిస్కషన్స్) నిర్వహించాలంటూ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచిన నేపథ్యంలో పలు సంక్షేమ హాస్టళ్లకు చెందిన విద్యార్థులు సోమవారం ముఖ్యమంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు నేతృత్వంలో వారు సీఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోగల తన నివాసంలో సీఎం వారితో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మాట్లాడుతూ...చదువుకున్న వారు ప్రయోజకులవుతారని తెలిపారు. అలా ఉన్నత చదువులు చదివి, తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని విద్యార్థులకు సీఎం పిలుపునిచ్చారు. గత పదేండ్లలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైన నేపథ్యంలో, తమ ప్రభుత్వం ఆ రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు నిర్ణయించామని గుర్తు చేశారు. స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయటం ద్వారా యువతకు నైపుణ్య శిక్షణనిస్తామని వివరించారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్(ఏటీసీలు)గా మారుస్తున్నాని తెలిపారు. త్వరలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో స్కూళ్లు, కాలేజీల్లో డ్రాపవుట్స్‌ను తగ్గించేందుకు అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. బడి బయట ఉన్న పిల్లలను స్కూళ్లలో చేర్పించేందుకు చొరవ చూపించాలని యువతను కోరారు. ఇది వారిపై ఉన్న అతి పెద్ద బాధ్యతని నొక్కి చెప్పారు. గంజాయి, డ్రగ్స్ లాంటి వ్యసనాల బారిన పడొద్దని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తున్న క్రమంలో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలంటూ నిరుద్యోగులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేతప్ప రాజకీయ పార్టీల రెచ్చగొట్టుడు ప్రకటనలు చూసి మోసపోవద్దని హితవు పలికారు. తమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలంటూ ఈ సందర్భంగా విద్యార్థులు ముఖ్యమంత్రిని కోరగా... స్థల సేకరణ అనంతరం సొంత భవనాలను నిర్మిస్తామంటూ ఆయన హామీనిచ్చారు.

ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం

- ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు విపక్షాల కుట్ర : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. ఆరు గ్యారంటీలకు ఒకదాని తర్వాత ఒకటిగా కార్యరూపం ఇస్తామని వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో మీ-సేవ 14వ వార్షికోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని ధ్వంసం చేశారని విమర్శించారు. ప్రతి పక్షాలు ప్రజల్లో అనుమానాలు రేకెత్తించేందుకు అసత్యాలను ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ఆయా పార్టీల మాటలను విశ్వసించవద్దని ప్రజలకు సూచించారు. ప్రతి పనికి మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా 2011లో కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రజల సౌకర్యం కోసం పారదర్శకమైన మీ సేవ సర్వీసులను అందుబాటులోకి తెచ్చిందని గుర్తు చేశారు. గత పదేండ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న మీ సేవా కేంద్రాలను అదుకునేందుకు సర్వీస్ చార్జీలను త్వరలో పెంచుతామని ప్రకటించారు.. ఇప్పుడున్న 600 సేవలకు అదనంగా మరిన్ని సర్వీసులను అందుబాటు లోకి తేవడంతో పాటు నిర్వాహకులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 4,754 మీ సేవ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమం, ఉద్యోగ భద్రత గురించి ఫెడరేషన్ నాయకులు తన దృష్టికి తీసుకొచ్చిన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మెన్ మన్నె సతీశ్, మీసేవ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ డైరెక్టర్లు వరలక్ష్మి, విజయ్ భాస్కర్, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డెడికేటెడ్ కమిషన్ చైర్మెన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ వెంకటేశ్వరరావు

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌కు చైర్మెన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం జీవో నెంబర్ 49 జారీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో వెల్లడించింది. రాష్ట్రంలో ఈ నెల 6నుంచి కుల గణన సర్వే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా సర్కార్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కులగణన, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో హైకోర్టు లేవనెత్తిన అంశాలపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమీక్షించిన విషయం విదితమే. ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవనీ, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలోనూ పారదర్శకంగా వ్యవహరించాలని సీఎం అధికారులకు సూచించిన నేపథ్యంలోనే డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా నెల రోజుల వ్యవధిలో కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించనుంది.

బస్సు చార్జీలు పెరగలేదు

- ఆర్టీసీ యాజమాన్యం స్పష్టీకరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ బస్సు టికెట్ చార్జీలు పెరిగాయనే ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) యాజమాన్యం స్పష్టం చేసింది. కొందరు వ్యక్తులు ఉద్దేశ్యపూర్వకంగానే టిక్కెట్ చార్జీలు పెరిగాయని సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. రెగ్యులర్ సర్వీస్‌లకు సాధారణ చార్జీలే అమల్లో ఉన్నాయనీ, దీపావళి తిరుగు ప్రయాణ రద్దీ నేపథ్యంలో స్పెషల్ బస్సుల్లో మాత్రమే ప్రభుత్వ ఉత్తర్వుల చార్జీలను సవరించామని వివరించారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ఆర్టీసీ ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులు నడుపుతుందనీ, తిరుగు ప్రయాణంలో ప్రయాణీకుల రద్దీ ఉండకపోవడంతో ఆ బస్సులు ఖాళీగా వెళ్తుంటాయని తెలిపారు. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరలను సవరించుకోవాలని 2003లో ప్రభుత్వం జీవో నంబర్ 16 జారీ చేసిందని పేర్కొన్నారు. 21 ఏండ్లుగా ఇదే పద్ధతి ఆర్టీసీలో అమల్లో ఉందన్నారు.

తాగునీటి సరఫరాకు అష్టకష్టాలు

నిర్లక్ష్యంతో సామాన్యులు బలి

పలువురి ఇంజినీర్లపై సస్పెన్షన్ కొరడా

నిటిఆయోగ్ చెప్పినా నిర్వహణకు నిధులివ్వని కేంద్రం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మానవాళికి పంచభూతాల అవసరం ఎంతో ఉంటుంది. అవి లేకుండా జీవనం సాగడం అసాధ్యం. అందులోనూ తాగునీరు నిత్యావసరం. వాతావారణ కాలుష్యం, పారిశ్రామికీకరణ నేపథ్యంలో భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి. రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. మిషన్ భగీరథ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సమస్యను పరిష్కరించే ప్రయత్నం గత సర్కారు చేసినా, నిర్వహణ ఇబ్బందుల మూలంగా గ్రామీణ ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. దాదాపు రూ. 42 వేల కోట్ల ఖర్చుతో చేపట్టిన ఈ ప్రాజెక్టు క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా తాగునీటి సరఫరా ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారైంది. భగీరథ పథకానికి నీరు రిజర్వాయర్లు, భూగర్భజలాలు ఇతర వనరుల ద్వారా సమకూర్చుకుంటారు. 26 సెగ్మెంట్లల్లో ఏర్పాటు చేసిన పైపులైన్లు, వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంట్లు, ఇతరాలు ఉన్నాయి. భారీ ఖర్చుతో ఏర్పాటు చేసిన వ్యవస్థను, సక్రమంగా ఉపయోగించుకోవడంలో స్థానికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నిచోట్ల అధికారుల నిర్లక్ష్యం ఉంటే, మరికొన్ని చోట్ల పైపులైను లీకేజీలు, సక్రమంగా శుద్ధిచేయక సాధారణ ప్రజలు తాగునీటి కష్టాలు అనుభవించాల్సి వస్తున్నది. సంగారెడ్డి, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో తాగునీరు కలుషితం కావడంతో ఇటీవల ఇద్దరు మృతిచెందారు. వెంటనే స్పందించిన రాష్ట్ర అధికార యంత్రాంగం ముగ్గురు ఇంజినీర్లను సస్పెండ్ చేసింది. మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు ఇచ్చింది. శాఖాపరమైన విచారణలో స్థానిక అధికారుల నిర్లక్ష్యం కారణం కాగా, ట్యాంకులు శుభ్రం చేయకపోవడం, బ్లీచింగ్ పౌడర్ వాడకపోవడం, బావుల్లో నుంచి నీరు తీసుకునే విషయంలో జాగ్రత్తలు లేకపోవడంతో సమస్యలు వస్తున్నాయని తేలింది. ఈనేపథ్యంలో డివిజన్, మండలస్థాయి అధికారులకు తాగునీటి సరఫరా విషయంలో సర్కారు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 50 శాతం మధిర గ్రామాలకు సురక్షిత తాగునీరు అందడం లేదనీ, నిర్వహణకు నిధులు సమకూర్చాలని గత జులైలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రానికి లేఖ రాసిన విషయం విదితమే. ప్రాజెక్టు పూర్తయిన కొత్తలోనే నిటిఆయోగ్ భగీరథకు రూ. 17 వేల కోట్లు సాయం చేయాలని సూచించినా మోడీ సర్కారు పట్టించుకోలేదు. ప్రతి మనిషికి గ్రామాల్లో 100 లీటర్లు, మున్సిపాల్టీల్లో 135 లీటర్లు, కార్పొరేషన్లల్లో 150 లీటర్లు, 10 శాతం పరిశ్రమలకు ఇచ్చే లక్ష్యంతో భగీరథ పథకానికి శ్రీకారం చుట్టారు. 23,824 గ్రామాలకు తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని గత బీఆర్ఎస్ సర్కారు చెప్పుకొచ్చింది. నిధుల లేమితో నిర్వహణా సమస్యలు తలెత్తుతున్నాయి. పదేండ్ల ఒప్పందం నేపథ్యంలో వర్కింగ్ ఏజెన్సీల వెంట పడుతున్నా, ఆశించిన మేర ప్రయోజనం చేకూరడం లేదని సమాచారం. పథకం బాగుందంటూ రాష్ట్రాన్ని అభినందించింది. మీరూ అమలు చేయాలంటూ ఇతర రాష్ట్రాలకు డీపీఆర్‌ను పంపింది. 320 గ్రామాల్లో సర్వే చేసిన జలజవన్ మిషన్ అవార్డును సైతం ప్రకటించింది. కానీ, పకడ్బందీ నిర్వహణకు మాత్రం మోడీ సర్కారు నిధులు విదిల్చడం లేదు. ఫ్లోరోస్కోప్‌ల ద్వారా తాగునీటిని పరీక్షిస్తున్నా, కలుషిత నీటికి అక్కడక్కడా మరణాలు తప్పడం లేదు. ఈనేపథ్యంలో భారీ ప్రాజెక్టు నిర్మాణం చేసుకున్నా, కేంద్రం శీతకన్ను కారణంగా పథకం అమలు కష్టతరంగా మారిందని ప్రభుత్వం అంటున్నది.



సంక్రాంతికి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు చీరెలు

- పదిరోజుల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్ జీవో
- క్రషలతో అంగన్‌వాడీ సిబ్బందికి ఇబ్బందులుండవ్ : మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

త్వరలో డిజైన్లు ఫైనల్‌చేసి సంక్రాంతి పండుగకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రెండు చొప్పున చీరెలు అందజేస్తామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) ప్రకటించారు. పదిరోజుల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్ జీవో విడుదల చేస్తామన్నారు. క్రషలతో అంగన్‌వాడీ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులుండబోవని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో ఆమె భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గతంతో పోలిస్తే నాణ్యమైన చీరలు ఇవ్వాలని మంత్రికి అంగన్‌వాడీ టీచర్లు విజ్ఞప్తి చేశారు. డిజైన్, రంగుల్లో మార్పులు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..వారి సూచనలకు అనుగుణంగా మార్పులు చేసి త్వరలో చీరెలు పంపిణీ చేస్తామని హామీనిచ్చారు. అమ్మలాగా చిన్నారుల భవిష్యత్తును తీర్చి దిద్దుతున్న అంగన్‌వాడీలకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో కొన్ని సమస్యలు ఎదురవుతున్నప్పటికీ అంగన్‌వాడీ సమస్యలన్నింటికీ ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో సాంకేతిక సమస్యలున్నాయనీ, దీనిపై ఆర్థికమంత్రి భట్టి విక్రమార్కతో చర్చించామని తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు సొంత భవనాలు కట్టిస్తామనీ, అన్ని కేంద్రాలకు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రకటించారు. మహిళలు స్వేచ్ఛగా పనులకు వెళ్లిందుకే క్రషలు సహాయపడతాయనీ, దీంతో వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు అనుబంధంగా క్రషలను కొనసాగిస్తామనీ, దానివల్ల ఎలాంటి నష్టం ఉండదని టీచర్లు, హెల్పర్లకు భరోసానిచ్చారు. సమావేశంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ళ శారద, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, తదితరులు పాల్గొన్నారు.

కేఎన్.రాజన్ మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు

- అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సంతాపం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాతంత్ర ఉద్యమానికి, సీపీఐ(ఎం)కి కేఎన్.రాజన్(79) మరణం తీరని లోటని అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నాలుగు దశాబ్దాల పాటు సీపీఐ(ఎం) పార్లమెంట్ వ్యవహారాల ఇన్‌చార్జిగా ఆయన తన సేవలందించారనీ, ఏకే గోపాలన్, ఈఎంఎస్, బీటీఆర్, సూర్జీత్, నాయకత్వంలో పనిచేశారని కొనియాడారు. ఆయన మృతికి తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఐద్వా రాష్ట్ర కేంద్రంలో పనిచేస్తున్న ఆశాలతను ఫోన్ ద్వారా బి.వెంకట్ పరామర్శించారు. సికింద్రాబాద్‌లోని బోయగూడలో కేఎన్.రాజన్ భౌతికకాయాన్ని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.ఆంజనేయులు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మూఢ్ శోభన్‌నాయక్, తదితరులు సందర్శించి నివాళి అర్పించారు. ఆయన సతీమణి ఆశాలతను ఓదార్చి సానుభూతి తెలిపారు.

నువ్వా..? నేనా..?

(మొదటిపేజీ తరువాయి)

నెలకొంది. ఇక.. అమెరికా నిర్మాణ రంగంలో ప్రముఖ పాత్ర పోషించే రస్ట్ బెల్ట్ రాష్ట్రాలైన విస్కాన్సిన్, మిషిగాన్, పెన్సిల్వేనియాలు కూడా కీలకంగా మారాయి. కార్మిక సంఘాలకు పట్టు ఉండే ఈ మూడు రాష్ట్రాల్లో మొత్తం 44 ఓట్లున్నాయి. ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉండే సన్ బెల్ట్ రాష్ట్రాలైన నెవడా, అరిజోనా, నార్త్ కరోలినా, జార్జియాలో మొత్తం 49 ఓట్లున్నాయి. రస్ట్ బెల్ట్ రాష్ట్రాలపై దశాబ్దాలుగా డెమోక్రాట్లదే ఆధిపత్యం. ఈసారి కూడా అదే జరిగితే 44 ఓట్లు కమలా హారిస్ ఖాతాలో పడతాయి. ఒకవేళ ట్రంప్ మూడు స్టేట్స్‌లలో గెలిచినా.. విజయానికి మరో ఏడు ఓట్ల దూరంలో నిలుస్తారు. అప్పుడు మరో స్వింగ్ స్టేట్‌ని గెలవాల్సి ఉంటుంది. ఒకవేళ హారిస్.. రస్ట్ బెల్ట్ రాష్ట్రాల్లో కీలకమైన పెన్సిల్వేనియాతో పాటు మరోదాన్ని దక్కించుకున్నా ఆమె విజయావకాశాలు మెరుగ్గానే ఉంటాయి. మిగతా నాలుగు స్వింగ్ స్టేట్లలో ఏ ఒక్కదాన్ని నెగ్గినా కమలా హారిస్ గెలిచి నట్టే. ట్రంప్ గెలవాలంటే మాత్రం ఆ నాలుగింటినీ స్వీప్ చేయాల్సి ఉంటుంది. రిపబ్లికన్లకు సన్ బెల్ట్‌ను క్లీన్‌స్వీప్ చేసిన చరిత్ర ఉండడంతో.. రస్ట్ బెల్ట్ నుంచి కనీసం ఒక్క రాష్ట్రాన్నైనా ట్రంప్ చేజిక్కించుకోవాల్సి ఉంటుంది. లేని పక్షంలో ఆయనకు ఇబ్బంది తప్పదనే అంచనాలూ ఉన్నాయి.

మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు

- తెలంగాణ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 15 నర్సింగ్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకున్నందుకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు తెలంగాణ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు సోమవారం ఆ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.మరియమ్మ, సంయుక్త కార్యదర్శి లక్ష్మణ్ రుఢావత్ ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యారోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత 6,954 నర్సింగ్ ఆఫీసర్ల పోస్టుల భర్తీ, నర్సింగ్ క్యాడర్‌లో పదోన్నతులు, సాధారణ బదిలీలు, మరో 2,322 నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులకు నోటిఫికేషన్ జారీ, జిల్లాలో ప్రభుత్వ కొత్త నర్సింగ్ కాలేజీల మంజూరు, నిమ్స్ వైద్యశాలలో నర్సింగ్ ఆఫీసర్ల యూనిఫాం డ్రెస్ కోడ్ మార్పు చేశారని వారు కొనియాడారు.

బావ బామ్మర్దుల రొయ్యల కుంభకోణం బయట పెడతాం

- మెట్టు సాయికుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వారం రోజుల్లో బావ బామ్మర్దుల రొయ్యల కుంభకోణం బయట పెడతామని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కుమార్ తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో చేప పిల్లల కొనుగోలులో రూ.300 కోట్ల స్కాం జరిగిందని చెప్పారు. గత పాలకులు మత్స్యశాఖలో ఆంధ్రా కాంట్రాక్టర్లను పెంచి పోషించి, ఆ శాఖను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముదిరాజ్ సామాజికవర్గానికి ఒక్క టికెట్ ఇవ్వకుండా, ఆ కుటుంబాల ఉసురు తగిలి ఇంట్లో కూర్చున్నారని ఎద్దేవా చేశారు. మత్స్యకారులకు చేసిన అన్యాయానికి అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాయాలని అన్నారు.

పుస్తకాల స్పర్శ.. అదో తృప్తి

టెక్నాలజీ పెరిగినా వాటికి తగ్గని ఆదరణ

- హైదరాబాద్ బుక్ ఫెయిర్ గౌరవ సలహాదారులు ఎమ్మెల్సీ కోదండరాం
- పుస్తక ప్రదర్శన 'లోగో 'ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పుస్తకాల స్పర్శ అనేది ఒక అద్భుతమనీ, టెక్నాలజీ, ఈబుక్స్, ఆన్‌లైన్ పఠనం పెరిగినా.. వాటికి ఆదరణ తగ్గదని హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ గౌరవ సలహాదారులు, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హైదరబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. 37వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శన సొసైటీ గౌరవ సలహాదారులను ప్రకటించారు. జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రాం, సీనియర్ ఎడిటర్ రామచంద్రమూర్తి, ప్రొఫెసర్ రమా మెల్కొటే బుక్ ఫెయిర్ సొసైటీకి గౌరవ సలహాదారులుగా ఉంటారని బుక్ ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్ అధ్యక్షులు తెలిపారు. ఆ కమిటీ సభ్యులతో కలిసి బుక్ ఫెయిర్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ ఇంటర్నెట్ కాలంలో కూడా పుస్తకాలను చదివే పాఠకులు నిరంతరం పెరుగుతున్నారని తెలిపారు. 37వ బుక్‌ఫెయిర్‌లో మధ్యాహ్నం 12గంటల నుంచి రాత్రి తొమ్మిది వరకు పుస్తకాలను ప్రదర్శించాలని నిర్ణయించటం హర్షణీయమన్నారు. పుస్తకాలపై చర్చలు అర్థవంతంగా సాగాలన్నారు. మేధావులను భాగస్వామ్యం చేయటం మంచిదేనన్నారు. కొత్తగా ఏర్పడిన బుక్‌ఫెయిర్ కమిటీ..పాత ఒరవడిని కొనసాగిస్తూ కొత్త ఆవిష్కరణలు చేయాలని సూచించారు. ఈ ఏడాది పాఠకుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. సానుకూల మార్పు కోసం కృషి చేయాలని సూచించారు. రామచంద్రమూర్తి, రమా మెల్కొటే మాట్లాడుతూ.. హైదరాబాద్ బుక్ ఫెయిర్ తెలుగు రాష్ట్రాల్లో గొప్ప మహోత్సవం అనీ, సాహితీ ప్రియులు, పాఠకులు, విద్యార్థులు, యువత, ఎంతో మంది ఈ పుస్తక మహోత్సవం కోసం వేచి చూస్తుంటారని అన్నారు. రచయితలను, పాఠకులను కలిపే వేదికగా బుక్ ఫెయిర్ అత్యంత ప్రాముఖ్యాన్ని సంతరించుకుందని చెప్పారు. టెక్నాలజీ ఎంత పెరిగినా.. పుస్తకాలకు ఆదరణ తగ్గడం లేదని చెప్పారు. వందలాది పబ్లిషింగ్ సంస్థలు ఈ మహోత్సవంలో పాల్గొంటాయని, ప్రజలు, పాఠకులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బుక్‌ఫెయిర్ సెక్రెటరీ ఆర్ వాసు మాట్లాడుతూ .. వచ్చేనెల 19 నుంచి 29 వరకు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించబోయే బుక్ ఫెయిర్‌కు ప్రజలు తరలిరావాలని కోరారు. సందర్శకుల కోసం అనుకూలమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పాటిస్తూ.. సందర్శకుల కోసం టికెట్లతో పాటు పుస్తకాల కోసం 'సంచి'ని ఇస్తామని పేర్కొన్నారు. రచయితలు, పబ్లిషర్లు తమ స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పదిలక్షలకు పైగా జనం విజిట్ చేస్తారని తెలిపారు. విద్యార్థులకు తమ ఐడీ కార్డులతో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని ఆయన వివరించారు. వివరాల కోసం 9490099081 ను సంప్రదించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు కె. బాల్ రెడ్డి, శోభన్ బాబు, జాయింట్ సెక్రెటరీలు కె. సురేశ్, ఎం. సూరిబాబు పాల్గొన్నారు.

మూసీ బాధితులను రోడ్డున పడేస్తే తీవ్ర ప్రతిఘటనే

- ఆప్ అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో బాధితులను రోడ్డున పడేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని అఖిల పక్ష పార్టీల నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వారి సమస్యల శాశ్వత పరిష్కారానికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర కమిటీ హైదరాబాద్, సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షత వహించగా దాసోజు శ్రవణ్, రాగిడి లక్ష్మ రెడ్డి (బీఆర్ఎస్), కె. గోవర్ధన్ (సీపీఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ), కావ్య (జనసేన), కృష్ణ యాదవ్ (ఫార్వర్డ్ బ్లాక్), సయ్యిద్ మతీన్ అహ్మద్ (టీడీపీ), సజయ (మూసి జాన్ అందోళన్), ఆఫస సలాం (మూసి విక్టిమ్ రైట్స్), సిల్వేరి శ్రీశైలం, వర్గీస్ (సంఘసేవకులు)లతోపాటు పర్యావరణ శాస్త్రవేత్తలు, మేధావులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో అందరికీ దడ పుట్టించి, మూసీ సుందరీకరణ పేరుతో చడీ చప్పుడు లేకుండా పరివాహక ప్రాంతంలో దశాబ్దాలుగా నివసిస్తున్న 300 మంది పేదల ఇండ్లను కూల్చి, వేలాది ఇండ్లకు ఎరుపు రంగు గుర్తులు వేసి బాధిత కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందని మండిపడ్డారు.

మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణకు ఎవరు వ్యతిరేకం కాదనీ, ఈ ప్రాజెక్టు చేపట్టేముందు అన్ని రాజకీయ పార్టీలతో, అఖిలపక్ష కమిటీ ఏర్పాటు, పర్యావరణ శాస్త్రవేత్తలు, మేధావుల సలహాలు, సూచనలతోపాటు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ప్రకటన, అనుమతులు, పునరావాస విధానం ఏంటో రాష్ట్ర ప్రభుత్వం తెలపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, డాక్టర్ అన్సారీ, ఎం.ఏ. మజీద్, మహిళా విభాగం అధ్యక్షులు హేమ జిల్లోజు, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునా గౌడ్, అధికార ప్రతినిధులు జావీద్ షరీఫ్, ఖలీమ్ బాబా, విజయ్ మల్లంగి, సమీర్, మొహమ్మద్ సోహైల్, లాక్షా నాయుడు, దర్శనం రమేష్, అహసాన్, మౌనికా, శివాజీ, సందీప్, తివారి, తదితరులు పాల్గొన్నారు.

నా మనస్సంతా ఆదివాసీ గిరిజన సంక్షేమంపైనే

ఏడేండ్ల తర్వాత డైట్, 16 ఏండ్ల తర్వాత కాస్మోటిక్ చార్జీల పెంపు

- గిరిజన గురుకులాలు, పాఠశాలల విద్యార్థులకు అండగా ఉంటాం : గిరిజన సంక్షేమ శాఖ విస్తృత సమావేశంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తాను ఏ శాఖలో ఉన్నా మనస్సంతా ఆదివాసీ, గిరిజనుల సంక్షేమంపైనే ఉంటుందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) చెప్పారు. తన ప్రాణమంతా ఆదివాసీలు, చెంచులు, గిరిజనుల మీదనే ఉంటుందన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో కొమ్రంభీమ్ ఆదివాసీ భవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. కొమ్రంభీమ్ విగ్రహానికి మంత్రి సీతక్క పూలమాల వేసి నివాళి అర్పించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గిరిజన గురుకులాల్లో విద్యార్థుల కోసం హెల్త్ మానిటరింగ్ యాప్ ను ప్రారంభించారు.

ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లు సాధించిన పలువురు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందించారు. వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు, గురుకులాల ప్రిన్సిపాల్స్‌ను సన్మానించారు. డైట్‌చార్జీలు పెంచడంలో కీలకపాత్ర పోషించిన సీతక్కను టీచర్లు, విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ..పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే లక్ష్యాన్ని నిర్దేశించేందుకు ఇక్కడ సమావేశమయ్యామన్నారు. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ఉద్యోగోన్నతి, బదిలీల ప్రక్రియ వల్ల ఐదు వేల మంది ఆశ్రమ పాఠశాలల టీచర్లకు ప్రయోజనం చేకూరిందని చెప్పారు. ఆర్థికసమస్యలున్నా తమ ప్రభుత్వం ఉద్యోగులకు, విద్యార్థులకు మేలు చేస్తున్న తీరును వివరించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు ఉద్యోగులన్నారు. టీచర్లు మనస్సు పెట్టి పనిచేస్తే సంతృప్తి కలుగుతుందనీ, టీచర్లు సొంత పిల్లల మాదిరిగానే విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు. తాను కూడా హాస్టల్ జీవితాన్ని గడిపాననీ, ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నానని గుర్తుచేశారు. హాస్టల్ పిల్లలను అవహేళనగా చూసే వారికి కసితో చదివి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

కష్టపడి చదివితేనే ఎదుగుతామని నొక్కిచెప్పారు. గుడాలు, తండాలు, పెంటల నుంచి వచ్చిన పిల్లలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో విజయాలు సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థులకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు.



16 ఏండ్ల తర్వాత కాస్మోటిక్, ఏడేండ్ల తర్వాత డైట్ చార్జీలను తమ ప్రభుత్వం పెంచిందని గర్వంగా చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో హాస్టళ్లకు కొనుగోలు చేసిన నాసిరకం వస్తువులపై విచారణ చేయిస్తామన్నారు. ఐటీడీఏల పనితీరును మెరుగుపర్చుకోవాలని ఆదేశించారు. మారిన కాలానికి అనుగుణంగా డిమాండ్ ఉన్న కోర్సులవైపు పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం అధికారులు మనస్సు పెట్టి పనిచేయాలని కోరారు. సమావేశంలో టీజీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి సీతామహాలక్ష్మి, జీసీసీ చైర్మెన్ కొట్నక్ తిరుపతి, గిరిజన శాఖ కార్యదర్శి శరత్, ఐటీడీఏ పీఓలు, డీడీలు, గిరిజన పాఠశాలలు, గురుకులాల ప్రిన్సిపాల్స్, వార్డెన్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సిడ్నీకి చేరిన తెలంగాణ శాసనసభా బృందం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) సదస్సులో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర శాసనసభా బృందం ఆస్ట్రేలియాలోని సిడ్నీకి చేరుకుంది. సోమవారం ఈ సదస్సు జరిగే ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్లిన ప్రతినిధి బృందం అక్కడ తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుంది.

తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాష్ ముదిరాజ్, శాసనసభ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు నవంబర్ 5, 6, 7 తేదీల్లో జరిగే ఈ సదస్సులో పాల్గొననున్నారు. నిర్వాహకులు సదస్సుకు సంబంధించిన సమాచారాన్ని అందచేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో అక్కడి చట్ట సభల పనితీరుపై చర్చలు జరిపారు.

డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు హర్షనీయం

- ఆర్ కృష్ణయ్య



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ కులగణన కోసం డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం పట్ల రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి సోమవారం హైదరాబాద్‌లో ఆయన సీఎంను కలిశారు. కమిషన్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యపీజీ అడ్మిషన్లకు లోకల్ సమస్య

జీవో 148ని మార్చాలని కోరుతున్న వైద్యవిద్యార్థులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్థానికులెవరు? స్థానికేతరులెవరు?. వైద్యవిద్యను అభ్యసించేందుకు ఆసక్తి కలిగిన వారిలో లోకల్ ఎవరు? నాన్ లోకల్ ఎవరు?. రాష్ట్రంలో వైద్య పీజీ అడ్మిషన్లకు లోకల్ అభ్యర్థుల గుర్తింపు సమస్యగా మారింది. గతంలో ఎంబీబీఎస్ అడ్మిషన్ల సమయంలోనూ ఇలాగే సమస్య ఎదురు కాగా, పీజీ అడ్మిషన్ల సమయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 148తో తమకు అన్యాయం జరుగుతుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షలు ముగిసి అడ్మిషన్ల ప్రక్రియకు మధ్యలో జీవో జారీ చేశారని పలువురు విద్యార్థులు వాపోయారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో జీవో తీసుకురావడంతో తమకు సమస్యగా మారిందని చెప్పారు. ఈ విషయంపై ఇప్పటికే కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు శనివారం వైద్య విద్యార్థులు యాంగటి శివ రామక్రిష్ణ, సీహెచ్.వి.సాయి జితేందర్ రెడ్డి, ఎం.శ్రీ సాయిపవన్, టి.మనోజ్ రామ్, డి.పృథ్వీరెడ్డి, సయ్యద్ నదీం షాహిద్ హుస్సేన్, ఓంకార్ వర్షిత్, కె.కృష్ణారెడ్డి వినతిపత్రం సమర్పించారు. సోమవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా చొంగ్తూను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ఎంబీబీఎస్ చదివిన నాన్ లోకల్ విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జీవో 148తో 4 వేల మంది మెడికల్ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ జీవోతో పీజీ సీటు పొందేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్ వరకు ఇతర రాష్ట్రాల్లో చదివి తెలంగాణలో ఎంబీబీఎస్ చేసిన విద్యార్థులను పీజీ కౌన్సెలింగ్ కు అనర్హులుగా ప్రకటించారని గుర్తుచేశారు. దీంతో 2014 నుంచి 2023 వరకు తెలంగాణలో ఎంబీబీఎస్ చేసిన విద్యార్థులు మరే రాష్ట్రంలో లోకల్‌గా పరిగణించలేని పరిస్థితి ఉందని చెప్పారు. దీంతో ఏ రాష్ట్రంలోనూ పీజీ సీటు దొరికే అవకాశం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని నిబంధనలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడం సరికాదని సూచించారు. 2024 ముందు జాయిన్ అయిన మెడికల్ విద్యార్థులను గ్రేస్ పీరియడ్ ఇచ్చి పీ జీ కౌన్సిలింగ్‌కు అనుమతివ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులు ఏ రాష్ట్రంలో పాఠశాల విద్యనభ్యసించారనే దానితో నిమిత్తం లేకుండా ఆయా రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చేసిన వారిని స్థానికులుగా పరిగణిస్తున్నారని తెలిపారు. ఈ జీవోతో తెలంగాణ వలస వచ్చి స్థిరపడిన వారితో పాటు, కేవలం విద్యాభ్యాసం కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లిన విద్యార్థులకూ నష్టం జరుగుతుందని వివరించారు.

పాఠశాల గేటు మీద పడి బాలుడు మృతి


- హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఘటన

నవతెలంగాణ-హయత్‌నగర్

ఉదయ పాఠశాలకు వెళ్లిన బాలుడు.. ఆవరణలో ఆడుకునే క్రమంలో గేటు పట్టుకుని ఊగుతుండగా.. అది ఊడి మీద పడటంతో ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం జరిగింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ నెహ్రూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం అడవిదేవులపల్లి గ్రామానికి చెందిన చందు-సరోజ దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు ఆలకంటి అజయ్(6). వారు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి హయత్‌నగర్‌లోని ముదిరాజ్ కాలనీలో నివాసం ఉంటున్నారు.

అజయ్ హయత్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగా సోమవారం అతను పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రహరీ ప్రధాన గేటు పట్టుకుని అటు ఇటూ ఊగుతూ ఆడుకుంటుండగా వెల్డింగ్ జాయింట్లు ఊడి గేటు బాలుడి మీద పడింది. దాంతో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్ ప్రిన్సిపాల్‌గా ప్రసాద్



నవతెలంగాణ-హయత్‌నగర్

డిగ్రీ కళాశాల హయత్ నగర్‌కు నూతన ప్రిన్సిపాల్‌గా సీ.హెచ్.ప్రసాద్ సోమవారం భాద్యతలు స్వీకరించారు.అక్టోబర్ 31న డా. కె. జ్యోత్స్నప్రభ ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్ ప్రిన్సిపాల్‌గా పదవీవిరమణ చేశారు. స్థానంలో తెలంగాణ కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల బడంగ్‌పేట ప్రిన్సిపాల్‌గా ప్రసాద్ పనిచేసి పూర్తి అదనపు బాధ్యతలతో హయత్‌నగర్ ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. కళాశాల సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి అభినందించారు. వారికి తమ పూర్తి సహాయ సహకారాలను అందజేస్తామని అధ్యాపక బృందం అన్నారు.కళాశాల అభివృద్ధికి తన శక్తి మేరకు తోడ్పడుతానని నూతన ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా తెలియజేశారు.

రాహుల్ గాంధీ పర్యటనను విజయవంతం చేద్దాం

- కిచ్చనగారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

తెలంగాణలో నేడు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చనగారీ లక్ష్మరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాహుల్ గాంధీకి ఘన స్వాగతం పలికేందుకు బేగంపేట విమానాశ్రయానికి తరలిరావాలన్నారు. మధ్యాహ్నం 1గంటలకు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. అక్కడి నుంచి బేగంపేట ఎయిర్ పోర్ట్‌కు భారీ కాన్వాయ్ గా తరలి వెళ్లి నేతకు స్వాగతం పలుకుదామన్నారు. బోయిన్‌పల్లిలోని ఇందిరాగాంధీ ఆడిటోరియంలో సాయంత్రం 5 గంటలకు కులగణన సదస్సు జరగనుందని తెలిపారు.



దుర్వాసనతో
పొంగుతున్న డ్రయినేజీ మురుగునీరు

- చంపాపేట్ డివిజన్‌లో ఇబ్బందులు పడుతున్న స్థానికులు

నవతెలంగాణ-చంపాపేట్

చంపాపేట్ డివిజన్ పరిధిలోని దుర్గ భవాని నగర్ కాలనీలో భాష్యం హైస్కూల్ సంతోష్ నగర్ బ్రాంచ్ వద్ద దుర్వాసనతో డ్రయినేజీ మురుగునీరు పొంగిపొర్లుతుండడంతో కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎదురుగా వెళ్ళే రోడ్డు మీద మురుగు రావడంతో పాదచారులు, వాహనదారులు, బ్యాంకుకు వచ్చే కస్టమర్లు, విద్యార్థులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతూ అప్పుడప్పుడు జారి గాయాల పాలవుతున్నారు. 15 రోజుల తరబడి మురికి నీరు పొంగి పొర్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే దాఖలాలు లేవని బస్తి వాసులు ఆరోపిస్తున్నారు.

వాటర్ వర్కర్స్ పరిధిలోని ఆయా ప్రాంతాలలో నిత్యం డ్రయినేజీ మురుగునీరు రోడ్డుపై పొంగిపొర్లుతూ ప్రవహిస్తున్నదని స్థానికులు చెబుతున్నారు. ఇకపోతే సమీపంలో ఉన్న పాఠశాలలు, దేవాలయాలు, చర్చిల వద్ద రద్దీగా ఉంటుంది. అయితే డ్రయినేజీ పొంగి పొర్లుతుండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు స్పందించి తూతూమంత్రంగా చర్యలు చేపడుతున్నారని ప్రాణాలు పోతే తప్ప వాటర్ వర్కర్స్ అధికారులకు పట్టదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా వాటర్ వర్కర్స్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పొంగిపొర్లుతున్న డ్రయినేజీ సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వనస్థలిపురం గ్రంథాలయంలో వసతులు కల్పించాలి

- నూతన భవనం నిర్మించాలి
- తెలంగాణ అధ్యయన వేదిక సమన్వయ కర్త భగవత్ రెడ్డి ఆధ్వర్యంలో





నవతెలంగాణ-ఎల్బీనగర్

జీర్ణావస్థలో ఉన్న వనస్థలిపురం శాఖా గ్రంథాలయానికి వెంటనే నూతన భవనం నిర్మించాలని పుస్తక అభిమానులు కోరుతున్నారు. తెలంగాణ అధ్యయన వేదిక సమన్వయ కర్త భగవత్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు ఆధీనంలో నేడు రాష్ట్రంలో 670 గ్రంథాలయ శాఖలు ఉన్నవని తెలిపారు. పాఠకజన ఆలోచనలకు పదును పెట్టి సమాజాన్ని అభివద్ధి పథంలో నడిపించే గ్రంథాలయాలు అనేకం నేడు వసతుల లేమితో వెలవెల పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వనస్థలిపురం శాఖ గ్రంథాలయం 1991 వ సంవత్సరంలో ఆనాటి ముఖ్యమంత్రి జనార్ధన్ రెడ్డి చే ప్రారంభించినట్టు తెలిపారు. 33 సంవత్సరాల పూర్వం ప్రారంభమైన ఈ గ్రంథాలయానికి నేటికి వసతులతో కూడిన సొంత భవనం లేదని.. ఎన్జీవో కాలనీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వారి రేకుల షెడ్డులో ఉన్న గ్రంథాలయం శిథిలావస్థలో ఉందన్నారు. సిమెంట్ రేకులు పగిలి లోపలికి నీళ్ల చేరుతున్నాయని చెప్పారు. పాడైపోయిన కిటికీల నుండి పాములు తేళ్లు చేరి పాఠకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నవన్నారు. గోడలు నెమ్ముటిల్లి క్షీణ దశలో ఉన్నాయని.. గాలి వెలుతురు లేని దుస్థితి నెలకొందన్నారు. పాఠకులకు అవసరమైన కుర్చీలు, టేబుల్ లు, ఇతర సౌకర్యాలు అరకొర గానే ఉన్నాయని చెప్పారు. 33 సంవత్సరాల క్రితం కేవలం రెండు మూడు కాలనీలు మాత్రమే ఉన్న వనస్థలిపురం నేడు 200 కాలనీలతో, 10 లక్షల పైగా జనాభాతో విస్తరించి ఉందని.. పాఠకుల అవసర నిమిత్తం పెద్ద గ్రంథాలయం అవసరం అన్నారు. ఎన్జీవో కాలనీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వారు గ్రంథాలయం నిర్మాణం కోసం 400 చదరపు గజాల స్థలం కేటాయించారని, భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 60 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. అయినప్పటికిని అనేక సాంకేతిక లోపాల మూలంగా, సమన్వయ లోపం మూలంగా నిర్మాణం ఆగిపోయిందన్నారు. ఇటీవల మూడు పిల్లరు తవ్వి వదిలేసినట్టు తెలిపారు. జనబాహుల్య ప్రయోజనార్థం స్థానిక ప్రజాప్రతినిధులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, కార్పొరేటర్లు ,గ్రంథాలయ పరిషత్తు అధికారులు,వివిధ కాలనీ సంఘాలు ,విద్యార్థి, యువజన ,ప్రజా, సంఘాలు స్పందించి గ్రంథాలయ భవన నిర్మాణం చేయడానికి కృషి చేయాలని కోరారు. సభ్యులు బీజీఎం రెడ్డి, అనసూయ, సాయికుమార్, జగన్మోహన్, బుచ్చిరెడ్డి,మల్లన్న గోవర్ధన్ ,బ్రహ్మచారి,భాస్కర్ రాజు తదితరులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆత్మవిశ్వాసానికి అంగవైకల్యం అడ్డురాదు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో ఆత్మస్థైర్యాన్ని అంగ వైకల్యం అడ్డురాదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పర్యటిస్తున్న సబితా ఇంద్రారెడ్డి.. అంగవైకల్యంతో ఉండి జొమాటో కంపనిలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న యువకుడిని చూసి ఆత్మీయతతో పలకరించారు. ఒక వికలాంగుడు ఒక చేయి, చెవులు కూడా సరిగ్గా వినపడదని తెలుసుకొని ఆత్మవిశ్వాసం ముందు ఎలాంటి అంగవైకల్యమైనా సరే అడ్డు రాదని ఆ యువకుడి ద్వారా నిరూపితమైందని ఎమ్మెల్యే తెలిపారు. యువకుడు ఎమ్మెల్యేతో ఫోటో దిగాలని కోరగా.. ఎమ్మెల్యే కారు దిగి అతనితో ఫోటో దిగి మానవత్వాన్ని చాటుకున్నారు.

రైతుకు బాసటగా సహకార సంఘం

- బాట సింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మెన్ చేగూరి భరత్ కుమార్



నవతెలంగాణ -అబ్దుల్లాపూర్ మెట్

రైతుకు బాసటగా ఉంటూవారి సంక్షేమ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చెస్తానని బాట సింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మెన్ చేగూరి భరత్ కుమార్ అన్నారు. బాటసింగారం రైతుసేవా సహకార సంఘం పరిధిలోని అనాజీ పూర్ గ్రామానికి చెందిన సంఘం సభ్యులు / రైతు బూడిద శివ అక్టోబర్ 4న మృతి చెందిన విషయం విధితమే. మృతి చెందిన బూడిద శివ భార్య బూడిద భారతికి సోమవారం సహకార సంఘం చైర్మెన్ చేతుల మీదగా రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేసి చేయూతనందించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ బాట సింగారం రైతు సేవా సంక్షేమ సంఘం నిరంతరం రైతుల సంక్షేమ అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. అకాల మరణం చెందిన రైతుల కుటుంబాలకు బాసటగా నిలుస్తుందన్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే రైతులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తూ వస్తుందన్నారు. ఇక మున్ముందు కూడా రైతు సంక్షేమ అభివద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు ఇటికల మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యాదిరెడ్డి, మేకల రాములు, కందాడి మహిపాల్ రెడ్డి, మేనేజర్ జక్కుల ఐలేష్, నాయకులు జంగమయ్య గ్రామస్తులు, సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భార్యతో గొడవ పడి భర్త అదశ్యం...

నవతెలంగాణ-హయత్ నగర్



భార్యతో గొడవ పడి భర్త అదశ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హయత్ నగర్‌లోని శుభోదయ కాలనీ రోడ్ నెంబర్ 2లో నివాసం ఉంటున్న నీరుడు నరేందర్, ఉష దంపతులు ప్రేమించి పెండ్లి చేసుకున్నారు.గత నెల 20న భార్య,భర్త లిద్దరూ గొడవ పడ్డారు. అనంతరం భర్త ఇంట్లో నుంచి వెళ్లి పోయి మరుసటి రోజు ఫోన్ చేసి తాను ఉద్యోగంపై బయటికి వెళ్తున్నానని చెప్పాడు. అనంతరం అప్పటి నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో భార్య పోలీసులకు ఫిర్యా దు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ కాలనీలో నూతనంగా రూ.80 లక్షలతో చేపడుతున్న సి.సి రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్, ఏ.ఈ మల్లికార్జున్ గౌడ్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీల రోడ్డు నిర్మాణం విషయంలో పూర్తి నాణ్యతతో కూడిన మెటీరియల్ వాడి పారదర్శకంగా పనులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అభివృద్ధి పనులను వీలైనంత తొందరగా చేపట్టి త్వరగతిన నిర్మాణాలను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. వారితో వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, హనుమాన్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కష్టారెడ్డి, ప్రధాన కార్యదర్శి లెంకల శ్రీకాంత్ రెడ్డి,గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



- ఎల్.కోటయ్య

నవతెలంగాణ-చంపాపేట్

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఫెడరేషన్ సౌత్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎల్ కోటయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆటో డ్రైవర్స్ జేఏసీ అధ్వర్యంలో మంగళవారం (నేడు) జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చంపాపేట డీ మార్ట్ ఆటో స్టాండ్ వద్ద నాయకులు పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలుకాని హామీలను నెరవేరుస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ. 12 వేలు, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలు నేరవేరలేదన్నారు. పైగా మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్లందరికి జీవనోపాధిపై పెద్ద దెబ్బతగిలిందన్నారు. నష్టపోయిన డ్రైవర్లను ఆదుకుంటామని సీఎం, మంత్రి పలు సందర్భాల్లో చెప్పారని.. కానీ 10 నెలలు గడుస్తున్నా ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. నష్టపోయిన డ్రైవర్ల పక్షాన ఆటో సంఘాలుగా ధర్నాలు ఆందోళనలు చేశామని గుర్తు చేశారు. హైదరాబాద్ నగరంలో గత 11 ఏండ్ల నుంచి పెరిగిన పెట్రోల్, డీజిల్, ఆయిలు, గ్యాస్, నిత్యావసర ధరలకు అనుగుణంగా ఆటో మీటరు చార్జీలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రాష్ట్ర ఆటో జేఏసీ అధ్వర్యంలో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ సౌత్ కమిటీ నాయకులు దేవయ్య, ఆటో స్టాండ్ కమిటీ నాయకులు శివ, ప్రసాదు, డేవిడ్ రాజు, ప్రకాష్, పంతులు, సుధాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్‌లోని 20వ డివిజన్ శ్రీలక్ష్మీ నగర్, 30 డివిజన్ వేంకటేశ్వర కాలనీలో డ్రయినేజీ నిర్మాణ పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి స్థానిక కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి,పెద్దబావి సుదర్శన్ రెడ్డిలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు.గత ప్రభుత్వం చేయలేని అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయటం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో పలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల జీవిత భాగస్వాములకు ఆరోగ్య పరీక్ష



నవతెలంగాణ-హయత్‌నగర్

ఆర్టీసీ ఉద్యోగుల జీవిత భాగస్వాముల సహకారంతోనే సంస్థ అభివృద్ధి చెందుతుందని మేనేజర్ సుచరిత అన్నారు. సోమవారం హయత్ నగర్ 1 డిపోలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్క ఉద్యోగి జీవిత భాగస్వామికి నిర్వహించేందుకు హెల్త్ క్యాంపు కార్యక్రమాన్ని నిర్వహించగా రిబ్బన్ కట్ చేసి ఆమె ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆహార నియమాలు పాటించాలన్నారు. ఉద్యోగులు డ్యూటీకి వచ్చే సమయంలో వారి ఆరోగ్య రక్షణ కోసం రుచికరమైన భోజనం అందించడం, వారి యోగాక్షేమలు చూసేందుకు వారు కుడా ఆరోగ్యం గా ఉండడానికే ఈ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశం ప్రతి ఒక్క ఉద్యోగి ఉపయోగించుకొని వారి జీవిత భాగస్వాములను మరింత ఆరోగ్యంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో డిపో మేనేజర్ విజయ్, సహాయ మేనేజర్‌లు విజయకుమారి, శ్రీనివాస్, జంగయ్య మైస. నరేష్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను తొలగించాలి

- కార్పొరేటర్ కొంతం విజయలక్ష్మి

నవతెలంగాణ - మీర్‌పేట్

అపార్ట్మెంట్ పార్కింగ్ ఏరియాలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్న నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్ కొంతం విజయలక్ష్మి రాజ్ ముదిరాజ్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనప్రియ మహానగర్ ఐదవ బ్లాక్ జీ4 లో 118 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ఒక కుటుంబానికి షిల్ట్ ఏరియా గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం వాహనాలు పెట్టడానికి పార్కింగ్ బ్లాక్ అందరికీ రిజిస్ట్రేషన్ చేసినట్టు తెలిపారు. అయితే కొంతమంది బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేసి కమర్షియల్ షెటర్లుగా నిర్మాణం చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలు చేయడమే కాకుండా ప్రశ్నించిన వ్యక్తులను బెదిరిస్తూ ఎవ్వరికైనా చెప్పుకోండి అంటూ భయాందోళనలకు గురిచేస్తున్నారని అన్నారు. మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించి నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాపాడాల్సిన వారే.. భక్షకులుగా మారితే ఎలా..?



- బీజేపీ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

కంచే చేను మేసిందన్నట్టుగా మేయర్, కమిషనర్ అవినీతి పరులుగా మారితే, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కాపాడేది ఎవరని బీజేపీ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి ఆరోపించారు. సోమవారం నాదర్ గుల్ గ్రామంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేయర్ చిగిరింత పారిజాత, ఆమె భర్త నరసింహారెడ్డి, బదిలీపై వెళ్లిన కమిషనర్ రఘుతో కలిసి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. మేయర్ బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను ఒక ఏటీఏంగా మార్చుకున్నారన్నారు. మేయర్ అవినీతిపై అనేక సార్లు ఉన్నత స్థాయి అధికారులకు కూడా పిర్యాదు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని అవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి మొత్తం మేయర్ కన్ను సన్నాల్లో జరుతున్నదని వెంకట్ రెడ్డి ఆరోపించారు.

కార్పొరేషన్ పరిధిలోని బడంగ్ పేట్, నాదర్ గుల్ ప్రధాన రహదారికి ఇరువైపులా ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్స్‌తో కూడిన బహుళ అంతస్తుల భవనాలు ఎలా నిర్మిస్తున్నారని ప్రశ్నించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా గల ప్లాట్ల యాజమానుల నుంచి ముడుపులు తీసుకొని, నూట యాభై ఫీట్ల రోడ్డును వంద ఫీట్లకు కుదిస్తూ.. తీర్మానం చేయించింది నిజం కదా అని నిలదీశారు. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడమే కాకుండా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ పరిధిలోని మున్సిపల్ కాలనీలోని పార్కు స్థలాలకు బై నెంబర్లు వేసి, విక్రయించారని ఆరోపించారు. ఇదే విషయంపై సిడీఏం, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కు పిర్యాదు చేస్తే, పార్కు స్థలాల ఆక్రమణపై విచారణ చేయాలని అప్పటి బీఎంసీ కమిషనర్ రఘును జిల్లా ఉన్నత అధికారులు ఆదేశిస్తే, ఆయన దానిని విచారణ చేయకుండా అలానే తొక్కిపెట్టారని మండిపడ్డారు. దీనిపై మరోసారి ఉన్నత స్థాయి అధికారులకు పిర్యాదు చేయనున్నట్టు చెప్పారు. మేయర్, ఆమె భర్త ప్రధాన రహదారికి ఇరువైపులానే కాకుండా పార్కు స్థలాలు, గ్రీన్ జోన్, ఓపెన్ స్పెస్, గుట్టలు, కొండలు, అనే తేడా లేకుండా భారీ భావన నిర్మాణాలను ప్రోత్సహించి, పెద్ద ఎత్తున డబ్బుల వసూళ్లకు పాల్పడు తున్నారని ఆరోపించారు. మేయర్, ఆమె భర్త ఎంతలా అవినీతిని చేస్తున్నారంటే, అవినీతి నిరోధక శాఖ అధికా రులను సైతం వారు అవినీతి పరులుగా మార్చగలన్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు మేయర్, కమిషనర్‌పై వస్తున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేసి, పార్కు స్థలాల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, రాలగూడెం రామకృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఉంటాయి'



నవతెలంగాణ-దిల్ సుఖ్ నగర్

ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఉంటాయని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి తెలిపారు. ఆర్ కె పురం డివిజన్ లో డీజేఈ స్పోర్ట్స్ హబ్ లో నిర్వహించిన క్రీడా పోటీలను ఉపేందర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు డీజే స్పోర్ట్స్ హబ్ నుంచి ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని ప్రకటించారు. కరాటే పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన పల్లవిని అభినందించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నేతలు పెద్దపూర సైదులు, శ్రీకాంత్, అరవింద్, కరాటే శిక్షకులు మహేష్, శివ, విప్లవ్ లు పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యా కమిషన్ కమిటీ సభ్యులుగా నియమితులైన చారగొండ వెంకటేష్ ను కాంగ్రెస్ హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు దెంది శశిధర్ రెడ్డి వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువ తో సత్కరించారు. వారితో పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నవతెలంగాణ - హస్తినాపురం





బ్యాడ్మింటన్ పోస్టర్ ఆవిష్కరించిన ఉప్పల

నవతెలంగాణ- నాగోల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి మూడు రోజులపాటు నిర్వహించే అండర్ 11 అండ్ 13 సింగిల్స్ డబుల్స్ విభాగం పోస్టర్‌ను సోమవారం అసోసియేషన్ అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ,అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త నాగోల్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 14 ,15,16 తేదీల్లో నాగోల్‌లో ఆర్ త్రీ (ఎస్ జోన్) బ్యాడ్మింటన్ అకాడమీలో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.విజేతలకు రూ. లక్షా యాభై వేల చెక్కును అందజేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వికాస్ హర్ష యాదవ్, నాగరాజు,రమేశ్ పిల్లలమర్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 59 ఫిర్యాదులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికాగుప్తా స్వీకరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 59 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాకు అన్ని శాఖల సహకారం అవసరం



- అప్పుడే లక్ష్యాలు నెరవేరుతాయి
- ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొ. కె. పురుషోత్తమ్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

పీసీబీ, జీహెచ్‌ఎంసీ, హెచ్ ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ ఇలా ప్రభుత్వ శాఖలన్నీ సహకరించినప్పుడు హైడ్రా లక్ష్యాలు చేరుకోవడం సులభం అవుతుందని ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొ. కె. పురుషోత్తమ్ రెడ్డి తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా హైడ్రా వచ్చిన తర్వాత.. చెరువులేంటి.. బఫర్ జోన్ ఏంటి, క్యాచ్‌మెంట్ ఏరియా అంటే ఏంటి.. ఇంటి స్థలం లేదా ఇల్లు కొనాలంటే.. అది ప్రభుత్వ భూమినా.. చెరువు గర్భంలో ఉందా అనేది సామాన్యులు కూడా తెలుసుకుంటున్నారన్నారు.

గొలుసుకట్టు చెరువులు, కాలువల పరిరక్షణ, పునరుద్ధరణకు తక్కువ ఖర్చుతో ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశంపై హైడ్రా కార్యాలయంలో సోమవారం హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగర ప్రజలకు మెరుగైన జీవనాన్ని అందించే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రాకు అప్పగించిన టాస్క్‌ను ముందుగా హైడ్రా కమిషనర్ వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణకు తీసుకుంటున్న చర్యలు తెలిపారు. ఈ సందర్భంగా పురుషోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ "తెలంగాణలో అర్బనైజేషన్ వేగంగా అవుతోంది. ఇలాంటి తరుణంలో పట్టణాలు ఎలా ఉండాలి, పర్యావరణాన్ని కాపాడడం ఎలా.. పీసీబీ ఎలా పని చేయాలి ఇలా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఒక పట్టణ విధానాన్ని రూపొందించాలి. స్పష్టమైన విధానాలు, కచ్చితంగా చట్టాల అమలు జరిగినప్పుడే భవిష్యత్ తరాలకు పర్యావరణంతో కూడిన మెరుగైన జీవనాన్ని అందించగలం అన్నారు.

ఎంతో చక్కటి వాతావరణం ఉన్న నగరాన్ని కాపాడుకోవడం అందరూ బాధ్యతగా స్వీకరించాలి. చెరువుల పరిరక్షణే కాదు.. కాలుష్య కారణాలపైనా దష్టి పెట్టాలి. వర్షపు నీటి పరిరక్షణ, నీటితో నిండిన చెరువులు, భూగర్భజలాలు, భూమి డ్రైగా మారకుండా.. భూమి కాలష్యమయం అవ్వకుండా హైడ్రా కాపాడాలి. చెరువుకు నీరు ఎలా వస్తోంది.. ఆ చెరువు నిండిన తర్వాత నీరు ఎటు వెళ్లాలి అనే అంశాలను పరిగణనలోకి తీసుకుంటే నగరంలో వర్షాకాలం వరదలు, ఎండాకాలం భూగర్భ జలాలు అడుగంటడం ఉండదు. జహీరాబాద్ దగ్గరలోని కొహిర్ మండలం గొట్టిగారిపల్లెలో చెరువులను పరిరక్షించుకునే విధానం బాగా జరిగింది. ఎలాంటి నీటి వనరులు లేని గ్రామంలో ఇప్పుడు మూడు పంటలు పండిస్తున్నారు. చెరువుల పరిరక్షణ తీరును పరిశీలించాలి. జీహెచ్ ఎంసీ, పీసీబీ, ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలతో పాటు.. పర్యావరణ ప్రేమికులు, నగర అభివద్ధిని ఆకాంక్షిన యువతతో సమావేశాలు ఏర్పాటు చేసి.. చెరువులు, కాలువలు, పర్యావరణ పరిరక్షణలో నగర ప్రజలందరినీ భాగస్వామ్యం చేయాలి" అని ప్రొఫెసర్ పిలుపునిచ్చారు.

అంబేద్కర్ అభయ హస్తం అమలు చేయాలి



- పోరాటాల ఫలితమే మెస్ చార్జీల పెంపు
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.స్కైలాబ్ బాబు

నవతెలంగాణ-కాప్రా

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు దళితుల సంక్షేమం కోసం అంబేద్కర్ అభయ హస్తం పేరుతో రూ.12 లక్షల ఇస్తామని చెప్పిన వాగ్దానం చిత్తశుద్ధితో అమలు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ. స్కైలాబ్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కమలానాగర్ ఎస్వీ భాస్కర్ రావు భవన్‌లో కేవీపీఎస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాస్థాయి సమావేశాన్ని సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. కృపాసాగర్ అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా స్కైలాబ్ బాబు హాజరై మాట్లాడుతూ కేవీపీఎస్ విద్యార్థి సంఘాలు దశల వారీగా సాగించిన పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచుతూ జీవో నెంబర్ 9 విడుదల చేసిందన్నారు. ప్రీ మెట్రిక్ విద్యార్థులు 3 నుంచి 7తరగతుల విద్యార్థులకు రూ.380, 8 నుంచి 10 తరగతి విద్యార్థులకు రూ.440, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు ఇంటర్ నుంచి పీజీ వరకు రూ.600 పెంచిందన్నారు. ఈ పెంపు పెరిగిన ధరల కనుగుణంగా లేదన్నారు. ప్రీ మెట్రిక్ 3 నుండి 7 తరగతుల విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు రూ.50 నుండి 175, 8 నుండి 10 తరగతిలకు రూ.75 నుంచి 275కు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల మెస్ ఛార్జీలపెంపు కోసం కేవీపీఎస్ సర్వేలు, ధర్నాలు నిర్వహించిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులకు పోరాట మార్గం తప్ప మరో మార్గం లేదన్నారు. గత ప్రభుత్వం 10 ఏండ్లుగా మెస్‌చార్జీలు పెంచలేదన్నారు. ఈ ప్రభుత్వం కొంతమేరకైనా కాస్మోటిక్ చార్జీలు, మెస్‌చార్జీలు పెంచడం హర్షణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే చంద్రశేఖర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎస్.బాలపీరు, జిల్లా ఉపాధ్యక్షులు గుంటి లక్ష్మణ్, బాలయ్య, సీహెచ్ అశోక్, మధు, నర్సిహ్మా, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల మహా ధర్నాను విజయవంతం చేయాలి

- బీఆర్టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్



నవతెలంగాణ-మేడ్చల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నేడు నగరంలోని ఇందిరా పార్కు వద్ద చేయనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని బీఆర్టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికుల భవిష్యత్ కోసం పలు డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు. ఆటో మోటర్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో మెయిన్ టెనెన్స్ కోసం ఏడాదికి రూ.12వేల ఇవ్వాలన్నారు. ఓలా, ఊబర్, ర్యాపిడో పేరుతో నడుస్తున్న టూ విల్లర్ బైకలను నిషేధించి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కీసరగుట్టను టెంపుల్ టూరిజం క్రింద అభివృద్ధి చేస్తాం





- దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- కీసరగుట్టలో నిర్వహించిన సామూహిక దీపోత్సవంలో పాల్గొన్న మంత్రి
- మహిళలకు పసుపు, బొట్టు, కుంకుమ, జాకెట్లు, గాజులు అందజేత

నవతెలంగాణ-కీసర

ప్రఖ్యాత శైవ క్షేత్రమైన కీసరగుట్ట ఆలయాన్ని టెంపుల్ టూరిజం క్రింద అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా మొదటి సోమవారం కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన సామూహిక దీపోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. సామూహిక దీపోత్సవం కార్యక్రమం కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం కన్నుల పండువగా నిర్వహించారు. సామూహిక దీపోత్సవంలో పాల్గొన్న 200 మంది మహిళలకు పసుపు, బొట్టు, కుంకుమ, జాకెట్లు, గాజులు, ప్రసాదం కిట్లను మంత్రి అందజేశారు. అనంతరం రంగంపేట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి అనుగ్రహ ప్రవచనంను కార్తీక వైభవం గురించి తెలిపారు. ఆదివారం, సోమవారం శ్రీ వినాయక నాట్యమండలి సురభి వారు భూకైలాస్, మాయాబజార్ నాటకాలు నిర్వహించారు. ఈవో సుధాకర్ రెడ్డి, చైర్మెన్ తాటకం నాగ లింగం శర్మ, ఆలయ ధర్మ కర్తలు, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మండలాధ్యక్షుడు కొల కృష్ణ యాదవ్, కీసర గ్రామ శాఖ అధ్యక్షుడు జూపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘం దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షులుగా గాదె రాము



నవతెలంగాణ-కీసర

ఆర్య వైశ్య సంఘం దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్ట్ గాదె రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం దమ్మాయిగూడ సిద్ధార్థ నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆర్యవైశ్య సంఘం దమ్మాయిగూడ శాఖ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ సభ్యత్వాల వైస్ చైర్మెన్ వాస కిరణ్ కుమార్, జిల్లా పీఆర్వో కమిటీ చైర్మెన్ రేణిగుంట మహేష్ కుమార్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సంతోష్ మంచన, జిల్లా కార్యవర్గ సభ్యులు టి. రమేష్ గుప్తా పాల్గొన్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా బోనుగుల లక్ష్మణ్ రావు, కోశాధికారిగా తొడుపునూరి వినేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మంచాల చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా టి. రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రేపల్లె రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మోటమర్రి ప్రవీణ్ కుమార్, సలహాదారులుగా సారపు శ్రీనివాస్, సి.నాగరాజ్, కార్యవర్గ సభ్యులుగా గొల్ల శివ కుమార్, విజయ్ కుమార్ గుప్తా, ఉపాధ్యక్షులుగా చింతా కరుణాకర్, పూర్ణ చందర్, రాజా నాగేంద్రలను ఎన్నుకున్నారు.

అయ్యప్ప పడి పూజకు రూ.2 లక్షల విరాళం అందజేత



- నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

తత్వమసి సేవా సమాజం ఆధ్వర్యంలో నవంబర్ 30న నిర్వహించే 18 పడుల మహా పడిపూజ మహొత్సవానికి నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి సోమవారం రూ. 2 లక్షల చెక్కును అయ్యప్ప భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బెస్త వెంకటేష్, మామిడి పాపిరెడ్డి, రామిడి మల్లారెడ్డి ఘనపురం వెంకట్ రెడ్డి, తదితరులున్నారు.

జవహర్‌నగర్‌లో పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దరి మిస్సింగ్





నవతెలంగాణ - జవహర్ నగర్

వివిధ కారణాలతో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...

ఆటో డ్రైవర్ మిస్సింగ్..

సోనీ కుమారి(25), విక్రమ్ కుమార్ శర్మ (35) దంపతులు పాట్నా జిల్లా, బీహార్ నుండి వలస వచ్చి బాలాజీనగర్‌లోని సంతోష్‌నగర్‌లో తన కుటుంబంతో సహా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం విక్రమ్ కుమార్ శర్మ తన ఆటో TS10UC3764లో ఇంటి నుండి బయలుదేరాడు. రాత్రి 11గంటలకు తన భార్య సోనీ కుమారికి ఫోన్ చేసి ఉదయం ఇంటికి వస్తానని చెప్పి రాలేదు. దీంతో కంగారు పడిన అతడి భార్య సోనీకుమారి తెలిసిన చోట్ల, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించక పోవడంతో సోమవారం జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓ వృద్ధుడు మిస్సింగ్..

దానమైన నరసింహ విరాట్‌నగర్ కాలనీలోని జమ్మిగడ్డలో తన కుటుంబంతో సహా నివాసం ఉంటున్నారు. దానమైన నరసింహ తండ్రి దానమైన జమ్మయ్య (70) వృత్తి రీత్యా బిచ్చగాడు. భిక్షాటన కోసం గత సోమవారం రాత్రి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, అతడికి కల్లు తాగే అలవాటు ఉందని, కంటి చూపు సరిగ్గా లేదని తెలిపారు. గతంలో అతను ఇంట్లో కనిపించకుండా పోయాడని, పీఎస్‌లో ఫిర్యాదు చేసి మూడు రోజుల తర్వాత ఆచూకీ లభించిందని పేర్కొన్నారు. తెలిసిన అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో నరసింహ సోమవారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసులు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సందర్శకులతో కిటకిటలాడిన శివాలయాలు



నవతెలంగాణ-శామీర్‌పేట

కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల వ్యాప్తంగా శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పెద్ద ఎత్తున శివాలయాలకు వెళ్లి ఆయా గ్రామాలలో స్వామివార్లకు అభిషేకాలు చేశారు. చేశారు. కాగా శామీర్‌పేట మండల కేంద్రంలోని శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి (శివాలయం) ఆలయంలో ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన, మంత్రపుష్పం చేశారు. భక్తుల గోత్రనామాలతో అర్చన చేయగా భక్తులు స్వామివారికి పాలాభిషేకం చేశారు. ఉమ్మడి శామీర్ పేట మండలంలోని దేవరయాంజాల్, అలియాబాద్, తుర్కపల్లి, మజీద్‌పూర్, లాల్‌గడి మలక్‌పేట, జగ్గం గూడ, కొల్తూర్, కేశవరం, మూడుచింతలపల్లి, నాగిశెట్టిపల్లి, లక్ష్మాపూర్, ఉద్దమర్రి, పొన్నాల, బొమ్మ రాజ్ పేట తదితర గ్రామాలలో శివాలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. తూంకుంట పరిధిలోని శ్రీగాయత్రి మహా క్షేత్రంలో ఉమామహేశ్వర స్వామికి ఆలయ వ్యవస్థాపకులు, శిష్య జనోద్ధారక డాక్టర్ ఎస్‌వీఎల్‌ఎన్. మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

సీఐ సత్యనారాయణను కలిసిన కె.సహేందర్



నవతెలంగాణ-మేడ్చల్

ఇటీవల దళిత సమైఖ్య మేడ్చల్ మండల అధ్యక్షుడిగా నియామకమైన కె.సహేందర్ సోమవారం సీఐ సత్యనారాయణ, ఎస్సై గణేష్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సహేందర్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నేటి యువత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని జీవితంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

సీఎంఆర్ ఆస్పత్రిలో ఎంబీబీఎస్ విద్యార్థులకు ఓరియంటేషన్



నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకొయ్య సీఎంఆర్ ఆస్పత్రిలో సోమవారం ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా డాక్టర్ హనుమంత రావు పద్మశ్రీ, చైర్మెన్ చామకూర గోపాల్ రెడ్డిలు హాజరై మాట్లాడుతూ.. సీఎంఆర్ ఆస్పత్రిలో ప్రతిరోజు 900 మందికి ఓపీ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న అధునాతనమైన మౌలిక సదుపాయాలు వినియోగించుకుని సమాజానికి సేవ చేసే అత్యున్నతమైన డాక్టర్స్‌గా తయారు అవ్వాలని సూచించారు. 90 శాతం అటెండెన్స్ ఉంటేనే అది సాధ్యమన్నారు.

కార్యక్రమంలో ఎస్ఆర్ యూనివర్సిటీ ఛాన్సలర్ మధు కర్ రెడ్డి, వైస్ చైర్మెన్ అభినవ్ రెడ్డి, సెక్రటరీ సి.వసంత లత, మేనేజ్మెంట్ సభ్యులు సి. ఐశ్వర్య, సి అనురాగ్ రెడ్డి, డీన్ వెంకట రమణయ్య, డైరెక్టర్ అలీ బేగ్, ఏవో సురేష్, మేనేజర్ జె.దుర్గాప్రసాద్ రెడ్డి, డాక్టర్లు పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో మోడల్ వైకుంఠధామం నిర్మాణం



- కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్

నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లో రూ.3 కోట్ల వ్యయంతో అధునాతన హంగులతో మోడల్ వైకుంఠధామం నిర్మిస్తున్నామని కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. సోమవారం డివిజన్‌లో కొనసాగుతున్న వైకుంఠధామం పనులను డీఈ వెనల్ కుమార్ గౌడ్, ఏఈ వినీతరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ..వచ్చే వారంలో వైకుంఠధామం నిర్మాణ పనులను పరిశీలించేందుకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు రాబోతున్నారని చెప్పారు. పనులలో ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా లేటెస్ట్ టెక్నాలజీతో అన్ని వసతులు ఉండేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైకుంఠధామం కోసం నిధుల కేటాయింపునకు సహకరించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బాలకృష్ణ గౌడ్, మల్లికార్జున్ నగర్ అధ్యక్షులు అశోక్ చారి, బొల్లం లక్ష్మణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, కాంట్రాక్టర్ చంద్రశేఖర్ తదితరులున్నారు.

పోచారం మున్సిపల్ రాజీవ్‌గృహకల్పలో షెట్టర్ వేలం



నవతెలంగాణ - పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప లోని మూడో నెంబర్ షెట్టర్‌కు మున్సిపల్ కార్యాలయంలో చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి అధ్యక్షతన వేలం పాట నిర్వహించారు. వేలంలో చిన్నరాజు రూ.5250 పాడగా పోతురాజు సుధాకర్ రూ.5300 షెట్టర్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్‌తో పాటు కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, గొంగళ్ల మహేష్, సర్కిన్ని రవీందర్, నాయకులు నల్లవెల్లి శేఖర్, అఖిటి బల్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంగం లక్ష్మీబాయి విగ్రహ ఏర్పాటుకు కృషి





నవతెలంగాణ - పోచారం

స్వాతంత్ర్య ఉద్యమంలో ఉక్కు పిడికిలి, మట్టిలో మాణిక్యం యాదవ వీరనారి సంగం లక్ష్మీబాయి విగ్రహ ఏర్పాటుకు అన్ని రాజకీయ పార్టీల లీడర్లు కృషి చేయాలని ఏనుగు సుదర్శన్ రెడ్డి కోరారు. చౌదరిగూడ గ్రామంలో బాలు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనానికి ముఖ్యతిథిగా వచ్చిన ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ మాట్లాడుతూ.. చరిత్ర మరిచిన స్వాతంత్రోద్యమ ఉక్కు పిడికిలి, మట్టిలో మాణిక్యం యాదవ సోదరి, ఘట్కేసర్ ప్రాంత ఆడబిడ్డ సంగం లక్ష్మీబాయి అన్నారు. ఘట్కేసర్ లాంటి మారుమూల ప్రాంతంలో జన్మించి దేశ స్వాతంత్ర ఉద్యమంలో సైమన్ కమిషన్ లాంటి కీలక ఘట్టాలలో తెగువ చూపి పోరాడిన వీరవనిత అని కొనియాడారు. స్వాతంత్రానంతరం రాష్ట్ర సహాయ మంత్రిగా మెదక్ పార్లమెంట్ సభ్యురాలుగా పని చేసిన ఘట్కేసర్ ప్రాంత యాదవుల ఆడబిడ్డ అన్నారు.ఈ ప్రాంతం నుండి ఉన్నత శిఖరానికి ఎదిగిన యాదవ సోదరి ప్రాముఖ్యతను నేటి తరానికి చాటి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆమె సేవలను భవిష్యత్తు తరాలు గుర్తుంచుకునేలా ఘట్కేసర్ ప్రాంతంలో విగ్రహ ఏర్పాటుకు మనమందరం కృషి చేద్దామన్నారు. కాగా సుదర్శన్ రెడ్డి వినతికి తక్షణమే ఎంపీ ఈటల స్పందిస్తూ విగ్రహ ఏర్పాటుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీకి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టభద్రులు ఓటును నమోదు చేసుకోవాలి

● జేఎన్‌టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రంజిత్ కుమార్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కరీంనగర్ ఎమ్మెల్సీ నియోజకవర్గం (నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్) పట్టభద్రులుగా ఉన్నవారు తమ ఓటును నమోదు చేసుకోవాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఎన్‌టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2021 లోపు డిగ్రీ పూర్తి చేసిన వారు ఫారం 18 ను నింపి ఆన్ లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఆన్ లైన్‌లో www.ceotelangana.nic.in లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.





ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంఘ సభ్యులు సోమవారం శంభీపూర్ కార్యాలయంలో కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరగా.. వారు సానుకూలంగా స్పందించి.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

విద్యుత్‌లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించండి



● సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, పార్టీ శాఖ కార్యదర్శి ఎం.డీ జాకీర్ హుస్సేన్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గాజులరామారం డివిజన్ రోడా మేస్త్రి నగర్ - బి లో లోవోల్టేజ్ వేల పాలలేని కరెంటు కోతలను నివారించాలని సీపీఐ(ఎం) గాజులరామారం డివిజన్ ఆధ్వర్యంలో.. సోమవారం ఏఈ చైతన్యకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, పార్టీ శాఖ కార్యదర్శి ఎం.డి జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... గాజులరామారం డివిజన్ రోడా మేస్త్రి - బి లో చాలా రోజుల నుంచి 'లో వోల్టేజ్' తోటి ఫ్యాన్లు ఇంట్లో ఉన్న ఎలక్ట్రికల్ వస్తువులు పాడవుతున్నాయని.. వేలాపాలలేని కరెంటు కోతలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ సమస్య గురించి సంబంధిత అధికారులకు ఫోన్‌ల ద్వారా సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ఉచిత కరెంటు మీటర్ రీడింగ్‌లో అవకతవకలు జరుగుతున్నాయని.. మీటర్ రీడింగ్‌లో సమయపాలన పాటించకుండా ఏ టైం కంటే ఆ టైంకి సాయంత్రం ఏడు తర్వాత కూడా వస్తున్నారని తెలిపారు. రీడింగ్ విషయంలో కూడా సమయపాలన పాటించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో.. బస్తీ ప్రజలతో సంతకాల సేకరణ చేసి సోమవారం ఉషా ముల్లపూడి పక్కన ఉన్న కరెంట్ ఆఫీస్ దగ్గర ఏఈ చైతన్యకి వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించకపోతే రానున్న కాలంలో బస్తీ ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆరిఫ్ బాబా, ముక్తార్, నజీంషరీఫ్, షోయబ్, ఆసిఫ్, సాబీర్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక గ్యార్మి ఉత్సవాలు



● ఐ.ఎన్.టి.యు.సి.రాష్ట్ర కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మత సామరస్యానికి గ్యార్మీ ఉత్సవాలు నిదర్శమని ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ అన్నారు .సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, మగ్దూం నగర్ దర్గా వద్ద మైనార్టీ సోదరులు ఏర్పాటు చేసిన గ్యార్మి ఉత్సవాల్లో పాల్గొని.. ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కుల మతాలకు అతీతంగా జరుపుకునే పండుగ గ్యార్మి అని అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు ఎంఏ.హమీద్, కమిటీ సభ్యులు సాజిద్ ఖాన్, ఇన్నోస్, సులేమియా, నాయకులు బండి యాదగిరి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కమిటీ హల్ నిర్మాణం నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ సూచించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని, మహాత్మా గాంధీ నగర్ లో యాభై లక్షల రూపాయల నిధులతో, నూతనంగా నిర్మిస్తున్న కమిటీ హాల్ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కమిటీ హాల్ నిర్మాణం నాణ్యత ప్రమాణాలతో వీలైనంత త్వరగా పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీలో చిన్న చిన్న ఫంక్షన్లు జరుపుకోవడానికి, సమావేశాలు నిర్వహించుకోవడానికి కమిటీ హాల్ కాలనీ ప్రజలకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాండుగౌడ్, ప్రదీప్ రెడ్డి, షౌకత్ అలీ మున్నా వెంకట్ యాదవ్, ఇంద్రసేన రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పోశెట్టిగౌడ్, పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సదర్ సంబురాలు





నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ డివిజన్ అవంతి నగర్ ఈస్ట్ కాలనీలో, శశి యాదవ్ ఆహ్వానం మేరకు.. సదర్ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తిరుపతి,ధర్మయ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సదర్ సంబరాలతో తెలంగాణ పాడిపశువులకు మంచి గుర్తింపు లభిస్తుంది..

పశుసంపదతో పాటు వాటి సంరక్షణకై యాదవ సోదరులు ఎంతో కష్టపడుతారని వడ్డేపల్లి రాజేశ్వర రావు తెలిపారు. దీపావళి పండుగ అనంతరం తెలంగాణ లోని, యాదవ సోదరులు ఘనంగా జరిపే సదర్ సమ్మేళనంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు పాల్గొన్నారు. మూసాపేట్ డివిజన్ పరిధిలోని, అవంతి నగర్ ఈస్ట్ కాలనీలో శశి యాదవ్ ఆహ్వానం మేరకు, సదర్ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా వడ్డేపల్లి రాజేశ్వర్ రావు పాల్గొన్నారు. అవంతి నగర్ యాదవ సోదరులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావుకి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. దున్నపోతుల విన్యాసాలను వీక్షించిన అనంతరం వారు మాట్లాడుతూ ఈ సదర్ సంబరాలతో ప్రపంచవ్యాప్తంగా మన తెలంగాణ పాడిపశువులకు మంచి గుర్తింపు లభిస్తుందని తెలియజేశారు. సదర్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ అధ్యక్షుడు పిట్ల మనోహర్, రామ్ మోహన్, దుర్గ ప్రసాద్ రావు, చందు, స్థానిక బీజేపీ నాయకులు, యాదవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

రామాలయం వద్ద సదర్ ఉత్సవాలు..

కూకట్‌పల్లి యాదవ సంఘం ఆధ్వర్యంలో.. కూకట్‌పల్లి రామాలయం వద్ద 15 వసంతాల సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ సీనియర్ యువ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర రావులు హాజరై, సదర్ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ దీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తుందని ప్రకటించారు. యాదవ సోదర సోదరిమనులందరికి సదర్ ఉత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు.



సమగ్ర కుటుంబ సర్వే పారితోషికం ఎంత..?

● పారితోషికం నిర్ణయించి అధికారికంగా వెల్లడించాలి
● ప్రజావాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓకు ఆశాల వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వం ఆశా వర్కర్లను సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయాలని ఆదేశించిందనీ, ఈ సర్వేకు తాము సిద్ధంగా ఉన్నప్పటికీ అనేక రకాల ఇబ్బందులు చోటు చేసుకున్నాయని ఆశాలు తెలిపారు. ఈ సర్వే నిర్వహించినందుకు తమకు ఎంత పారితోషికం ఇస్తారని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్వర్వులు లేవనీ, తాము పనికి పారితోషకం ప్రాతిపదికన పని చేస్తామనీ, ఈ సర్వేకు పారితోషకం నిర్ణయించి అధికారికంగా వెల్లడించాలని ఆశాలు కోరారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ టి.రఘునాథస్వామికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆశాలు మాట్లాడుతూ ఈ సర్వేను ఆశాలు పనిచేసే ఏరియాల్లో మాత్రమే కేటాయించాలనీ, వేరే ఏరియాల్లో అయితే ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ఇప్పటికే అనేక రకాల సర్వేలు చేయిస్తున్న ప్రభుత్వం, పని భారం పెంచడం వల్ల ఆశా వర్కర్లు మానసిక ఒత్తిడికి గురవుతున్నారనీ, అనేక రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆరోగ్య సమస్యలున్న, వయసు రీత్యా ఇబ్బందులు పడుతున్న ఆశా కార్యకర్తలను వినహాయింపు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.రేవతికల్యాణి, జిల్లా నాయకులు వాసంతి, హేమలత, అనురాధ, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి



● మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు శివనగర్ 'ఏ' వాసులు విజ్ఞప్తి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మా ప్రాంతంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని జగద్గిరిగుట్ట డివిజన్ శివానగర్ 'ఏ' వాసులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంక్షేమ సంఘం సభ్యులతో పాటు, స్థానిక పెద్దలు గాజుల రామారంలోని చిత్తారమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల ఏవైనా వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరిస్తానని కమిటీకి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు సంతోష్ రెడ్డి, సీనియర్ నాయకులు కే.రత్నేశ్వరావు, వి.రామకృష్ణ, కోశాధికారి నాగరాజు, సంయుక్త కార్యదర్శి మున్నా, ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో...

అభివృద్ధి పనుల్లో జ్యాప్యం

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధి పనుల్లో జ్యాప్యం చేస్తున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలాజీ నగర్ డివిజన్ కె.పి.హెచ్.బి కాలనీ ధనలక్ష్మి సెంటర్ నేతాజీ పార్కు నందు అభివృద్ధి పనులు ఆగిపోయాయని పార్కులో పారిశుద్ధ్యం, ఎలక్ట్రిసిటీ, ఇంజనీరింగ్ పనులు పెండింగ్‌లో ఉండడంవల్ల అభివృద్ధి పనులు ఆగిపోయాయని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్థానికుల ఫిర్యాదులకు మేరకు సోమవారం మాజీ కార్పొరేటర్ బాబురావుతో కలిసి ఎమ్మెల్యే నేతాజీ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా నేతాజీ పార్క్ నందు పనుల్లో అధికారులు జాప్యం చేయడం వల్లనే పనులు జరగడంలేదన్నారు. వాకింగ్ చేసుకునే వారికి అనుకూలంగా వాకింగ్ ట్రాక్ సరిగా లేదనీ... ఎలక్ట్రిసిటీ వల్ల పార్కులో సరైన లైటింగ్ లేకపోవడం, గత కొన్ని నెలలుగా పారిశుధ్య కార్మికులు ఎక్కడి చెత్తను అక్కడే ఉంచి నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారన్నారు. అధికారులు నిర్లక్ష్య వైఖరికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులందరూ సమన్వయం చేసుకొని 15 రోజులలో పార్క్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు నేతాజీ పార్క్ అందుబాటులో ఉండే విధంగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, సతీష్ ఆరోరా, ప్రభాకర్ గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



నవతెలంగాణ-దుండిగల్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకబవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాలనీ సభ్యులు, సంఘ సభ్యులు వారి కార్యాలయంలో కలిసారు. తమ ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా.. సానుకూలంగా స్పందించారు. అనంతరం దుండిగల్ గ్రామ డబుల్ బెడ్‌రూమ్‌వాసులు వారి కాలనీలో మౌలిక సదుపాయాల ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కుల క్రిష్ణ యాదవ్, అమరం గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో సౌత్ వెస్ట్ కరాటే జట్లు ఎంపిక



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో పురుషులు, మహిళల కరాటే జట్లను సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎస్.ఎస్.దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో.. ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఎల్ఎన్‌సీటీ యూనివర్సిటీ బోపాల్ మధ్యప్రదేశ్ లో జరిగే సౌత్ వెస్ట్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని.. సెలక్షన్ ట్రయల్స్‌లో ఇంటర్నేషనల్ కోచ్ కీర్తన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్,ఇతర కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

సీహెచ్ రాములును సన్మానించిన బాలానగర్ సీఐ



నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజుకాలనీ నివాసి సీఐటీయూ నాయకుడు సిహెచ్ రాములు శోభన నుంచి రాజుకాలనీ వెళుతుండగా... తన ముందు టాటా ఏసీ వాహనం నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని ఢీ కొట్టింది. వెనుక ద్విచక్ర వాహనంపై వెళుతున్న రాములు ఢీ కొట్టిన వాహనాన్ని వెంబడించి యాక్సిడెంట్ చేసిన వ్యక్తిని పోలీసులకు అప్పగించారు. నడుచుకుంటూ వెళ్తున్న వ్యకినీ యాక్సిడెంట్ చేసి వెళ్తుంటే.. ఆ వాహనాన్ని బోయినపల్లి చౌరస్తాలో పట్టుకొని వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. ఆక్సిడెంట్ సమయంలో ప్రతి వ్యకి బాధ్యతతో మానవత్వాన్ని చాటాలని బాలానగర్ సీఐ నర్సింహా రాజు సీఐటీయూ రాములునీ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ ఎస్ఐ రామ్ నారాయణ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఐలాపురం రాజశేఖర్ పాల్గొన్నారు.

వనభోజనాలు ఐకమత్యానికి నిదర్శనం



● వై.ఎఫ్.సి.ఏ జంట నగరాల అధ్యక్షులు దంపనబోయిన శ్రీనివాస్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వన భోజనాలు ఐక్యతకు నిదర్శనమని వై.ఎఫ్.సి.ఏ జంట నగరాల అధ్యక్షులు దంపనబోయిన శ్రీనివాస్ అన్నారు. కార్తీక మాసం పురస్కరించుకొని బీహెచ్ఈఎల్ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్తీక మాస వనభోజన మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శెట్టిబలిజ కులస్తుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో స్థానిక శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యులతో పాటు,వై.ఎఫ్.సి.ఏ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కోటి దీపోత్సవం మహాద్భుతం



● మాజీ ఎమ్మెల్యే కూన

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కోటి దీపోత్సవం మహా అద్భుతమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కార్తీక మాసం సందర్భంగా గాజులరామారం లో ఏర్పాటుచేసిన కోటి దీపోత్సవ కార్యక్రమానికి సోమవారం ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇటువంటి గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. యాంత్రిక జీవనానికి అలవాటు పడిన ప్రజలు ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత పొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తారమ్మ ఆలయ చైర్మెన్ కూన అంతయ్య గౌడ్, కేకేఎం ట్రస్ట్ చైర్మెన్ కూన శ్రీనివాస్ గౌడ్, ఇంద్రసేనా రెడ్డి, అంజిరెడ్డి, బాలరాజు, కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, నాయకులు ఆహ్వాన పండితులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుని, మూసపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ కలిశారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కార్తీక మాస పూజలో తూము



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కార్తీక సోమవారం సందర్భంగా.. మూసాపేట్‌లోని శ్రీ సిద్ధి లింగేశ్వర స్వామి దేవాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రో.సూర్య ధనుంజయ్‌కు సత్కారం



నవతెలంగాణ-ఓయూ

నూతనంగా (చిట్యాల)చాకలి ఐలమ్మ యూనివర్సిటీ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ సూర్య దనుంజయ్‌కు సోమవారం ఓయూ ఎస్సీ, ఎస్టీ నాన్ టీచింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బోయ కుమార్ ఆధ్వర్యంలో సూర్య ధనుంజయన్‌ను ఘనంగా సత్కరించారు. ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండే ఔన్నత్యం గల వ్యక్తి అని ఆమె నాయకత్వంలో ఐలమ్మ విశ్వవిద్యాలయం ఔన్నత్యం పెంపొందించ బడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్. జుమ్లాల్ పాల్గొన్నారు.

రెండు విడతల సర్వేపై సమావేశం



నవతెలంగాణ-బంజారా హిల్స్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సర్వేలో రెండు విడతలు సర్వేలు కొనసాగుతాయని ఇందులో శిక్షణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా సంఘాల నాయకురాలు, ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు విడతలు వారిగా సర్వే ట్రైనింగ్ అవగాహన కార్యక్రమన్ని సోమవారం అమీర్‌పేట్ స్పోర్ట్స్ గ్రౌండ్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు, మహిళలకు, సంఘాల నాయకురాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరో తేదీ సమావేశం ఏర్పాటు చేసి ఎవరు ఏ సమయంలో పాల్గొన్నాలో సదస్సులో తెలిపారు. ఈ సమావేశంలో మాస్టర్ ట్రైనర్స్ భాస్కర్, ఏ ఈ గురు, ఏఎంసీ కైలాష్, పిఓ శ్రీనివాస్, శానిటైజరీ జవాన్స్ హరి రామ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గంలో పలు వార్డులకు చెందిన 43 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే శ్రీ గణేష్ పంపిణీ చేశారు. రెండో వార్డు గన్ బజార్ కమ్యూనిటీ హాల్ లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పాలకులు రాష్ట్ర ఖజానాను లూటీ చేసి రాష్ట్రంలో అవినీతిని పెంచి పోషించి అక్రమణదారులకు రాష్ట్రాన్ని అడ్డగా మార్చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో నరేష్, శ్యామ్ సన్ రాజు, రఫిక్, యూసఫ్ భాను, ఇస్మాయిల్, మంగలి యాదగిరి, చైర్మన్ యాదగిరి, కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన డెడికేషన్ కమిటీని స్వాగతిస్తున్నాం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్



నవతెలంగాణ-ఓయూ

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి డెడికేషన్ కమిటీ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా హైకోర్టు ఆదేశాల ప్రకారం బీసీ డెడికేషన్ కమిటీ ఏర్పాటు చేయడం నిజంగా బీసీల పట్ల చిత్తశుద్ధిని మరొకసారి కాంగ్రెస్ ప్రభుత్వం నిరూపించుకుందన్నారు. నవంబర్ 6 నుంచి జరిగే సమగ్ర కుల గణన సర్వేలో బీసీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జాజుల బీసీ సమాజానికి పిలుపునిచ్చారు.

అవాస్తవపు కథనాలను ఖండిస్తున్నాం

- న్యాయవాది ఇంద్రగంటి మధు శర్మ



నవతెలంగాణ-బంజారా హిల్స్

నాదర్‌గుల్ భూ కథనాలు వరసగా కొన్ని రోజులుగా ఓ దినపత్రికలో ప్రచురించడం సమంజసం కాదని, ఈ అవాస్తవపు కథనాలను పూర్తిగా ఖండిస్తున్నామని ప్రవీణ్ రెడ్డి తరపున వాదించే న్యాయవాది ఇంద్రగంటి మధు శర్మ అన్నారు. వాస్తవాలను తెలియజేస్తూ పూర్తి ఆధారాలతో ప్రచూరిస్తే స్వాగతిస్తామన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా ఓ దినపత్రికలో ప్రచురిస్తున్న కథనాలు పూర్తి అవాస్తవమన్నారు. అదే దినపత్రికలో 12 గంటల్లోపు క్షమాపణ కోరుతూ ప్రచూరించాలని, లేని పక్షంలో రూ. 10 కోట్ల దావా వేస్తామని హెచ్చరించారు.

ఓయూ యూజీసీ డీన్‌గా ప్రో.బి.లావణ్య



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం డీన్ డెవలప్మెంట్ అండ్ యూజీసీ అఫైర్స్‌గా ఓయూ ఆర్ట్స్ కళాశాల చరిత్ర శాఖ అధిపతి ప్రో. బి.లావణ్య నియమితులయ్యారు. సోమవారం రాత్రి ఆమె ఓయూ వీసీ ప్రో.కుమార్ చేతుల మీదుగా నియమక పత్రం స్వీకరించారు. ఆమె గతంలో జనరల్ వార్డెన్‌గా, మెస్ వార్డెన్‌గా, అడిషినల్ చీఫ్ వార్డెన్‌గా, లేడీస్ హాస్టల్ డైరెక్టర్‌గా, యూజీసీ-ఎచ్ఆర్‌డీసీ అసోసియేట్ డైరెక్టర్‌గా, డీన్ కాలేజ్ డెవలప్మెంట్, నిజాం కాలేజ్ చరిత్ర విభాగం ఇంఛార్జ్ హెడ్, ఓయూ ఆర్ట్స్ కళాశాల చరిత్ర విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, వివిధ హెూదాల్లో విజయవంతంగా సేవాలు అందజేశారు. ఓయూ ఔట ఉపాదక్షురాలుగా రెండు పర్యాయాలు భారీ మెజారిటీతో గెలుపొందారు. టీఎస్ పూట ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా చేశారు. ఆమె ఐదు ప్రాజెక్టులు పూర్తి చేసి, 40 ఆర్టికల్స్, రెండు పుస్తకాలు రాశారు. ఏడు దేశాల్లో పర్యటన చేసి పలు సెమినర్స్, సదస్సులో ప్రసంగించారు. పలువురు ప్రొపెసర్స్, విద్యార్థులు ప్రో.లావణ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు.



కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని, రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివునికి అభిషేకం నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. విజయ రెడ్డి. అనంతరం మంగళవారం మూడు గంటలకు ఖైరతాబాద్‌లోని కార్యాలయం వద్దకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీ రాహుల్ గాంధీ విచ్చేస్తున్న సందర్భంగా పార్టీ శ్రేణులందరూ పెద్ద సంఖ్యలో హాజరుకావాలని అమె కోరారు.

నవతెలంగాణ-బంజారా హిల్స్

గుంతలు పూడ్చడం మరిచితిరి..!

- ప్రమాదకరంగా మ్యాన్ హెూల్స్..
- మరమ్మతులు ఎన్నడు ?
- ఇబ్బందుల్లో స్థానికులు..



నవతెలంగాణ-ఓయూ

అది నిత్యం వేలాదిమంది వాహనదారులు ప్రయాణిస్తున్న ప్రధాన రహదారి. అధికారులు అలసత్వంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న దుస్థితి. పూర్తి వివరాల్లోకి వెళితే తార్నాక డివిజన్ పరిధిలోని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్ర రావు నివాసానికి సమీపంలో స్ట్రీట్ నెంబర్ 19లో సంవత్సరం క్రితం ప్రధాన రహదారి మధ్య నుంచి తవ్వి వాటర్ పైపు లైన్ నిర్మించారు. అంతవరకు అలా తవ్విన ప్రధాన రహదారిని నామమాత్రంగా పూడ్చి వేయడంతో రహదారిలో గుంతలు గుంతలు ఏర్పడ్డాయి. స్థానికులు ఈ విషయం పలుమార్లు ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా నేటి వరకు అలా పడ్డ గుంతలు పూడ్చక పోవడంతో స్థానికులు మరింతగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడే మ్యాన్ హెూల్ కూడా ప్రమాదంకరగా ఉండడంతో సిబ్బంది అక్కడ మ్యాన్ హెూల్ చుట్టూ రాళ్లు పెట్టారు. అసలే వర్షాలు పడుతుండడం.. ఆపై రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు, మ్యాన్ హెూల్ ప్రమాదకరంగా ఉండటంతో వాహనాదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు అలసత్వం ధోరణి విడనాడి తక్షణమే రహదారిపై ఉన్న గుంతలు పూడ్చివేసి, ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హెూల్ మరమ్మతులు చేపట్టాలని అధికారులను స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. ఇలా తార్నాక డివిజన్ పరిధిలోని పలుచోట్ల వాటర్ పైపు లైన్స్ నిర్మాణం చేసి గుంతలు పూడ్చడం విస్మరించినట్టు స్థానికులు వాపోతున్నారు. ఇక స్ట్రీట్ నెంబర్ 10 లోని నల్ల పోచమ్మ దుర్గ మాత ఆలయం ఎదురుగా ఉన్న రహదారిపై కూడా మ్యాన్ హెూల్స్ కిందకు పోయి ప్రమాదం పొంచి ఉందని రోడ్డు లెవల్లో మ్యాన్ హెూల్‌ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ రూట్‌లో శ్రీ చైతన్య ఇంటర్ కాలేజ్‌తో పాటుగా, బచ్‌పన్ స్కూల్ కూడా ఉండటంతో స్థానికులు, పేరెంట్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అంటున్నారు. ఇదిలా ఉండగా లాలాపేట్ ప్రధాన రహదారి వెంట మంజరి నర్సింగ్ హెూమ్ ఎదుట గత కొన్ని రోజులుగా డ్రయినేజీ మ్యాన్ హెూల్ పొంగి ప్రధాన రహదారిపై మురుగు నీరు పొంగిపొర్లుతూ దుర్వాసన సమస్యతో అటు స్థానికులు ఇటు వాహదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లాలాగూడా జలమండలి అధికారులు డ్రయినేజీ వ్యవస్థకు వెంటనే మరమ్మతులు చేపట్టలని లాలాపేట్ వాసులు కోరుతున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నగరం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి మేయర్ జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి విజ్ఞప్తులను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఆయా అధికారులకు సమస్యల పరిష్కారానికి ఆదేశించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఆయా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా సమస్యను పరిష్కరించి సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలన్నారు. పరిష్కారం కానట్లయితే అందుకు గల కారణాలు తెలుపుతూ లిఖిత పూర్వకంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 35 విన్నపాలురాగా అందులో అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి 19 ఫిర్యాదులు రాగా, ఈ.ఎస్.సీ విభాగానికి 3, ట్యాక్స్ సెక్షన్, యూ.బీ.డీ, శానిటేషన్ విభాగాలకు 2 చొప్పున, సి.ఎం అండ్ హెచ్.ఓ, ఎలక్ట్రికల్, ఎల్.డబ్ల్యు.ఎస్, వెటర్నరీ, హెచ్.ఎం.డబ్ల్యు. ఎస్.ఎస్.బి, ఎల్.ఏ.ఓ, ఐటీ విభాగాలకు ఒకొక్కటి చొప్పున విన్నపాలు వచ్చాయని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 80 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్‌లో 42, శేరిలింగంపల్లి జోన్‌లో 13, సికింద్రాబాద్ జోన్‌లో 9, ఎల్బీనగర్ జోన్‌లో 11, చార్మినార్ జోన్‌లో 5 ఫిర్యాదులు అందగా ఖైరతాబాద్ జోన్‌లో ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, రఘు ప్రసాద్, నళిని పద్మావతి, సత్యనారాయణ, యాదగిరి రావు, గీత రాధిక, పంకజ, సరోజ, యూబీడీ డైరెక్టర్ శ్రీనివాస్, అడిషనల్ సీసీపీ గంగాధర్, ఏసీపీ సుదర్శన్, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్, జేసి వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాల జనాభాను తక్కువ చూపిస్తే చర్యలు తప్పవు

- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో ప్రభుత్వం అన్ని కులాల జనాభా లెక్కల్లో మాలలను తక్కువగా చూపించే కుట్ర జరుగుతున్నదని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మాలలకు ఎలాంటి కుల వృత్తులు లేని కారణంగా నీరటి, బ్యాగారి, తలారి, పంబాల, సలవాడి, నేతకాని ఇలా ఏ పని దొరికితే ఆ పని చేస్తూ జీవితం గడిపేవారన్నారు. వారంతా మాలలే కానీ నేడు మాల అని రాయకుండా వారి వృత్తుల పేర్లతో కులగణన చేసి మాల జనాభాను తక్కువగా చెప్పే ప్రయత్నం పాలకులు చేస్తున్నారని.. ఇది సమంజసం కాదన్నారు. దయచేసి మాలలు గతంలో చేసిన పనుల ఆధారంగా జనాభా లెక్కల్లో రాయించుకోవద్దని మాల కులస్తులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఓయూ వీసీకి, ఓఎస్డీకి సత్కారం



నవతెలంగాణ-ఓయూ

ఓయూ నూతన వీసీ ప్రో.ఎం.కుమార్, ఓఎస్డీ ప్రో.జీతేందర్ నాయక్‌లను సోమవారం డాక్టర్ ప్రేమ్ కుమార్ మర్యాదపూర్వకంగ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరి ఇరువురి ఆధ్వర్యంలో ఓయూ ప్రగతి పథంలో ముందుకు సాగాలని కోరారు. ఆక్రమణ గురైన అజ్ భూములను కాపాడాలని, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు వెయ్యాలని, యునివర్సిటీలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చెయ్యాలని కోరారు. పరిపాలనలో పారదర్శకంగా పనిచేస్తూ యునివర్సిటీ అభివద్ధికి పాటుపడాలని, యునివర్సిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని, ఔట్ సోర్సింగ్ వర్కర్ల వేతనాలు పెంచాలని, పార్ట్ టైం టీచర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని వీసీని ఈ సందర్భంగా కోరుతున్నట్టు తెలిపారు.

డి-అడిక్షన్ సెంటర్ ప్రారంభానికి స్థల పరిశీలన



- అర్చరీ క్రీడలో పాల్గొన్న బాలలను అభినందించిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పిల్లలు నేరాలకు, వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండేందుకు సత్ప్రవర్తనతో, సమాజంలో మంచి వ్యక్తులుగా ఎదిగేలా వారి ఉజ్వల భవిష్యత్ కోసం సైదాబాద్ ప్రభుత్వ బాలుర చిల్డ్రన్స్ హెూమ్‌లో డి-అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభించేందుకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చిల్డ్రన్స్ హెూమ్ పరిసరాలను పరిశీలించారు. సోమవారం సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలుర చిల్డ్రన్స్ హెూంను సందర్శించి డి-అడిక్షన్ కేంద్రాన్ని ప్రారంభించేందుకు పలు భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డ్రగ్స్ మహమ్మారి వలన కలిగే నష్టాలపై ప్రజలలో అవగాహన కల్పిస్తూ.. నివారణకు జిల్లాలో పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. డి- అడిక్షన్ సెంటర్‌లో కావలసిన డాక్టర్, కౌన్సిలర్, ఇతర సిబ్బంది గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ బాలుర హెూంను, బాలుర పర్యవేక్షణ కేంద్రాన్ని సందర్శించి అందులో ఉన్న పిల్లల స్థితిగతుల వివరాలతో పాటు, పిల్లల వసతి, వారికి అందించే ఆహారం, ప్రైమరీ పాఠశాల, వంటగదితో పాటు కార్యాలయాన్ని పరిశీలించారు. అనాథ, ఆపదలో ఉన్న పిల్లల భద్రత మనందరి బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. ఆ పిల్లలకు మెరుగైన విద్యనందించాలని సూచించారు. వ్యాధుల బారిన పడకుండా నిరంతరం మంచి చికిత్స అందించాలన్నారు. ప్రైమరీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందించే బోధన తీరును పరిశీలించారు. అనంతరం అర్చరీ క్రీడా మైదానం పరిశీలించి.. అర్చరీలో రాష్ట్ర స్థాయికి ఎదిగిన పిల్లలతో మాట్లాడారు. అర్చరీ ఆట తీరును పరిశీలించారు. దేశ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ.. క్రీడాసామాగ్రికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ప్రభుత్వ చిల్డ్రన్ హెూమ్‌లోని, వంటశాలను, డార్మెట్ హాల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీడీ మీర్జా రాజ అలీ బేగ్, ఏడీ అబ్జల్, ఐసీడీఎస్ ఏడీ రాజేందర్, ఆర్డీవో రామకృష్ణ, తహశీల్దార్ జయశ్రీ, పర్యవేక్షకులు సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలకు భద్రత కరువు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా శ్మశానవాటికలు



నవతెలంగాణ-బంజారా హిల్స్

బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 13 శ్మశాన వాటిక ఓ ప్రత్యేకగా పేరుగాంచింది మంత్రుల నివాసానికి కూత వేటు దూరంలో ఉన్న ఈ శ్మశాన వాటిక మీదుగనే ప్రతిరోజు మంత్రులు ప్రయాణిస్తూ ఉంటారు. ప్రముఖులు, సామాన్యుల దహన సంస్కారాలు జరిగే ఈ శ్మశాన వాటికలో భద్రత కరువైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. సరైన సెక్యూరిటీ వ్యవస్థ లేకపోవడంతో రాత్రి వేళలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందంటున్నారు. మందుబాబులు శ్మశాన వాటికను వదలకుండా మద్యం సేవిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం గాని, నిర్వాహణ బాధ్యతలు చూసేవారు కానీ పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరైన భద్రత లేని కారణంగానే ఇటీవల యువకుడు ఒంటిపై నిప్పు పట్టించుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో ఇక్కడి డొల్లతనం వెలుగు చూసింది. ప్రభు త్వం గతంలో వీటి అభివృద్ధి కోసం లక్షలాది రూపాలు వెచ్చించింది. తాజాగా ప్రకటనల రూపంలో సైతం జీహెచ్ఎంసీ లక్షల రూపా యలు సమకూడుతున్నాయని కమిటీ సభ్యులే ఆరోపిస్తున్నారు.



ప్రతి ఏటా దీపావళి పండగ రాగానే శ్మశాన వాటికల అభివృద్ధికి హడావుడిని తప్ప చేసింది ఏమీ లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం కానీ జీహెచ్ఎంసీ కానీ చేసింది ఏమిటో తెలియడం లేదని పలువురు అంటున్నారు. ఈ శ్మశాన వాటికల భద్రత ఇతరత్రా విధులు కొనసాగించడానికి కమిటీలు ఎన్నికలు లేదా పోస్టులు ఎందుకో తెలియడం లేదని కరోనా సమయంలో కడసారి చూపు చూడనివ్వకుండా రోజుల తరబడి తమ కుటుంబీకుల శవాలు రహదారులపైనే ఉంచారని ఆ రోజులు గుర్తుకు వస్తే నిద్రాహారాలు లేకుండా గడిపిన సమయం ఇంకా గుర్తుందనీ ప్రజలు వారి అభిప్రాయాలను వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఓ నిర్దిష్టమైన నిర్ణయాన్ని తీసుకొని శ్మశాన వాటికల పరిరక్షణకు ప్రత్యేక అధికారిని నియమిస్తూ వాటి బాగోగులు చూసుకునేలా ఓ ప్రక్రియ విడుదల చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ శ్మశాన వాటికల్లో జరిగే అసాంఘిక కార్యకలపాలకు చోటు లేకుండా కఠినమైన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సిబ్బందికి సూచించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

లిటిల్ ఫ్లవర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ క్రికెట్ టోర్నమెంట్..



- విజేతలకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-ఓయూ

ఓల్డ్ అల్వాల్‌లోనిలిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం "లిటిల్ ఫ్లవర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ క్రికెట్ టోర్న మెంట్" పోటీలను ఘనంగా నిర్వహించారు. లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల ఓల్డ్ ఆల్వాల్, టెంపుల్ ఆల్వాల్, వెంకటాపురం శాఖలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముందుగా విద్యాసంస్థల డైరెక్టర్ కె. శరత్ చంద్ర భార్గవ్ జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు 'మార్చ్ ఫాస్ట్'తో ఆకట్టుకున్నారు. విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ కె. సదానంద్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ. క్రీడలు మానసిక ఆనందానికి, శారీరక దఢత్వానికి దోహదపడతాయని, క్రీడల వలన విద్యార్థులకు పోటీ తత్వం అలవడుతుందని, అలాగే విద్యార్థులు తమ క్రీడా నైపుణ్యం దాటడానికి ఇది ఒక మంచి వేదికని తెలియజేశారు. తమ విద్యాసంస్థలు పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు క్రీడల పైన ఆసక్తిని, ఆశక్తిని పెంపొందించడం కోసం క్రీడలలో శిక్షణ ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థల వారు నిర్వహించే ఆటల పోటీలకు తమ విద్యార్థులను పంపిస్తున్నామని, వారు జిల్లా, మండల స్థాయి పోటీలలో ఎన్నికవుతున్నారని చెప్పి వారిని అభినందించారు. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థి తన నైపుణ్యాన్ని చాటుతూ తమ జట్టు విజయం కోసం పోటా పోటీగా పాల్గొన్నారు. ఈ పోటీలో మొదటి, రెండో, మూడో స్థానాలలో నిలిచిన విద్యార్థులకు ట్రోఫీలు బహుకరించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శివిలిరాయ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మిస్టర్ రవీంద్ర రెడ్డి, ఉపాధ్యాయులు, క్రీడా శిక్షణ ఉపాధ్యాయులు మిస్టర్ ప్రకాష్, కుమారి స్పందన, విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది.



సీనియర్ సిటిజన్స్ వారి సమస్యలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు..

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని వయోవృద్ధులు తమ ఆస్తి, మెయింటెనెన్స్‌కు సంబంధించిన సమస్యలను వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సీని యర్ సిటిజన్స్ తమ ఆస్తి, మెయింటెనెన్స్ సమస్యలకు సంబంధించిన కేసుల నమోదుకు వెబ్‌సైట్ gseniorcitizens. cgg. gov.inలో ఆన్‌లైన్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

సాంకేతిక లోపం.. మెట్రో సేవలకు అంతరాయం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రో రైలు సేవల్లో అంతరాయం ఏర్పడింది. సాంకేతిక సమస్య తలెత్తడంతో ఆకస్మాత్తుగా బేగంపేట్-అమీర్‌పేట్ మార్గంలో 16 నిమిషాల పాటు మెట్రో సేవలు నిలిచిపోయాయి. దీంతో పాటు ఎల్బీనగర్-మియాపూర్ రూట్‌లో మెట్రో రైళ్ల రాకపోకలకు ఆటంకం కలిగింది. సాంకేతిక సమస్య కారణంగా రెండు కారిడార్లు నాగోల్- రాయదుర్గం, ఎల్బీనగర్- మియాపూర్ కారిడార్లలో రైళ్లు 15 నిమిషాల పాటు ఒక్కసారిగా నిలిచిపోవడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. సోమవారం తోడు.. ఉదయం కార్యాలయాలకు వెళ్లే సమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో ఈ విధంగా సాంకేతిక లోపంతో మెట్రో సేవలకు అంతరాయం కలగడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు మెట్రో సిబ్బంది ఎక్కువ సమయం తీసుకుంటున్నారని పలువురు ప్యాసింజర్స్ ఆరోపించారు. సాంకేతిక సమస్య తలెత్తడంతో నిలిచిపోయిన మెట్రో రైళ్ల రాకపోకలను నిమిషాల వ్యవధిలోనే పునరుద్ధరించామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'డబుల్' ఇండ్ల పట్టాలు సిద్ధం చేయండి

- విధులపట్ల నిర్లక్ష్యం వద్దు: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని రెండు పడకల గదుల ఇండ్లతో పాటు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను రెవెన్యూ అంశాల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ల వారీగా రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు పడకల ఇండ్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సికింద్రాబాద్ పరిధిలోని జామున నగర్, తార్నాకలలో అర్హులైన పేదలకు ఇండ్లు అందించే దిశగా ఇండ్ల పట్టాలను సిద్ధం చేసి అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అవసరమైన నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు సత్వరమే అందించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దని, నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం మండలాల వారీగా సంబంధిత తహసీల్దార్‌లతో పెండింగ్ రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ముకుంద రెడ్డి, డీఆర్వో వెంకటాచారి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరామ్, తాసీల్దార్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలి

- జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలి : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రజావాణికి 255 దరఖాస్తులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని, ముకుందరెడ్డిలతో కలసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఆ దిశగా జిల్లా అధికారులు వచ్చిన అర్జీలను వెంటనే పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రజావాణిలో 255 దరఖాస్తులు రాగా.. గృహ నిర్మాణ శాఖవి 208, పెన్షన్లు 15, జిల్లా ఉపాధి కల్పనాధికారి 5, డీఈవో 4, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ 2, జిల్లా బీసీ వెల్ఫేర్ 2, ఇతరములు 19 దరఖాస్తులు వచ్చినవని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వెంకటచారి, ఆర్డీవో రామకృష్ణ, జిల్లా అధికారులు జి. ఆశన్న, పవన్ కుమార్, డాక్టర్ సురేందర్, ఇలియాజ్ అహ్మద్, ఒడ్డెన్న, ఆర్.రోహిణి, షఫీమియా తదితరులు పాల్గొన్నారు.

దిశ సమావేశానికి సంసిద్ధంగా ఉండాలి

ఈ నెల 8న నిర్వహించనున్న దిశ సమావేశానికి జిల్లా అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న పలు కార్యక్రమాలకు సంబందించిన నివేదికలతో మీటింగ్‌కు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులకు ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా డెవలప్‌మెంట్ కో-ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(దిశా) సమావేశం బేగంపేట్ హెూటల్ ది ప్లాజా(తెలంగాణ టూరిజం) గ్రీన్ ల్యాండ్స్‌లో 8వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని, అధికారులు తమ నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

నూతన వీసీలకు ఘన సన్మానం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) హైదరాబాదు యూనివర్సిటీ కాలేజీలోని సీఆర్పీ సెమినార్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నియమితులైన నూతన వైస్-చాన్సలర్లను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనివర్సిటీ రెక్టర్ డా కె.విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డా కె. వెంకటేశ్వర రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైస్-చాన్సలర్లు డాక్టర్ ఎ.గోవర్ధన్, డాక్టర్ జి.ఎన్.శ్రీనివాస్ లు విభిన్న పరిపాలనా అనుభవం ఉందని, వారు తమ నూతన బాధ్యతల్లో కూడా విశేష కృషి చేస్తారన్నారు. వారి నాయకత్వం జేఎన్‌టీయూ యూనివర్సిటీకి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తెస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ డా కె. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. జేఎన్‌టీయూ యూనివర్సిటీ నుండి ఇద్దరు ప్రొఫెసర్లు వైస్-చాన్సలర్లుగా ఎంపిక కావడం గర్వకారణమన్నారు. విశ్వవిద్యాలయంలో నిర్వర్తించిన బాధ్యతలను ప్రశంసించారు. డాక్టర్ జి.ఎన్. శ్రీనివాస్ జేఎన్టీయూ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తూ, ప్రస్తుతం పాలమూరు విశ్వవిద్యాలయానికి వైస్-చాన్సలర్‌గా నియమితులయ్యారన్నారు. డాక్టర్ ఎ.గోవర్ధన్ జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం ఆర్జీయుకెటీ (బాసర)కు ఇన్‌చార్జ్ వైస్-చాన్సలర్ బాధ్యతలు చేపట్టారన్నారు. డాక్టర్ ఎ. గోవర్ధన్ మాట్లాడుతూ జేఎన్‌టీయూ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగంలో విభాగాధిపతి, ప్రిన్సిపాల్, డైరెక్టర్ ఆఫ్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్స్, రెక్టర్ , గవర్నమెంట్ నియమించిన ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్‌గా అనుభవం ఉందని, ఈ అనుభవాన్ని ఆర్జీయుకెటీ (బాసర) అభివృద్ధికి ఉపయోగిస్తానని తెలిపారు. డాక్టర్ జీ.ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో విభాగాధిపతి, ప్రాజెక్ట్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, అదనపు ఎగ్జామినేషన్స్ కంట్రోల్లర్, జేఎన్టీయూ సుల్తాన్పూర్ , సిరిసిల్ల కాలేజీల ప్రిన్సిపాల్‌గా అనుభవం ఉన్న తనకు పాలమూరు విశ్వవిద్యాలయాన్ని బాగా అభివృద్ధి చేసే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, టైమ్‌స్కేల్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు హాజరై పుష్పగుచ్చాలు అందించి శాలువాలు కప్పి సన్మానించారు. చివరగా, కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డా వి.పద్మావతి వందన సమర్పణతో కార్యక్రమాన్ని ముగించారు.

మ్యాన్ హెూల్‌లో పేరుకుపోయిన

చెత్త, చెదారాన్ని తొలగించాలి..



- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీ హెచ్‌బీ

మ్యాన్ హెూల్‌లో పేరుకుపోయిన చెత్త చెదారంను తీసి వేసి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులో తలెత్తిన డ్రయినేజీ సమస్యను సివరేజ్ బోర్డ్ అధికారులతో, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిజాంపేట్ రోడ్డులో డ్రయినేజీ సమస్య ఉందని తెలిసినా వెంటనే వెళ్లి.. పరిశీలించడం జరిగిందన్నారు. డ్రయినేజీ సమస్యను పరిష్కరించడానికి బకెట్ క్లినింగ్ చేపట్టా లన్నారు. మ్యాన్ హెూల్ నుంచి ప్రతి మ్యాన్ హెూల్ వరకు బకెట్ క్లినింగ్ ద్వారా మ్యాన్ హెూల్‌లో పేరుకుపోయిన పూడికను తీయాలన్నారు. డ్రయినేజీ నీరు ప్రవాహం సాఫీగా సాగేలా చూడలని, ప్రతి మ్యాన్ హెూల్ వద్ద పూడిక తీత తీయాలన్నారు. ఎక్కడ డ్రయినేజీ సమస్యాత్మక ప్రాంతంగా నిత్యం పొంగే ప్రదేశాలలో, కాలనీ లలో ప్రథమ ప్రాధాన్యతగా పాత లైన్లు మార్చి కొత్త లైన్లను కలపాలని బకెట్ క్లినింగ్ పెట్టి సమస్యను పరిష్కరించాలన్నారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడే పరిష్కారం చేయాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని సివరేజ్ బోర్డు అధికారులకు తెలియ జేశారు. ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా నా దృష్టికి గాని కార్పొరేటర్ కార్యాలయం దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు డ్రయినేజీ సూపర్‌వైజర్ ఓం ప్రకాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు నిరంజన్ గౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
మంగళవారం | నవంబర్ 05, 2024 | www.navatelangana.com

నేటి నుంచి అమరవీరుల వర్ధంతి సభలు



నవతెలంగాణ-ముషీరాబాద్

పీడీఎస్‌యు గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గం ఆధ్వర్యంలో విద్యానగర్ లోని ఎస్.వీ.ఈ.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమరవీరుల వర్ధంతి సభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమా న్ని ఉద్దేశించి పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మంద నవీన్ మాట్లాడుతూ విప్లవ విద్యార్థి అమరవీరులను స్మరిస్తూ నవంబర్ 5(నేటి) నుండి 11 వరకు అమరవీరుల వర్ధంతి సభలను నిర్వహించాలని అన్నారు. నేడు దేశంలో ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు ఏ విధంగా అయితే ప్రశ్నించే గొంతులను, స్వేచ్ఛను కోరే విద్యార్థులను నిర్బంధించి నియంతృత్వాన్ని కొనసాగించాయో అదే తరహాలో నేడు బీజేపీ ప్రభుత్వం మతోన్మాద ఫాసిస్టు భావజాలంతో ప్రశ్నించే గొంతులను, స్వేచ్ఛను కోరే విద్యార్థులపై తప్పుడు కేసులు పెట్టి జైల్‌లో బంధిస్తున్నదన్నారు. పీడీఎస్‌యు నాయకురాలు కే.ఝాన్సీ, యశ్వంత్, సంతోష్, రాము, రమేష్, నితిన్, వెంకట్, అశ్విని, సుజాత, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

మల్టీటౌన్ ఎయిర్ హారన్లపై స్పెషల్ డ్రైవ్

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



సుల్తాన్ బజార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫోర్‌వీలర్ వాహనాలకు అత్యవసర సమయాల్లో ఉపయోగించే మల్టీటోన్ హారన్, ఎయిర్ హారన్, సైరన్లను దుర్వినియోగం చేస్తూ వ్యక్తిగత వాహనాలకు ఉపయోగిస్తూ శబ్ద కాలుష్యం సృష్టిస్తున్న వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని సుల్తాన్ బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రాంబాబు తెలిపారు. సోమవారం సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోఠి ప్రభుత్వ ఈఎన్‌టీ ప్రధాన రహదారిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో పలు ఫోర్ వీలర్ వాహనాలకు ఉన్న మల్టీటౌన్ హారన్‌లను స్వాధీనం చేసుకొని సీజ్ చేసి చాలాన్ విధించామని ఆయన తెలిపారు.

నగరంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

- పీసీసీ మాజీ అధ్యక్షులు వీహెచ్ హనుమంతరావు

నవతెలంగాణ-అంబర్‌పేట



ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం సందర్భంగా మాజీ పీసీసీ అధ్యక్షులు మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్ హనుమంతరావుని కలిసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, పీసీసీ కార్యదర్శిలకు పాతి యాదగిరి గౌడ్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు గడ్డం శ్రీధర్ గౌడ్, శ్రీమంతుగిరి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు బల్దియా సిద్ధం

- 18వేల మంది ఎన్యుమరేటర్లు
- 1800 మంది సూపర్‌వైజర్లు
- పొరపాట్లు లేకుండా సర్వే నిర్వహణకు అవగాహన





నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 6 నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు బల్దియా సిద్ధమైంది. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల తదితర అంశాలతో నిర్వహించే సర్వే లో ఎలాంటి పొరపాట్లకూ తావివ్వకుండా ఉన్నతాధికారులు అన్ని చర్యలూ తీసుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల మంది ఎన్యుమరేటర్స్, 1800 మంది సూపర్‌వైజర్లను నియమించారు. జీహెచ్ ఎంసీ వ్యాప్తంగా దాదాపు 30లక్షలకుపైగా ఇండ్లు న్నాయి. ఒక్కో ఎన్యుమరేటర్ కనీసం 150 ఇండ్లను సర్వే చేయాల్సింటుంది. ఈ నెల 6 నుంచి 21 వరకు హౌజ్ టూ హౌస్ సర్వే చేస్తారు. సర్వే పూర్తి కాగానే ప్రతి ఇంటికీ స్టిక్కర్ వేస్తారు. ఏరోజుకు ఆరోజు సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తారు. ఏవైనా సందేహాలు ఉంటే ఎన్యుమరేటర్లు ఎప్పటికప్పుడూ సంబంధిత సూపర్‌వైజర్లను సంప్ర దించి నివృత్తి చేసుకోవాలని బల్దియా అధికారులు తెలిపారు. సూపర్‌వైజర్లు ఎన్యుమరేటర్ల పనితీరును పర్యవేక్షించడంతో పాటు సర్వే ప్రక్రియలో అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్లు హౌస్ హోల్డ్స్ షెడ్యూల్ సర్వే ఫారం, హౌస్ లిస్టింగ్ ఫారం, ఎన్యుమరేటర్ మార్గదర్శకాలు, స్టిక్కర్ తదితర వివరాలను సూపర్‌వైజర్లకు ఉన్నతాధికారులు వివరించారు. సర్వే నిర్వహణ, ఫారం నింపే విధానం ఇతర ముఖ్య వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలు, వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

వంద శాతం ఖచ్చితత్వంతో సమగ్ర సర్వే

వంద శాతం ఖచ్చితత్వంతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమర్థవంతంగా చేపట్టాలని అంబర్‌పేట్ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ అన్నారు. సర్వేపై సోమవారం సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు అంబర్‌పేటలోని మహారాణ ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. నవంబర్ 6 నుంచి ప్రారంభమయ్యే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే)లో ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులో ఎలాంటి పొరపాట్లకూ తావివ్వకుండా నమోదు చేయాలని సూచించారు. అంబర్‌పేట్ పరిధిలో 90 వేల ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. సర్వే విషయమై పలువురు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి సుమారు 500 మందికి పైగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు శంకర్, రామ్మోహన్, రజిత, ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, అంబర్‌పేట్ సర్కిల్ కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి వచ్చే వానాకాలం లోపు మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా నుంచి మూసారాంబాగ్ వరకు రూ.52 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్‌తో పాటు సంబంధిత అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూమిని వీలైనంత త్వరగా సేకరించాలని ఆయన సూచించారు. బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం జరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీంతో పాటు మూసారాంబాగ్ బాగ్ నిర్మాణంలో సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇందుకు సంబంధించి పలు శాఖల అధికారులు రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పనుల్లో వేగం పెంచి నిర్దిష్ట సమయంలో బ్రిడ్జ్ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ నార్త్ జోన్ ప్రాజెక్ట్ విభాగం అధికారులు రోహిణి, రేణుక, ప్రశాంత్, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు రమేష్ బాబు, ప్రశాంతి, పవన్తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ 7వ కాన్ఫరెన్స్‌ను విజయవంతం చేయాలి

- అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ గ్రేట్ హైదరాబాద్ ఐఏఎల్ ఏడవ కాన్ఫరెన్స్ 6న ఏఐపిఎస్ఓ మీటింగ్ హాల్‌లో అమృత ఎస్టేట్ హిమాయత్ నగర్ లో జరుగుతుందని ఈ సమావేశం గోడ పత్రికను అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు. ఆ సెమినార్‌లో ప్రస్తుతం న్యాయవాదుల సమస్యలు తదితర అంశాలపై ప్రత్యేక చర్చ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీఎల్, ఐఏఎల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్రేట్ హైదరాబాద్ జయ శ్రీనివాస్, కుమార్ గౌడ్, విగ్రం వీరబాబు, నాగేశ్వరరావు, లక్ష్మయ్య, అనిల్ రవీందర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

నవతెలంగాణ-ధూల్ పేట్



ప్రజావాణి సమస్యలు అధికారులు తక్షణమే పరిష్కరించాలని జీహెచ్ ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ.వెంకన్న అధికారులకు సూచించారు. ఆయన పర్యవేక్షణలో సోమవారం చాంద్రాయణగుట్ట నర్కి పూల్ బాగ్ లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు సమస్యలపై 3 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో తమకు అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాలచే పరిష్కరిస్తున్నామన్నారు. అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనా బీ, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ రెడ్డి , బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై ప్రత్యేక కమిషన్ పట్ల హర్షం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య



నవతెలంగాణ-అంబర్‌పేట

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు పట్ల హర్షం బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమీషన్ ఏర్పాటు చేయడం అభినంద నీయమని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ కులాల వారిగా జనాభా లెక్కలు తీస్తే రిజర్వేషన్ల పెంపు, సంక్షేమ పథకాల అమలు, నిధుల కేటాయింపు సాధ్యమవుతుంద న్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచడానికి బీసీల జనాభా లెక్కలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రత్యేక కమీషన్ ఏర్పాటుతో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లపై న్యాయపరంగా ఉన్న అడ్డంకులు అన్ని తొలగిపోతాయని ఆయన పేర్కొన్నారు. బీసీలకు కార్యక్రమం లో బీసీ నేతలు గుజ్జ కృష్ణ, నందగోపాల్, కోల జనార్ధన్, మట్ట జయంతి, మధు, సత్యంగౌడ్, రామారావు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేలో విశ్వకర్మ కులంగా నమోదు చేయాలి

- విశ్వకర్మ కార్పొరేషన్ పాలకమండలి సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాతోజు రామాచారి

నవతెలంగాణ-ముషీరాబాద్

బీసీ కుల గణన సర్వేలో విశ్వకర్మ కులంగా నమోదు చేయాలని, విశ్వకర్మ కార్పొరేషన్ పాలకమండలి సాధన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాతోజు రామాచారి యావత్ విశ్వకర్మలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కమ్మరి, వడ్రంగి, కంచరి, శిల్పి, సొర్ణకార, విశ్వబ్రాహ్మణ కులాలు కాదు, అవి మన ఆరు వృత్తులు, మన కులం విశ్వకర్మ కులం, మన జాతి విశ్వకర్మ జాతి అన్నారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు ఒకే కులంగా, విశ్వకర్మ కులంగా, ప్రభుత్వ గెజిట్‌లో విశ్వకర్మ కులం రాజముద్రపడే విధంగా బీసీ కుల గణన సర్వేలో విశ్వకర్మ కులంగా నమోదు చేయాలని తెలిపారు. వృత్తుల పేరుతో విచ్ఛిన్నమైన మన విశ్వకర్మ జాతి ఏకమైయే రోజు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. గవర్నమెంట్ అధికారులు సర్వే చేసేటప్పుడు మన కులం విశ్వకర్మ కులమని చెప్పి రాయించాలన్నారు. మన విశ్వకర్మజాతి జనాభా సంఖ్య పెరగడంతో మనకు ప్రభుత్వం తరఫున లభించే ఆర్థిక, రాజకీయ లావాదేవీలు చేకూరే అవకాశం ఉందన్నారు. దీని ద్వారా మన విశ్వకర్మ జాతి ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందే అవకాశం బ్రహ్మాండంగా ఉందని తెలిపారు.

నవతెలంగాణ-ముషీరాబాద్



సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిలో భాగంగా రాంనగర్‌లోని తన నివాసంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజును వారాసిగూడ పోలీసులు ముందస్తు హౌస్ అరెస్టు చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని ప్రజలకు వెన్నంటే ఉండి ఉద్యమాలు చేస్తున్న నాయకులను అరెస్టు చేయడం ఖండిస్తున్నామని నగేష్ ముదిరాజ్ తెలిపారు.

సీపీఐ(ఎం) ముషీరాబాద్ జోన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ముషీరాబాద్



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ముషీరాబాద్ జోన్ నాలుగో మహాసభలు కామ్రేడ్ వనిత నగర్‌లో గోల్కొండ చౌరస్తా నగర కార్యాలయంలో నిర్వహించారు. ఈ మహాసభలలో ముషీరాబాద్ జోన్ పరిధిలోని అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పైన, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, పొదుపు గ్రూపు మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, గత ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో కనీస సౌకర్యాలు కల్పించాలని తదితర తీర్మానాలను ఈ మహాసభలో ఆమోదించుకోవడం జరిగింది. అనంతరం మహాసభ నూతన కమిటీని ఎన్నుకుంది. 7 మంది కార్యదర్శి వర్గ సభ్యులుగా 15 మందితో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీలో కార్యదర్శిగా ఆర్. వెంకటే ష్, కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎం.దశరథ్, టి. మహేందర్, ఆర్ ఈశ్వర్ బాబు, పి విమల, కే రమేష్, ఏఏకే పాషా, కమిటీ సభ్యులుగా ఏ. పద్మ, డి .సైదులు, ఆర్.వెంకటమ్మ, సిరాజుద్దీన్, జె.నర్సింగ్ రావు, ఏ.శ్రీరాములు, బి.శంకర్, లెనిన్‌లను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



- సీఐటీయు ఆటో యూనియన్ కార్యదర్శి బాబా

నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు ఆటో యూనియన్ కార్యదర్శి బాబా అన్నారు. ఏడాది కాలంగా ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఐటీయు యూనియన్ ఆధ్వర్యంలో నేడు 5న చలో హైదరాబాద్ కార్యక్రమంలో బాగంగా బిర్లా మందిర్ ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఆటో డ్రైవర్ కార్మికులతో కలిసి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ట్రాన్స్‌పోర్టు రంగం నాయకులు ఎల్.కోటన్నతో కలిసి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌ఫోర్టు రంగంలో పనిచేస్తున్నటు వంటి డ్రైవర్లు ప్రతి ఒక్కరూ ఇబ్బందు లకు గురవుతున్నారన్నారు. గత ఏడాది నుండి ఆటో డ్రైవర్లు కనీస అద్దె ఖర్చులు కూడా చెల్లించలేక అవస్థలు చెందుతున్నాం న్నారు. ఆటో డ్రైవర్లు ఆటో ఫైనాన్స్, ఇంటి అద్దెలు పిల్లల ఖర్చులు కట్టుకొలేక ఆందోళన చెందు తున్నారన్నారు. ఆటో కార్మికులకు ఆర్థిక సహాయం చేయాల న్నారు. నూతన వాహనం చట్టంలో కార్మికులకు డ్రైవర్లకు ఇబ్బందికరమైన వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు సమస్యలపై తలపెట్టిన చలో హైదరా బాద్ కార్యక్రమాన్ని అన్ని రంగాల డ్రైవర్లు పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిర్లా మందిర్ ఆటో స్టాండ్ డ్రైవర్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

నవతెలంగాణ-అంబర్‌పేట



ప్రజలకు మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, సౌకర్యాల కల్పనకు తనవంతు చొరువ తీసుకుంటానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి బీసీ బాట పేరిట సోమవారం అంబర్‌పేట నియోజకవర్గంలో అధికారులతో కలిసి పర్యటించారు. నియోజకవర్గంలోని అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్, చెన్నారెడ్డినగర్, బాగ్ అంబర్‌పేటలోని తూరా బనగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలతో మమేకామ వుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లు, డ్రయినేజీ, అంతర్గత రోడ్లు, తాగునీటి సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తీసుకవచ్చారు. ప్రజా సమస్యలు విన్న కేంద్రమంత్రి అప్పటికప్పుడు సం బంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారిం చాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి సి.కృష్ణ యాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్య క్షులు గౌతమ్‌రావు, కార్పొరేటర్లు కన్నె ఉమారమేశ్యాదవ్, అమృత, నాయ కులు నాగభూషణం చారి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

చలికాలంలో జాగ్రత్తగా ఉండాలి

- నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.నజియా నౌషిన్ సిద్ధిఖా

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



చలికాలం (శీతాకాలం)లో చల్లని వాతావరణం వణికిస్తుంది. పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంటాయి. ఈ కాలంలో ఆహ్లాదం మాటున జబ్బులు పొంచి ఉంటాయి. ఉదయాన్నే లేచి వాకింగ్, జాగింగ్ ఎక్కువగా చేస్తుంటారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు చలికాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. నజియా నౌషిన్ సిద్ధిఖా సూచిస్తున్నారు. సోమవారం నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మాట్లాడుతూ.. రోజు రోజుకు పెరుగుతున్న చలి తీవ్రతతో శ్వాసకోశ వ్యాధు లు ప్రబలే అవకావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. చలికాలంలో వృద్ధులు, చిన్నారులు బయట తిరగకపోవడం మంచిదని, తప్పనిసరి అయితే తలకు మఫ్లర్, మంకీ టోపీలు, ముఖానికి మాస్కులు ధరంచి బయటకు రావడం మంచిదంటున్నారు. పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో దోమలు వ్యాప్తిచెంది టైఫాయిడ్, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు, విషజ్వరాలు బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. తాగు నీటి విషయంలో ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలుషిత నీరు తాగితే డయేరియా వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. కాచి వడబోసిన మంచినీరు రోజుకు రెండు నుంచి మూడు లీటర్లు మంచినీరు తీసుకోవాలని సూచించారు. గాలి ద్వారా స్వైన్‌ఫ్లూ వంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకే అవకాశాలు ఉంటాయని తెలిపారు. పౌష్టికాహారం, రోగనిరోధక శక్తి పెంచే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. చలికాలంలో ప్రతి ఒక్కరూ సరైన జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, అస్తమా రోగులు, చల్లగాలిలో, మంచుపట్టిన సమయంలో బయట తిరగడం మంచిదికాదని సూచించారు. ముఖ్యంగా చలికాలంలో ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లు వాడకం తగ్గించాలన్నారు. చర్మంపై అశ్రద్ధ వహించ కుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో బయట తిరగడంతో జలుబు, జ్వరం, ఫ్లూ వంటివి వ్యాధులు సోకిన వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు అత్యవసర సర్వీసులు 108పై అవగాహన అవసరం

- 108 మేడ్చల్ కో ఆర్డినేటర్ దేవేందర్

నవతెలంగాణ-ధూల్ పేట్



విద్యార్థులకు అత్యవసర సర్వీసులపై అవగాహన ఎంతో అవసరమని 108 ప్రధాన కార్యాలయం మేడ్చల్ కో ఆర్డినేటర్ దేవేందర్ అన్నారు. సోమవారం గౌలిపుర సమీపంలో లలితా బాగ్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల శాలిబండ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు అత్యవసర సర్వీసులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిదిగా హాజరై ప్రసంగించారు. మన దేశంలో 17 రాష్ట్రాలలో 2005 నుండి 108 అత్యవసర సర్వీసులు ప్రజలకు ఉచితంగా సేవలు అందిస్తున్నాయని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరి నారాయణ ప్రసంగిస్తూ.. అనేక మందికి ఆపద సమయంలో అత్యవసర సర్వీసులపై అవగాహన లేక ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. 108 అత్యవసర సర్వీసుల ఇన్‌స్ట్రక్టర్ ప్రదీప్, పార్వతి గుండె నొప్పులపై, ప్రమాదాలపై, పాముకాటుపై, మూర్ఛపై వంటి అనేక అంశాలపై ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.అనురుద రావు, మధుసూదనరావు, డాక్టర్.ఎస్.విజయ భాస్కర్, శ్రీదేవి, అంజలి, ప్రమీల, నవనీత, శివప్రసాద్, రజిత, ఎం.వి.ఎస్ సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది అనిల్ కుమార్, సుధేష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీర శైవ లింగాయతులు రాజకీయంగా ఎదగాలి



- రాష్ట్ర వీరశైవ ధర్మ ప్రచార సమితి ఉపాధ్యక్షుడు కడ్లీ రాజశేఖర్

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

వీరశైవ లింగాయతులు రాజకీయంగా మరింతగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర వీరశైవ ధర్మ ప్రచార సమితి ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది కడ్లి రాజశేఖర్ అన్నారు. సోమవారం కోఠిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా, విద్యాపరంగా, ఆర్థికంగా ఎదగాలంటే కులగణన సమయంలో తాము వీర శైవ లింగాయత్ కులానికి చెందిన వారమని, బలిజా అని, లింగాయత్ అని లేక ఇంకా వేరే పేర్లు చెప్ప కూడదని సూచించారు. వీరశైవ లింగాయత్‌లను ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా పిలుస్తారని, కొన్ని ప్రాంతాల్లో లింగాయతులని, బలిజ, వాణి అని పిలుస్తారని, అందరూ వీరశైవ లింగాయత్ లే అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టడం అభినందనీయని, ఈ మేరకు చర్యలు తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కుల గణన కోసం వచ్చే అధికారులకు వీరశైవ లింగాయత్ అని మాత్రమే చెప్పాలని కోరారు. వీరశైవ లింగాయత్ లకు రాష్ట్ర కార్పోరేషన్లకు చైర్మెన్లుగా నియమిస్తే సముచితంగా గౌరవించినట్లు అవుతుందన్నారు. తమకు ప్రత్యేకమైన కుల వృత్తి లేదని, వ్యవసాయం, చిరు వ్యాపారం, ఉద్యోగం ఇలా ఏది చేస్తే అదే వృత్తిగా అధికారులకు తెలిపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర వీరశైవ ధర్మ ప్రచార సమితి అధ్యక్షుడు దిగంబరరావు , రాష్ట్ర ఫెడరేషన్ నాయకులు సులుగంటి సిద్దేశ్వర్, నర్సింహులు , ముక్తా శ్రీశైలం, నీలప్ప , సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కాస్మిక్ ఇండిగో పెయింటింగ్ చిత్రాలు..

నవతెలంగాణ-ధూల్‌పేట్



ఆదియోగి శివ కాస్మిక్ ఇండిగో పొడువాటి పెయింటింగ్ చిత్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సహజ నీలిమందు పెయింట్ తో చిత్రించిన ఈ చిత్రాల ఎగ్జిబిషన్‌ను సోమవారం సాలార్జంగ్ మ్యూజియంలో వెస్టర్‌ను బ్లాక్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా ఆదాయం పన్ను శాఖ మాజీ కమిషనర్ సంగీత గుప్తా పాల్గొని మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ కుసుంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 36 కళాత్మక పెయింటింగ్స్‌ను ఎలాంటి కెమికల్స్ వాడకుండా రూపొందించి సోలో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించామన్నారు. ఆదియోగి శివ్ కాస్మిక్ ఇండిగో పేరుతో భారతదేశం విదేశాలలో ప్రదర్శన నిర్వహించామన్నారు. సాలార్జంగ్ మ్యూజియంలో నిర్వహిస్తున్న ప్రదర్శన 17వ ప్రదర్శన అన్నారు. 35 కవిత పుస్తకాలను ప్రచురించామని, ఇందులో 7 ఆంగ్లం కవితలు ఉన్నాయని, 11 పుస్తకాలు విదేశీ భాషల్లోకి తర్జుమా చేయబడ్డాయన్నారు.


పొడవైన ఇండిగో పెయింటింగ్ ప్రత్యేకం

ఆదియోగి శివ, కాస్మిక్ ఇండిగోలో ప్రయాణంలో సుస్థిర జీవనం, సహజ నీలిమందును ప్రోత్సహించడానికి, పెయింటింగ్‌ను రూపొందించిందన్నారు. చేతితో తయారు చేసిన బట్ట, సహజ రంగు, రంగు రసాయన రహితంగా, పర్యావరణ అనుకూలమైనవి రూపొందించిందన్నారు. సంతోష్ గుప్తా పృథ్వీ ఫైన్ ఆర్ట్ అండ్ కల్చరల్ సెంటర్‌కు పోషకురాలుగా అధ్యక్షురాలుగా ఉందని, ప్రపంచంలోని సంస్కృతులను ఒకచోట చేర్చడానికి కృషి చేస్తుందన్నారు. విభిన్న సంస్కృతుల నుండి కళ, ఆలోచనలను పంచుకోవడం లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'ఇబ్రాహీం షరీఫ్‌పై చర్యలు తీసుకోవాలి'

నవతెలంగాణ-అంబర్‌పేట

ఈ స్థలం నాది అంటూ ఇబ్రాహీం షరీఫ్ హైకోర్టులో పిటిషన్ వేయగా కోర్టు ఆస్థలంతో నీకు సంబంధం లేదని చెప్పగా అతడు స్థలంపై కబ్జా ఉన్న జీపీఏ హోల్డర్ మహ్మద్ అమీనుద్దీన్ స్థలం చుట్టు ఉన్న కాంపౌండ్ వాల్‌ను కూలగొట్టి లోని ప్రవేశిస్తానని అడ్డువస్తే చంపేస్తానని ఇబ్రాహీం షరీఫ్ బెదిరిస్తున్నాడని అమీనుద్దీన్ పేర్కొన్నారు. అంబర్‌పేట మండలం గోల్నాక డివిజన్ పరిధిలోని ఖాద్రీ బాగ్‌లోని తాను కబ్జాలో ఉన్న స్థలంలో అమీనుద్దీన్ మాటాడుతూ ఇబ్రాహీం షరీఫ్ బెదిరింపులను వివరిస్తూ అతని నుంచి తనకు ప్రాణ హానీ ఉందని, తనకు ఏదైన జరిగితే పూర్తి బాధ్యత అతనిదేనన్నారు. డాక్యుమెంట్ నెం. 1996/1954 ప్రకారం మహ్మద్ ఇబ్రాహీం, మహ్మద్ అయూబ్ తండ్రి మహ్మద్ ఇస్మాయిల్ భూమిని కొనుగోలు చేశారన్నారు. సర్వే నెం. 354లోని టీఎస్ నెం.37 లోగల భూమిని రెవెన్యూశాఖ జీవోఎంఎస్ నెం.92 ద్వారా మహ్మద్ ఇబ్రాహీం, మహ్మద్ అయూబ్ల పేరుపై 2023లో రిజిస్ట్రేషన్ అయ్యిందని ఆయన చెప్పారు. మహ్మద్ ఇబ్రాహీం, మహ్మద్ అయూబ్‌ను 2013 డిసెంబర్ 19న ఈస్థలం జీపీఏ హోల్డర్‌గా తన పేరు చేయగా తాను అప్పటి నుంచి 33 ఈస్థలంపై కబ్జాలో ఉన్నానని అమీనుద్దీన్ చెప్పారు. సర్వే నెం.353/బిలోని ఈస్థలం నాది అంటూ ఇబ్రాహీం షరీఫ్ గత నెల అక్టోబర్‌లో హైకోర్టులో పిటీషన్ వేయగా ఆ భూమితో అతనికి సంబంధం లేదన్నారు. ఈ స్థలం విషయంలో ఇబ్రాహీం షరీఫ్ మూర్ఖత్వంతో వ్యవహరించి ఎలాంటి అఘాత్యానికి పాల్పడుతారన్న ఆందోళన తనకు ఉందని, తమకు ఏది జరిగిన అతనిదే పూర్తి బాధ్యత అని అమీనుద్దీన్ స్పష్టం చేశారు.




వెన్నెలలు మనకు పంచి గగనానికి ఎగిరిపోయిన చకోరం

అవధి లేని అందముంది అవనికి నలు దిక్కులా' అంటారు సీతారామ శాస్త్రి ఓ సినీ గీతంలో! నిజమే, ఉన్న ఎనిమిది గ్రహాల్లో అత్యంత అందమైనది ఈ నీలి గోళమే కదా! ఈ అందాలు రెండు రకాలు.. సముద్ర తీరాలూ, కొండలూ, గుట్టలూ, నదులూ, జలపాతాలూ, ఎడారులూ, వయాసిస్సులూ, ఇంద్ర ధనస్సులూ, నీలి మబ్బులూ, మట్టి దిబ్బలూ.. లాంటి నిర్జీవ రూపాల మనోహరం మొదటిదైతే, ఆ రూపాలకు చైతన్య సుందరత్వాన్ని అద్ది ఈ అపరిమిత సౌందర్యానికి పరిపూర్ణతను సిద్ధింపజేస్తోన్న అనంతకోటి జీవజాతుల జీవావరణం రెండోది. మరి ఇంతటి విశాలమైన ఈ సౌందర్య జగత్తులో జన్మించి, అందులో అందినంతయినా తిలకించి పులకించకుండా తనువు చాలించే మనుషులంత దురదృష్ట జీవులు మరొకరుండరు. చివరి శ్వాస వరకూ పాదాలను చక్రాలుగా మార్చుకొని తిరగ గలిగినంత మేరా తిరిగి, గుండెకు రెక్కలు మొలిపించుకొని ఎగరగలిగినంత మేరా ఎగిరి దర్శించుకొనడమే కాకుండా తాము చూసిన ఆ అందాలను అంతే అందంగా కెమెరాల్లో బంధించి, భద్రపరచి మనందరికీ అందించిన వారంతటి ధన్య జీవులు వేరొకరుండరు. అలాంటి అరుదైన, అపురూప యాత్రికురాలు కంభం పాటి సీత.



సీత, ఆమె భర్త శ్రీనివాస్ రావు ఇద్దరూ వరంగల్ కళాశాలలో జీవశాస్త్ర, వృక్ష శాస్త్ర అధ్యాపకులుగా పనిచేశారు. ఉద్యోగంలో ఉన్నప్పటినుండి వీరికి ప్రకృతన్నా, దాని సౌందర్యమన్నా ఎంతో మక్కువ. ఆ మక్కువ ఎక్కువవడంతో వీళ్ళు సహజంగానే వీలయినప్పుడల్లా అడవుల్లోకి, కొండల్లోకి, అందమైన మైదానాల్లోకి వెళ్లి ఆనందంగా గడిపి రావడం హాబీగా మార్చుకొన్నారు. ఇంకేముంది, అంతే సహజంగా వీళ్ళ చేతుల్లోకి కెమెరాలు వచ్చి చేరాయి. దాంతో తాము వెళ్ళిన ప్రదేశాల్లోని ప్రతి అందమైన దృశ్యాన్నీ అంతే అందంగా బంధించి ఇంటికి తెచ్చి, వాటిని మరింత అందంగా తీర్చి దిద్ది, పది మందికి చూపించి, భద్రపరచడం అలవాటు చేసుకొన్నారు. చివరికి బలమైన బలహీనతగా మార్చుకొన్నారు. అందులో భాగంగా ఆమె భర్త వెంట మన దేశంలో అడుగు పెట్టని అడవి, సందర్శించని సరస్సు, ఎక్కని కొండ, దిగని కోన, దాటని నది లేదంటే అతిశయోక్తి కాదు. ఒక్క హిమాలయాలకే ముప్పై సార్లు వెళ్ళారంటే అర్థం చేసుకోవచ్చు. మన దేశమే కాకుండా అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, ఐరోపా, కెన్యా, న్యూజిలాండ్, భూటాన్...ఇలా ఎన్నో ఖండాల్ని, విదేశాల్ని కూడా చుట్టేసి, అక్కడి అందాల్ని కూడా ఒడిసి పట్టేసి తెచ్చేశారంటే వీరి సౌందర్య పిపాస ఎంత తీవ్రమైనదో, వీరి పట్టుదల ఎంత గట్టిదో అర్థమౌతుంది. నలభై ఏండ్లకు పైగా నిరంతరంగా సాగిన అలుపెరుగని ఈ జంట విహంగ విహారానికి గత నెల 30న ఒక్కసారిగా కోలుకోలేని, మేలుకోలేని అంతరాయం.. డెబ్బై ఏండ్ల సీత అనూహ్య మరణం.



ఫొటోగ్రఫీ ప్రయాణం

ఫొటోగ్రఫీలో సీతకు భర్తే గురువు. శ్రీనివాస్‌రావు నుండి మెళకువలు నేర్చుకున్న ఆమె ఫొటోగ్రఫీ ప్రయాణం మొదట landscape photographyతో ప్రారంభమై తర్వాత wildlife photographyగా, మరీ ముఖ్యంగా bird photographyగా పరిణామం చెందుతూ, పరిణతి పొందుతూ పరిఢవిల్లింది. మహానది, ప్రవహించే తన దారిలో కేవలం బండ రాళ్ళను మాత్రమే ఢీ కొడుతుందను కోవడం మన అవగాహనా లోపం. అది, అందిన ప్రతి మట్టి రేణువును, రెల్లు పువ్వును, గడ్డి పోచను కూడా తాకుతూ, తడుముతూ, తడుపుతూ, తరిస్తూ పోతుంది. అలాగే ఈమె కూడా తమ దారిలో ఎదురైన మహోన్నత పర్వతాల్నీ, బలీయమైన ఏనుగుల్ని, పులుల్నీ ఎలా కెమెరాల్లో బంధించారో, చిన్ని చిన్ని రంగు రంగుల సీతాకోక చిలుకలను, సుందర సుకుమార సుమాల్ని కూడా అంతే సున్నితంగా కెమెరాల్లోకి ఎక్కించారు! అంటే తమ దారిలో ఎదురైనా ఏ అందాన్నీ వదిలి పెట్టలేదన్నమాట. ఇలా అతి తక్కువ కాలంలోనే సీత గురువును మించిన శిష్యురాలిగా తనని తాను తీర్చిదిద్దుకున్నారు.

చక్కని మూడు పుస్తకాలు

ఇవన్నీ ఓ ఎత్తయితే, ఈ సౌందర్య సముదాయాన్నంతా ఎంతో అందంగా అక్షరీకరించడం మరో ఎత్తు! అవును, ఈమె తన



భర్తతో కలిసి తమ అనుభవాల్ని, అనుభూతుల్ని కలబోసి, రంగరించి, రంగు రంగుల ఛాయా చిత్రాల్ని అందులో గుది గుచ్చి, మూడు చక్కని పుస్తకాల్ని ప్రచురించి మనకు అందించారు. వీరు ముద్రించిన మొదటి పుస్తకం 'విశ్వ విహారం'. ఇది ముఖ్యంగా వీరు దర్శించిన తీర్థ స్థలాలను గూర్చిన వివరణాత్మక పుస్తకం. ఇందులో ఎక్కడా వన్యప్రాణుల ప్రస్తావన లేదు. రెండోది రంగు రంగుల పక్షుల ఫొటోలతో నిండిన "Burds Beautiful" అనే పుస్తకం. నాకు వీరితో పరిచయం ఈ పుస్తకం ద్వారానే జరిగింది. తర్వాత కాలంలో సీత గారికి ఎఫ్‌బీలో మిత్రుడిగా మారడం, వారిని ప్రత్యక్షంగా కలవడం జరిగింది. ఇక వీరు ముద్రించిన మూడో పుస్తకం "Call of theWild". ఇది వీరు కెన్యాలోని masai mara అడవుల్లో తీసిన వన్య మృగాల అందమైన ఛాయా చిత్రాల సంపుటి. ఇందులో అన్నీ మృగాలే. గంభీరమైన ఆఫ్రికా ఏనుగులు, సింహాలు, చిరుత పులులు, అందమైన చీతాలు, అరుదైన ఆఫ్రికా హైనా (దుమ్మలగొండి)లు, రెండు కొమ్ముల ఆఫ్రికా ఖడ్గ మృగాలు, జింకలు, దుప్పి జాతులు.. ఇలా అనేక రకాల వన్య మృగాల్ని వాటి సహజ పరిసరాల్లో, సహజ స్వభావంతో, ఎంతో కష్టపడితే కానీ సాధ్యం కాని చక్కని ఫొటోలతో మన ముందుకు అందమైన అచ్చు రూపంలో తీసుకొచ్చారు.

వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా...

మిత్రులారా.. ఫొటోగ్రఫీ ఏముంది, కెమెరాలో నుండీ చూస్తూ క్లిక్ మనిపించడమేగా, అని ఎంత సులభంగా కనిపిస్తుందో, అనిపిస్తుందో, నిజానికి అంత కష్టమైన కళా రంగం ఇది. వాస్తవానికి ఏ కళయినా అంతే! అందులోనూ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ మరింత కష్టమైందే కాకుండా ఎంతో ముప్పు(రిస్క్) తో కూడుకున్నది. ఇది ఓ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా నా అనుభవంతో చెబుతున్న మాట! ఇంతటి కఠినమైన అభిలాషను సీత డెబ్బై ఏండ్ల వయసులో నిర్వహించారంటే ఎవరైనా నివ్వెర పోవాల్సిందే! వీరికి సెల్యూట్ కొట్టాల్సిందే! ఇటువంటి సాహస యాత్రలు వీరి జంట గత నలభై ఏండ్లుగా నిర్విరామంగా కొనసాగించారంటే ఎవరైనా నోళ్ళు తెరవాల్సిందే కదా!! దేశ, విదేశాల్లోని ఇలాంటి ఎన్నో పక్షుల, జంతువుల అభయారణ్యాలకు ఆమె భర్త వెంట ఎన్నో పర్యాయాలు పర్యటించారు. ఎన్నో అందమైన ఫొటోలు మనకోసం తీసుకొచ్చారు. అందుకు ఆమె పొందిన ప్రతిఫలం కేవలం సంతృప్తి. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే 62 ఏండ్ల వయసులో ఆమె ఈత నేర్చుకోవడమే కాకుండా, ఆ వయసు వారితో ఈతల పోటీల్లో పాల్గొని ఎన్నో బంగారు పతకాలు కూడా సాధించడం! హిమాచల్ ప్రదేశ్‌లోని తీర్థన్ నదిలో నీళ్ళు అత్యంత శీతలంగా ఉంటాయి. ఎందుకంటే అవి హిమాలయల్లోని మంచు కరిగి ప్రవహిస్తున్నవి గనుక. ఆ నదిలో దిగడానికి స్థానికులు కూడా జంకుతారట. అలాంటి నదిని ఆమె స్థానికులు వారిస్తున్నా వినకుండా అటునుండి ఇటుకు ఈదారంటే ఆవిడ మానసిక, శారీరక స్థైర్యానికి జోహార్లు అర్పించకుండా ఉండలేం.

ఏ పక్షిని చూసినా...

ఆగష్టు నెల 25న హైటెక్ సిటీ దగ్గరున్న సీసీఆర్‌టీ హాల్లో ఈ జంట Talk on Bird Photography Travelling అనే అంశం మీద ప్రసంగ కార్యక్రమం జరిగింది. దానికి మేమూ వెళ్లాము. అదే వీరిని మేము చివరిగా కలిసింది. తర్వాత మేము సెప్టెంబర్ 4న సొంతంగా కార్ డ్రైవ్ చేసుకుంటూ 54 రోజులు ఏకధాటిగా ఏడు రాష్ట్రాలు దాటి, 7500 కిమీ ప్రయాణించి తిరిగి అక్టోబర్ 29న హైదరాబాద్ చేరుకున్నాం. 30వ తేదీ సీత పోయారనే వార్త నన్ను శరాఘాతంలా తాకింది. నా అనుభవాల్ని పంచుకొంటూ, వారిద్దరి నుండి ఎన్నో నేర్చుకొంటూ, ఇంటర్వ్యూ చేయాలన్న నా కోరిక తీరకుండానే పోయింది! ఏ పక్షిని చూసినా.. పులిని గాంచినా.. ఏ పుణ్యక్షేత్రాన్ని స్మరించినా... హిమాలయాలను తలచుకొన్నా సీత గారు స్మరణకు వచ్చి చిరునవ్వులతో మనోఫలకం మీద సాక్షాత్కరిస్తారనడంలో సందేహం లేదు!

- ఎస్.ఎస్.బి. గేరా, 9492922492



మూసీ పరివాహక ప్రాంతంలో
8న సీఎం పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటున్నామని సీఎం రేవంత్ చెబుతూ వస్తున్నారు. ఇదే సమయంలో నిర్వాసితుల సమస్యలు, వారికి జీవనోపాధి, ఇండ్ల నిర్మాణం తదితరాంశాలు ముందుకొచ్చాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్... ఈ ప్రాజెక్టులో భారీ ఎత్తున కుంభకోణం చోటు చేసుకోబోతోందంటూ ఆరోపణలు గుప్పించింది. ఈ క్రమంలో మూసీ పరివాహక ప్రాంతంలో పర్యటించటం ద్వారా అక్కడి రైతుల మద్దతును కూడగట్టాలని సీఎం నిర్ణయించారు. ఈ పర్యటన ద్వారా కాలుష్య కాసారంగా మారిన మూసీ దుస్థితి, హైదరాబాద్ నగరంలో ఆ నదిని ఆక్రమించిన వైనం, కాలుష్యంతో కూడిన నీటి వల్ల నల్లగొండ జిల్లా రైతులు పడుతున్న ఇబ్బందులు, పంటల పరిస్థితి, మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్, బీజేపీ చేస్తున్న విమర్శలపై ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. ఆయా అంశాలను ఆయన రైతులకు విడమరిచి చెప్పనున్నారు. మూసీ కారిడార్ అభివృద్ధిలో భాగంగా తొలి దశలో గండిపేట, హిమాయత్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ప్రక్షాళన చేయనున్నట్టు సీఎం ప్రకటించిన సంగతి విదితమే. ఇందులో భాగంగా బాపూఘాట్ దగ్గర ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన మహాత్ముని విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. దాంతోపాటు మూసీపై బ్రిడ్జ్ కమ్ బ్యారేజీని నిర్మించనున్నారు. ఆయా ప్రాంతాలను పర్యాటక, వ్యాపార, వినోద, విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని సర్కారు ప్రకటించింది. ఈ విషయాలన్నింటినీ వివరించేందుకు రేవంత్ తన భువనగిరి పర్యటనను వినియోగించుకోనున్నారు. తద్వారా ప్రతిపక్షాల విమర్శలకు ధీటుగా జవాబివ్వాలని ఆయన భావిస్తున్నారు.

నేటినుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు ఈనెల 20 వరకు ఉందని పేర్కొన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షా (సీబీటీ) విధానంలో వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి 20వ తేదీ వరకు రాతపరీక్షలను నిర్వహిస్తామని వివరించారు. పూర్తిస్థాయి సమాచారం, ఇతర వివరాల కోసం https:// schooledu. telangana. gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. రాష్ట్రంలో ఏటా రెండు సార్లు టెట్‌ను నిర్వహిస్తామని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇది జాబ్ క్యాలెండర్‌లోనూ పొందుపరిచింది. ఈ ఏడాది మే 20 నుంచి జూన్ రెండో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను నిర్వహించింది. తాజాగా రెండో టెట్ నోటిఫికేషన్‌ను ఇప్పుడు జారీ చేయడం గమనార్హం. టెట్ పేపర్-1కు 99,961 మంది దరఖాస్తు చేయగా, 85,996 (86.03 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు. 13,962 మంది గైర్హాజరయ్యారు. హాజరైన వారిలో 57,725 (67.19 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. పేపర్-2కు 1,86,428 మంది దరఖాస్తు చేస్తే, 1,50,491 మంది పరీక్ష రాయగా, 49,894 మంది గైర్హాజరయ్యారు. హాజరైన వారిలో 51,443 (34.18 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు.

డీఎస్సీపైనే ఆశలు...

టెట్ నోటిఫికేషన్ వచ్చేసింది. ఇక అందరి చూపు డీఎస్సీపైనే ఉన్నది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను ఫిబ్రవరిలో జారీ చేస్తామని జాబ్ క్యాలెండర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఐదు వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ వేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.

అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 29న విడుదల చేసింది. జులై 18 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా 2,79,957 మంది దరఖాస్తు చేయగా, 2,45,263 (87.61 శాతం) మంది అభ్యర్థులు రాతపరీక్షలకు హాజరయ్యారు. గతనెల తొమ్మిదిన ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా 10,006 మంది ఉపాధ్యాయ అభ్యర్థులు నియామకపత్రాలను అందుకున్నారు. ఈనెల 10,11 తేదీల్లో డీఈవో కార్యాలయాల్లో వారు రిపోర్టు చేశారు. 16న కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయిస్తూ డీఈవోలు ఉత్తర్వులిచ్చారు. దీంతో కొత్త టీచర్లు విధుల్లో చేరి పాఠాలను బోధిస్తున్నారు. ఈ డీఎస్సీలో ఉద్యోగం రానివారు, కొత్తగా టెట్‌లో ఉత్తీర్ణత పొందేవారు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్నారు.

టెట్ నోటిఫికేషన్ వివరాలు

వివరాలు	తేదీ
దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం	నవంబర్ 5 నుంచి
స్వీకరణకు తుదిగడువు	నవంబర్ 20 వరకు
రాతపరీక్షలు (ఆన్‌లైన్‌లో)	2025, జనవరి 1 నుంచి 20 వరకు

హిందీ లేఖకు మలయాళంలో జవాబు !

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. హిందీని రుద్దడంపై ఫిబ్రవరిలో జరిగిన మధ్యంతర బడ్జెట్ సమావేశాలలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే రాజ్యసభలో విమర్శలు చేశారు. ముఖ్యంగా ఆంగ్లంలో కాకుండా హిందీలో ప్రసంగించాలని మేఘాలయ గవర్నర్ తీసుకున్న నిర్ణయంపై మండిపడ్డారు. మేఘాలయలో ఆంగ్లం అధికార భాషగా ఉంది. గవర్నర్ చర్య దేశంలో భాషా వైవిధ్యాన్ని అణచివేస్తోందని గోఖలే ఆరోపించారు. దీనిపై రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ స్పందిస్తూ రాజ్యాంగంలోని 351వ అధికరణను ప్రస్తావించారు. అది హిందీ భాష అభివృద్ధిని కోరుకుంటోందని తెలిపారు. ఛైర్మన్ వ్యాఖ్యపై డీఎంకే, వామపక్షాలు సహా పలువురు సభ్యులు నిరసన తెలిపారు. ప్రాంతీయ భాషలకు అత్యంత గౌరవం ఇవ్వాలని కోరారు.

మతోన్మాద దాడులను వ్యతిరేకించాలి

(మొదటిపేజీ తరువాయి)

డీజీ నరసింహారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ బాలమల్లేష్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమ, కేజీ రాంచందర్, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, నాయకులు వనం సుధాకర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర నాయకులు తేజ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు, సీపీఐ(ఎంఎల్) రాష్ట్రకార్యదర్శి ప్రసాదన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మతోన్మాద బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్‌లు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ మైనార్టీలపై దాడులను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. మత సామరస్యాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను వేధింపులకు, భయభ్రాంతులకు గురిచేస్తూ దాడులకు ఉసిగొల్పుతున్నాయని పేర్కొన్నారు. ఈ మతోన్మాద దుశ్చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో కొత్త పోలీస్ చట్టం సెక్షన్ 163 ద్వారా బహిరంగ ప్రచార కార్యక్రమాలు చేయరాదనే నిషేధాజ్ఞలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ ఉత్తర్వులను తక్షణమే ఉప సంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆదాయం పెంచండి

(మొదటిపేజీ తరువాయి)

చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హౌసింగ్ సెక్రటరీ బుద్ధ ప్రకాష్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు నారాయణరెడ్డి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయలేదు..?

న్యూఢిల్లీ : దేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం పెరగడం పట్ల ఢిల్లీ సర్కారుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లో వస్తున్న వార్తలను చూస్తే.. ఢిల్లీలో బాణాసంచా నిషేధం అమలు కాలేదని అనిపిస్తోందని పేర్కొంది. దీనికి సమాధానం చెప్పాలని సుప్రీం ఆదేశించింది. బాణాసంచా నిషేధంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. దీపావళి నుంచి ఢిల్లీ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగింది. దాంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలు, కండ్లు ఎర్రబారడం, చికాకు తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం నగరంలోని చాలా ప్రాంతంలో గాలి నాణ్యత సూచి 400 మార్కుని దాటింది. పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని డిసెంబర్ 2, 2016న ఎంసీ మెహతా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీలో గ్రాప్ పాలసీని అమల్లోకి తీసుకొచ్చారు. చలికాలంలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇందులో పలు నిబంధనలు ఉన్నాయి. బాణాసంచాపై నిషేధం సైతం ఉన్నది. వాయు కాలుష్యం పట్ల ఢిల్లీ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నిషేధం ఉంటే పటాకులు ఎలా పేల్చారు? వీలైనంత త్వరగా సమాధానం ఇవ్వాలని ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశించింది. ఢిల్లీలో వాయుకాలుష్యం పెరిగిపోవడంతో మార్నింగ్ వాక్ చేయడం మానేస్తున్నట్లు సీజేఐ చంద్రచూడ్ ఇటీవల వ్యాఖ్యానించారు.

పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచుల ఆందోళన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్/కంటోన్మెంట్

పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పోరుబాట పేరుతో చలో హైదరాబాద్‌కు తరలివచ్చిన మాజీ సర్పంచులను పోలీసులు పలుచోట్ల అదుపులోకి తీసుకున్నారు. రంగారెడ్డి, మెదక్, నల్లగొండ, సిద్ధిపేట జిల్లాల్లో ముందస్తు అరెస్టులు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికెళ్లి వినతిపత్రం అందజేస్తామన్న ప్రకటన నేపథ్యంలో పోలీసులు అలర్ట్ అయ్యారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో సర్పంచుల సంఘం జేఏసీ నేతలు సమావేశమయ్యారని తెలుసుకుని అక్కడకెళ్లి వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, ఉపాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, రేపాక నాగయ్య, గుర్రాలదండి ఆంజనేయులు, దుంప ఆంజనేయులుతో పాటు పలువురు అక్కడే కూర్చొని నిరసన తెలిపే యత్నం చేశారు. 'సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి...ఆపాలి..ఆపాలి...గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన సర్పంచుల ఆత్మహత్యలను ఆపాలి...ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి..ఆత్మహత్యలు మాకు..అవార్డులు మీకా...పోలీసుల వైఖరి నశించాలి..ఇదేమి రాజ్యం..ఇదేమి రాజ్యం..దొంగల రాజ్యం..దోపిడీ రాజ్యం. సర్పంచుల ఐక్యత వర్ధిల్లాలి...' అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలోనే పోలీసులు వారిని అరెస్టు చేసి నగరంలోని తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పీఎస్ వద్దకు చేరుకుని వారికి మద్దతుగా ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచులు అడిగితే పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని విమర్శించారు. లక్షల రూపాయలు అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేసిన వారికి బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు వస్తున్నాయనీ, అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచులను మాత్రం అరెస్టు చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం వచ్చి 10 నెలలు దాటిందనీ, ఇప్పటిదాకా రూ.పది లక్షల బిల్లులు కూడా వారికి చెల్లించలేదని విమర్శించారు. నాలుగైదు సార్లు మాజీ సర్పంచులు హైదరాబాద్‌కు వచ్చి మొరపెట్టుకున్నా ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వారిని చర్చలకు పిలవలేదన్నారు. పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మెన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ గజ్జెల నగేష్, బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి నివేదిత తదితరులు పాల్గొన్నారు. అరెస్టు చేసిన వారిని మధ్యాహ్నం వరకు తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లోనే ఉంచి ఆ తర్వాత సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

మాజీ సర్పంచుల దుస్థితికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలే కారణం : కేంద్ర మంత్రి బండి సంజయ్

రాష్ట్ర ప్రభుత్వం మాజీ సర్పంచులను అరెస్టు చేయించడాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ తప్పుబట్టారు. పెండింగ్ బిల్లుల కోసం ఈ రోజు రోడ్లెక్కి, బిచ్చగాళ్ల మాదిరిగా మాజీ సర్పంచులు అడుక్కునే దుస్థితికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులే కారణమని విమర్శించారు. వారి బిల్లులను చెల్లిస్తామని ఎన్నికల సమయంలో చెప్పి ఇప్పుడు గాలికొదిలేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. మూసీ పునర్జీవనం కోసం రూ.1.5 లక్షల కోట్లు ఖర్చుపెడుతున్న కాంగ్రెస ప్రభుత్వానికి మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించడానికి మనస్సు రావడం లేదా? అని ప్రశ్నించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు.

ఏడాది నుంచి అడుగుతున్నా పెండింగ్ బిల్లులివ్వరా..అడిగితే అరెస్టులా? : కేటీఆర్

పెండింగ్ బిల్లులివ్వాలని ఏడాది నుంచి మాజీ సర్పంచులు అడుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ సర్పంచుల అరెస్టులను ఖండించారు. రాష్ట్రంలో నిత్యం అరెస్టుల పర్వం కొనసాగుతున్నదనీ, సీఎం, మంత్రులు ప్రజా సమస్యలను గాలికొదిలేసి ఊరేగుతున్నారని విమర్శించారు. పల్లెప్రగతి పేరిట తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమానికి తూట్లు పొడిచి నిధులు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆపుతున్నదని తెలిపారు. అరెస్టు చేసిన మాజీ సర్పంచులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మకండి..
మీ బిల్లులను క్లియర్ చేస్తాం..

మాజీ సర్పంచులను రెచ్చగొడుతున్నది బీఆర్ఎస్సే

బిల్లులివ్వకుండా బలవంతంగా పనిచేపించింది కేసీఆర్ సర్కారే

వారి చావులకు ఆ పార్టీనే కారణమనేది ముమ్మాటికీ నిజం : మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'మాజీ సర్పంచుల్లారా..మిమ్మల్ని రెచ్చగొడుతున్న బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మకండి. వారి కుట్రలో బలికావొద్దు. మా ప్రభుత్వం వచ్చాక సర్పంచులతో బలవంతంగా పనులు చేయించలేదు. నిధులు ఆపలేదు. మీ బిల్లులను మేం కచ్చితంగా క్లియర్ చేస్తాం. ఓపిక పట్టండి' అని మాజీ సర్పంచులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) కోరారు. గత బీఆర్ఎస్ హయాంలో సర్పంచుల ఆత్మహత్యలు, పెండింగ్ బిల్లుల వార్తా కథనాలను మీడియాకు సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచులకు బిల్లులివ్వకుండా బలవంతంగా పని చేయించింది. సంవత్సరాల తరబడి పెండింగ్‌లో పెట్టి వారి ఆత్మహత్యలకు కారణమైంది. అలాంటి బీఆర్ఎస్ ఇప్పుడు సర్పంచ్లకు బిల్లులు చెల్లించాలని ఆందోళన చేయడం చంపినోడే తద్దినం పెట్టినట్టుగా ఉంది' అని విమర్శించారు. ఆర్థిక శాఖ మంత్రిగా హరీశ్ రావు ఉన్నప్పుడే బిల్లులు పెండింగ్లో పెట్టారని మాజీ సర్పంచులకు తెలుసునని చెప్పారు. ఆర్థిక శాఖను, అధికారాన్ని చేతిలో పెట్టుకొని సర్పంచుల ఆత్మహత్యలకు కారణమైందే హరీశ్‌రావే అని విమర్శించారు. ఇప్పుడు డ్రామాలు చేస్తూ ప్రేమ ఒలకపోస్తున్నట్టు నటించడాన్ని మానుకోవాలని హితవు పలికారు. అధికారం పోయాక ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయడాన్ని తప్పుబట్టారు. సమస్యలుంటే అక్కడికెళ్లి డ్రామాలు చేయడం, ఆత్మహత్యలకు పురికొల్పడం హరీశ్‌రావుకు అలవాటు అని విమర్శించారు. పనులు చేయించుకుని బిల్లులు పెండింగ్‌లో పెట్టిన మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావు ఇండ్ల ముందు ధర్నాలు చేయాలని మాజీ సర్పంచులకు సూచించారు. వారి స్వార్థపూరిత రాజకీయాల కోసం బలి కావద్దని సూచించారు. నీతినిజాయితీ, సర్పంచుల పట్ల ప్రేమ ఉంటే మీ ప్రభుత్వ హయాంలో బిల్లులు ఎందుకు చెల్లించలేదని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ పెట్టిన ఉపాధి హామీ, ఇతర పనుల బిల్లులను క్లియర్ చేసుకుంటూ వస్తున్న తీరును వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.580 కోట్లను ఇప్పటికే విడుదల చేశామని గుర్తు చేశారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రాలేదనీ, దారి మళ్లించే ప్రశ్నే ఉత్పన్నం కాదని చెప్పారు. జరిగిన పనులపై విచారణ జరిపించి బిల్లు చెల్లిస్తామన్నారు. తోటి సర్పంచుల చావులకు కారణమైన అప్పటి ఆర్థిక మంత్రి హరీష్ రావును మాజీ సర్పంచులు నిలదీయాలని పిలుపునిచ్చారు. కులగణనకు సహకరించాలని కోరారు.

స్పిన్ స్ట్రోక్

- స్పిన్ పిచ్‌లతో భారత్‌కు ఎదురుదెబ్బ
- అనుకూల పిచ్‌ల పైనా పసలేని స్పిన్నర్లు

సొంతగడ్డపై ఆడుతున్నప్పుడు అనుకూల పరిస్థితులు కోరుకోవటం పరిపాటి. ఆసీస్ పేస్, ఇంగ్లాండ్ స్వింగ్ పిచ్‌లను తయారు చేసినట్టే భారత్ స్పిన్ పిచ్‌లను సిద్ధం చేయటం సహజం. మూడో రోజు ఆట నుంచి పిచ్ స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌లపై భారత్ జైత్రయాత్ర సాగించగా.. తొలి రోజు నుంచే స్పిన్ మాయ మొదలైతే భారత్‌కు భంగపాటు తప్పటం లేదు. స్పిన్ స్వర్గధామ పిచ్‌లు టీమ్ ఇండియా సొంతగడ్డ అనుకూలతను తగ్గిస్తున్నాయి.

నవతెలంగాణ క్రీడావిభాగం



టెస్టు క్రికెట్‌లోనే కాదు, వైట్‌బాల్ ఫార్మాట్‌లోనూ పిచ్‌లపై చర్చను భారత ఆటగాళ్లు ఇష్టపడరు. పేస్ పిచ్‌పై మూడు రోజుల్లో ఫలితం తేలటం.. స్పిన్ పిచ్‌పై మూడు రోజుల్లో మ్యాచ్ ముగియటం ఒక్కటే అనే అభిప్రాయం గట్టిగా చెబుతారు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లోనూ భారత జట్టు కోరుకున్న పిచ్‌లపై ఆడింది. ప్రత్యర్థి బలహీనతలకు అనుగుణంగా ఏ వేదిక, ఏ తరహా పిచ్ కావాలనే డిమాండ్లను నెరవేర్చుకుంది. పోటీతత్వ ఆధునిక క్రికెట్‌లో ఆతిథ్య అనుకూలతను సద్వినియోగం చేసుకోవటం తప్పు కాదు. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లు సొంతగడ్డపై తమకు అనుకూలమైన పిచ్‌లనే కోరుకుంటాయి. స్వదేశంలో టీమ్ ఇండియా స్పిన్ పిచ్‌లను కోరటం రహస్యం ఏమీ కాదు. ఆతిథ్య జట్టుకు అనుకూల పిచ్ ఉండాలని చీఫ్ కోచ్ గౌతం గంభీర్ గట్టిగా వాదించారు. ఇప్పుడు ఆ విపరీత అనుకూలతనే భారత్ కొంపముంచింది. స్పిన్ స్వర్గధామ పిచ్‌లపై పసలేని ప్రత్యర్థి స్పిన్నర్లు.. నాణ్యమైన భారత స్పిన్నర్లతో సమానంగా రాణించారు. ఇక్కడే.. టెస్టు, సిరీస్ ఫలితం తలకిందులైంది.

టాస్ పాత్ర తగ్గిద్దామని..

గత 12 ఏండ్లలో స్వదేశంలో భారత్ ఏడు టెస్టుల్లో పరాజయం పాలైంది. అందులో నాలుగు టెస్టులు స్పిన్ స్వర్గధామ పిచ్‌లపైనే జరిగాయి. మిగతా మూడు టెస్టుల్లో.. బెంగళూర్‌లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, హైదరాబాద్‌లో ఒలీ పోప్ అసమాన ఇన్నింగ్స్, 2021 చెన్నై టెస్టులో జో రూట్ ఇన్నింగ్స్ ఓటమికి దోహదం చేశాయి. గతంలో భారత్ మూడో రోజు నుంచి స్పిన్‌కు అనుకూల పిచ్‌లను తయారు చేసింది. కానీ 2021 చెన్నై టెస్టులో జో రూట్ ఇన్నింగ్స్ మన ఆలోచనలను మార్చివేసింది. టాస్ ఓడితే.. బ్యాటింగ్‌కు అనుకూల పరిస్థితుల్లో ప్రత్యర్థి పరుగులు పిండుకుంటుంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల వేట సైతం దీనికి తోడైంది. దీంతో సంప్రదాయ స్పిన్ పిచ్‌ల నుంచి ర్యాంక్ టర్నర్‌లను భారత్ కోరుకుంది. దీంతో టాస్ ఓడినా.. ప్రత్యర్థికి పెద్దగా అనుకూలత ఉండదని భావించింది. కానీ టాస్ పాత్ర తొలగిందని గణాంకాలు చెప్పలేకపోతున్నాయి. టాస్ నెగ్గిన జట్టు కనీసం తొలి మూడు గంటలైనా బ్యాటింగ్‌కు అనుకూల పరిస్థితులు ఆస్వాదిస్తుంది. టాస్ ఓడిన జట్టుకు ఆ పరిస్థితి లేదు. తొలి మూడు గంటల్లో 100-150 పరుగులు చేసినా.. ఆ తర్వాత అన్ని పరుగులు చేసేందుకు ఎన్ని కష్టాల్లో పడాలో ఇటీవల సిరీస్‌లో మనం చూశాం.

పసలేని స్పిన్నర్ల హవా!

భారత్, న్యూజిలాండ్ టెస్టు సిరీస్‌లో స్పిన్నర్ల సగటు 24 కంటే తక్కువ. 2017 నుంచి స్వదేశీ టెస్టుల్లో స్పిన్ స్వర్గధామ పిచ్‌లపై స్పిన్నర్ల సగటు 24 కంటే దిగువ ఉంటే భారత స్పిన్నర్ల సగటు 16.37గా ఉంది. ఇదే సమయంలో ప్రత్యర్థి స్పిన్నర్ల సగటు 22.91గా నమోదైంది. ఇక్కడ నాణ్యమైన భారత స్పిన్నర్ల సగటుకు.. పసలేని ప్రత్యర్థి స్పిన్నర్ల సగటు వ్యత్యాసం స్వల్పం. 2017 నుంచి స్వదేశీ టెస్టుల్లో స్పిన్నర్ల సగటు 24 కంటే ఎక్కువగా ఉంటే.. ఆ టెస్టుల్లో భారత స్పిన్నర్ల సగటు 26.22 కాగా ప్రత్యర్థి స్పిన్నర్ల సగటు 57.04. మూడో రోజు నుంచి టర్న్ లభించే పిచ్‌లపై రివర్స్ స్వింగ్ సైతం లభిస్తుంది. ఈ పిచ్‌లపై వికెట్‌పై నిలకడగా మాయజాలం చేయాలి. బ్యాటర్‌ను తెలివిగా ఉచ్చులో పడేయాలి. అశ్విన్, జడేజా వంటి ప్రపంచ శ్రేణి స్పిన్నర్లు మాత్రమే వికెట్ల వేటలో సఫలీకృతం కాగలరు. కానీ ర్యాంక్ టర్నర్‌లపై పసలేని స్పిన్నర్లు సైతం మాయ చేస్తున్నారు. 2020 నుంచి భారత్‌లో జరిగిన టెస్టుల్లో ఆరుగురు ప్రత్యర్థి జట్ల స్పిన్నర్లు కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన చేశారు. జో రూట్, మిచెల్ శాంట్నర్, టాడ్ మర్ఫీ, టామ్ హార్లీ, మాట్ కున్హేమాన్, షోయబ్ బషీర్ ఐదు వికెట్లు పడగొట్టారు. తొలి రోజు నుంచే స్పిన్ తిరిగే పిచ్‌పై అశ్విన్, జడేజా మాయకు.. ప్రత్యర్థి స్పిన్నర్ల మాయకు పెద్దగా వ్యత్యాసం లేకుండా పోయింది.

రోహిత్, ద్రవిడ్ జోడీ అలా..

ర్యాంక్ టర్నర్‌లు పసలేని స్పిన్నర్లను రేసులోకి తేవటమే కాదు మన బ్యాటర్ల ప్రదర్శనను సైతం ప్రభావితం చేస్తున్నాయి. 2017 నుంచి స్వదేశీ టెస్టుల్లో సంప్రదాయ పిచ్‌లపై విరాట్ కోహ్లి బ్యాటింగ్ సగటు 90.25. ఈ పిచ్‌లపై స్పిన్నర్ల సగటు 24 కంటే ఎక్కువ. కానీ స్పిన్నర్ల సగటు 24కు దిగువ ఉన్న టెస్టుల్లో కోహ్లి బ్యాటింగ్ సగటు 20.13కు పడిపోయింది. రాహుల్ ద్రవిడ్, రోహిత్ శర్మ నాయకత్వంలో భారత జట్టు సాధారణ పిచ్‌లను కోరుకుంది. 2024 హైదరాబాద్ టెస్టులో ఓటమి ఎదురైనా.. చివరి నాలుగు టెస్టుల్లో సాధారణ పిచ్‌లపైనే విజయాలు సాధించింది. ఓటమి ఎదురైందని.. విపరీతంగా టర్న్ లభించే పిచ్ కావాలని క్యూరేటర్‌ను కోరలేదు. బెంగళూర్ ఓటమితో పుణెలో, ముంబయిలో ర్యాంక్ టర్నర్‌లను భారత్ కోరుకుంది. పుణె, ముంబయి టెస్టుల్లో భారత్ టాస్ నెగ్గితే ఫలితాలు భిన్నంగా ఉండేవి కావచ్చు. కానీ మన స్పిన్నర్ల, మన బ్యాటర్ల ప్రదర్శనను తగ్గించే స్పిన్ స్వర్గధామ పిచ్‌లను కోరి మరీ సిద్ధం చేయించి.. ఓటమి పాలవటం దారుణం.



వేలం వేదిక రియాద్?

కొత్త వేదిక అన్వేషణలో బీసీసీఐ

ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 ఆటగాళ్ల మెగా వేలానికి కొత్త వేదికను ఖరారు చేసేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సిద్ధమవుతోంది. గత ఏడాది మినీ వేలాన్ని దుబాయ్ వేదికగా నిర్వహించారు. ఐపీఎల్ మేనియాను కొత్త మార్కెట్‌కు తీసుకెళ్లాలనే యోచనలో ఉన్న బీసీసీఐ సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో ఆటగాళ్ల వేలం నిర్వహించాలని అనుకుంటోంది. నవంబర్ 24, 25న రెండు రోజుల పాటు మెగా వేలం జరిగే అవకాశం ఉంది. దుబాయ్‌తో పోల్చితే రియాద్ ఖరీదైన నగరం. కనీసం నాలుగు రోజుల పాటు ప్రసారదారు సిబ్బంది, బీసీసీఐ ఆఫీస్ బేరర్లు, ఫ్రాంచైజీ ప్రతినిధులు, ఇతర సిబ్బంది ఉండేందుకు అన్ని ఏర్పాట్లు బోర్డు చూసుకోవాల్సి ఉంటుంది. వ్యయం, భారత్‌లో ప్రసారాలకు అనుగుణంగా సమయంపై స్పష్టత లభిస్తే త్వరలోనే బోర్డు అధికారిక ప్రకటన చేయవచ్చు.

ఆ ఇద్దరు ముందుగానే..!

బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్



ముంబయి : భారత్, ఆస్ట్రేలియా ప్రతిష్టాత్మక బోర్డర గవాస్కర్ టెస్టు ట్రోఫీ సన్నాహకాలు మొదలయ్యాయి. నవంబర్ 22 నుంచి పెర్త్‌లో తొలి టెస్టు ఆరంభం కానుండగా.. భారత జట్టులో ఇదరు ఆటగాళ్లు కాస్త ముందుగానే ఆస్ట్రేలియాకు వెళ్లనున్నారు. కెఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్‌లు ఈ నెల 7 నుంచి ఆరంభం కానున్న భారత్-ఏ, ఆసీస్-ఏ రెండో అనధికార టెస్టులో పోటీపడనున్నారు. తొలి టెస్టు ముంగిట పెర్త్‌లో భారత్, భారత్-ఏ వార్మప్ మ్యాచ్ షెడ్యూల్ చేసినా.. భారత కెప్టెన్ రోహిత్ శర్మ నెట్ ప్రాక్టీస్‌కే మొగ్గు చూపిన సంగతి తెలిసిందే. భారత జట్టు నవంబర్ 10న ఆస్ట్రేలియాకు బయల్దేరనుంది. పెర్త్ టెస్టులో కెప్టెన్ రోహిత్ శర్మ ఆడే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. వ్యక్తిగత కారణాలతో రోహిత్ శర్మ తొలి టెస్టుకు అందుబాటులో ఉండటం లేదని బోర్డు వర్గాలు తెలిపాయి.

ఎదురులేని పుణెరి పల్టన్

30-49తో గుజరాత్ చిత్తు
ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 11



నవతెలంగాణ-హైదరాబాద్: డిఫెండింగ్ చాంపియన్ పుణెరి పల్టన్ టాప్ లేపింది. ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో ఐదో విజయం ఖాతాలో వేసుకున్న పుణెరి పల్టన్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానం మరింత పదిలం చేసుకుంది. సోమవారం గచ్చిబౌలిలోని జీఎంసి బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన పీకెఎల్ 11 లీగ్ దశ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌పై 49-30తో పుణెరి పల్టన్ ఏకపక్ష విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కీలక ఆటగాళ్ల విశ్రాంతి తీసుకున్నప్పటికీ సమిష్టిగా మెరిసిన పుణెరి పల్టన్ 19 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేయటం విశేషం. పుణెరి పల్టన్ ఆటగాళ్లలో ఆకాశ్ షిండె (11 పాయింట్లు) సూపర్ టెన్‌తో మెరువగా.. పంకజ్ మోహితె (8 పాయింట్లు), మోహిత్ గోయత్ (5 పాయింట్లు), అమన్ (5 పాయింట్లు), గౌరవ్ ఖత్రి (5 పాయింట్లు) అదరగొట్టారు. గుజరాత్ జెయింట్స్ తరఫున గుమన్ సింగ్ (13 పాయింట్లు) సూపర్ టెన్ ప్రదర్శనతో ఒంటరి పోరాటం చేశాడు. పుణెరి పల్టన్ ఏడు మ్యాచుల్లో ఐదో విజయం సాధించగా, గుజరాత్ జెయింట్స్ ఐదు మ్యాచుల్లో నాల్గో పరాజయం చవిచూసింది.

పాక్‌పై ఆసీస్ గెలుపు

వన్డే సిరీస్‌లో 1-0 ముందంజ



మెల్‌బోర్న్ : పాకిస్థాన్‌తో తొలి వన్డేలో ఆస్ట్రేలియా 2 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. 204 పరుగుల ఛేదనలో 139/6తో ఒత్తిడిలో పడిన ఆతిథ్య జట్టును కెప్టెన్ పాట్ కమిన్స్ (32 నాటౌట్, 31 బంతుల్లో 4 ఫోర్లు) ఆదుకున్నాడు. స్మిత్ (44), ఇంగ్లిశ్ (49) రాణించినా.. పాక్ పేసర్ల జోరుతో ఆసీస్ కష్టాల్లో కూరుకుంది. టెయిలెండర్ల మెరుపులతో 33.3 ఓవర్లలో ఆసీస్ 204/8 పరుగులు చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. అంతకుముందు, రిజ్వాన్ (44), బాబర్ (37), నసీం (40) రాణించటంతో తొలుత పాకిస్థాన్ 46.4 ఓవర్లలో 203 పరుగులకు కుప్పకూలింది.

వార్మప్ కుర్రాళ్లకు ఉపయుక్తం

లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్



ముంబయి : బోర్డర్-గవాస్కర్ టెస్టు ట్రోఫీలో తొలి టెస్టు ముంగిట షెడ్యూల్ చేసిన వార్మప్ మ్యాచ్‌ను టీమ్ ఇండియా రద్దు చేసుకుంది. భారత్-ఏతో వార్మప్ కంటే.. మ్యాచ్ పరిస్థితుల అనుకరణలతో సాధన మేలు చేస్తుందని కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ గౌతం గంభీర్ భావించారు. అయితే, ఆస్ట్రేలియా పర్యటనలో తొలిసారి ఆడనున్న యువ ఆటగాళ్లకు వార్మప్ మ్యాచులు మేలు చేస్తాయని లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ అన్నారు. 'వైట్‌బాల్ ఫార్మాట్‌లో స్వింగ్, స్వింగ్, స్పిన్ పెద్దగా ఉండదు. కానీ రెడ్‌బాల్ ఫార్మాట్‌లో ఇవన్నీ అధికంగా ఉంటాయి. బౌలర్ల సహనాన్ని పరీక్షించే లక్షణం బ్యాటర్‌కు ఉండాలి. బౌలర్ అలిసిపోయే వరకు ఓపికగా ఉండి ఎదురుదాడి చేయాలి. పుజార, రహానె ఇందులో దిట్ట. అందుకే ఆ ఇద్దరు ప్రస్తుత జట్టు ప్రణాళికల్లో లేరు. ఇప్పుడు జట్టులో వేగంగా ఆడే వారికే ప్రాధాన్యత. వార్మప్ మ్యాచ్‌లతో కొత్త బ్యాటర్లకు ఇక్కడి పరిస్థితుల పై మంచి అవగాహన వచ్చేందుకు ఉపయోగ పడుతుంది' అని సునీల్ గవాస్కర్ అన్నారు.

నవచిత్రం

భిన్న కాన్సెప్ట్‌తో 'ఘాటి'



అనుష్క

'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' తర్వాత అనుష్క నటిస్తున్న తాజా చిత్రం 'ఘాటి'. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. 'వేదం' తర్వాత అనుష్క, క్రిష్ కాంబినేషన్‌లో రాబోతున్న రెండవ సినిమా ఇది. ఈ సినిమా షూటింగ్ ఇంకో మూడు రోజుల్లో పూర్తవుతుంది.

యాధృచ్ఛికంగా షూటింగ్ పూర్తయ్యే రోజే అనుష్క బర్త్‌డే కావడం విశేషం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మేకర్స్ రెండు ముఖ్యమైన అప్‌డేట్‌లను అనౌన్స్ చేశారు. మూవీ ఫస్ట్ లుక్, ఏ స్పెషల్ గ్లింప్స్ ఇన్ టు ది వరల్డ్‌ని రిలీజ్ చేస్తున్నారు. టైటిల్ పోస్టర్‌లో ట్రెక్కర్లు ఘాట్‌లను నావిగేట్ చేసే బ్రీత్ టేకింగ్ సీన్ అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రంలో నటించే నటీనటులు, పనిచేసే సాంకేతిక నిపుణుల వివరాలను కూడా అనుష్క బర్త్‌డే రోజు వెల్లడించనున్నారు. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నాయి.

ఆ డెడ్ బాడీ ఎవరిది?



నిఖిల్ సిద్దార్థ్

నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. సుధీర్ వర్మ దర్శకుడు. 'స్వామి రారా, కేశవ' వంటి సూపర్ సక్సెస్‌ల తర్వాత నిఖిల్, సుధీర్ వర్మ కాంబోలో రూపొందుతున్న మూడవ చిత్రమిది.

ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన టీజర్, రెండు సాంగ్స్‌కు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

ఇందులో రిషి అనే రేసర్ పాత్రలో హీరో నిఖిల్ కనిపించనున్నారు. తనకు లవ్ స్టోరీస్ ఉంటాయి. రుక్మిణి వసంతన్‌ని డబ్బు కోసం ప్రేమించి, పెళ్లి చేసుకుంటాడు. అలాగే దివ్యాంశ కౌశిక్‌తోనూ మరో ప్రేమ కథ ఉంటుంది. రిషికి అనుకోకుండా డబ్బు అవసరమవ్వడంతో మరో పని చేయడానికి ఒప్పుకుంటాడు. దీంతో అసలు గందరగోళం ప్రారంభమవుతుంది.

ఓ చనిపోయిన వ్యక్తిని తరలించటానికి రిషి సిద్ధమైనప్పుడు ఏం జరుగుతుంది?, ఓ వైపు పోలీసులు, మరో వైపు గూండాలు అతన్ని వెంబడిస్తారు. చాలా సమస్యలు చుట్టుముడతాయి. అప్పుడు తన రేసింగ్ నైపుణ్యంతో వారి నుంచి రిషి ఎలా బయటపడ్డాడు?, ఇంతకీ రిషి ఎవరి డెడ్ బాడీని తరలించాలని అనుకున్నాడు?; అజయ్, జాన్ విజయ్.. రిషిని వెంబడించటానికి ఏ పరికరాన్ని వాడుతుంటారు? అనే విషయాలు తెలియాలంటే మాత్రం సినిమా చూడాల్సిందే అన్నట్టుగా ట్రైలర్ ఉందని చిత్ర యూనిట్ తెలిపింది.

యాక్షన్, రొమాన్స్, ఫన్ వంటి అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 8న రిలీజ్ అవుతుంది. బాపినీడు.బి సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి సంస్థపై నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్ దీన్ని నిర్మించారు.

నువ్వే కావాలయ్యా..



మాధవ్, సిమ్రాన్ శర్మ

రవితేజ తమ్ముడు రఘు తనయుడు మాధవ్ హీరోగా నటిస్తున్న సినిమా 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్ శర్మ కథానాయిక. జేజేఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీ పతాకంపై యలమంచి రాణి సమర్పణలో నిర్మాత జేజేఆర్ రవిచంద్ నిర్మిస్తున్నారు.

'పెళ్లి సందడి' దర్శకురాలు గౌరీ రోణంకి దీన్ని రూపొందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో సోమవారం మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సోషల్ మీడియా ద్వారా ఈ సినిమా నుంచి 'కావాలయ్యా..' అంటూ సాగే లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. సాంగ్ కంపోజిషన్, పిక్చరైజేషన్ చాలా బాగుందన్న ఆయన హీరో మాధవ్‌తో పాటు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ పాటను అనూప్ రూబెన్స్ మంచి బీట్‌తో కంపోజ్ చేయగా, భాస్కరభట్ల క్యాచీ లిరిక్స్ అందించారు. గాయని మంగ్లీ ఎనర్జిటిక్‌గా పాడారు. 'కళ్లల్లోకి కళ్లు పెట్టి అదోలా చూశావయ్యా, మాటల్తోనే మనసుకు మందే పెట్టావయ్యా తస్సాదియ్యా, తస్సాదియ్యా పచ్చి పచ్చిగ చెప్పాలంటే పిచ్చిగ ఫిదా అయ్యా, పూవుల్తోటి పొట్లం గట్టి మేరె దిల్ దియా, చూస్కోవయ్యా, తీస్కోవయ్యా, కావాలయ్యా, నువ్వే కావాలయ్యా...' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట అని మేకర్స్ తెలిపారు. మాధవ్, సిమ్రాన్ శర్మ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి డైలాగ్స్ - శ్యామ్, వంశీ, సినిమాటోగ్రఫీ - రామ్ రెడ్డి, ఆర్ట్ - కిరణ్ కుమార్ మన్నె, ఎడిటింగ్ - విప్లవ్ నైషధం.

'తమ్ముడు'గా నితిన్



నితిన్

నితిన్ హీరోగా, శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తమ్ముడు'. ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది.

సోమవారం ఈ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్‌మెంట్ చేశారు మేకర్స్.

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నారు.

ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ అందరిలోనూ క్యూరియాసిటీని కలిగిస్తోంది.

ఈ చిత్రంలో లయ కీలక పాత్రను పోషిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో నిర్మితమవుతున్న 56వ చిత్రమిది. ఈ సంస్థతో హీరో నితిన్, దర్శకుడు శ్రీరామ్ వేణుకు మంచి అనుబంధం ఉంది. హీరో నితిన్ దిల్, శ్రీనివాస కళ్యాణం వంటి సినిమాలు చేయగా, దర్శకుడు శ్రీరామ్ వేణు ఎంసీఏ, వకీల్ సాబ్ వంటి సూపర్ హిట్ చిత్రాలు రూపొందించారు. ఇప్పుడు ఈ ముగ్గురి కాంబినేషన్‌లో ఈ సినిమా రిలీజ్‌కు వస్తుండటం సినీ ప్రియుల దృష్టిని మరింతగా ఆకర్షిస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - కేవీ గుహన్, ఎడిటింగ్ - ప్రవీణ్ పూడి, మ్యూజిక్ - అజనీష్ లోకనాథ్, నిర్మాత - దిల్ రాజు, శిరీష్, రచన -దర్శకత్వం - శ్రీరామ్ వేణు.

ఫీల్ గుడ్ సినిమా



హెబ్బా పటేల్

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటించిన సినిమా 'ధూం ధాం'. ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. సాయి కిషోర్ మచ్చా దర్శకుడు. ఈ నెల 8న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో సోమవారం నాయిక హెబ్బా పటేల్ మీడియాతో ముచ్చటించింది. 'డైరెక్టర్ సాయి కిషోర్ చెప్పిన కథ చాలా బాగుంది. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. ఇలాంటి సినిమా నేను చేసి చాలా కాలమవుతోంది. నాకు రీఫ్రెషింగ్‌గా ఉంటుందని అనిపించి ఓకే చెప్పాను. ఇందులో నా క్యారెక్టర్ పేరు సుహానా. తనొక బబ్లీ గర్ల్. బాగా డబ్బున్న అమ్మాయి. ఇంట్లో ఇచ్చిన ఫ్రీడమ్ వల్ల తను కోరుకున్న వెకేషన్లకు వెళ్తుంటుంది. అలా ఒక వెకేషన్‌లో హీరోను కలుస్తుంది. అక్కడి నుంచి వారి స్నేహం, ప్రేమ మొదలవుతాయి. గోపీ సుందర్ కంపోజ్ చేసిన సాంగ్స్ ఛాట్ బస్టర్స్ అయ్యాయి. ఈ సినిమాలో చాలా మంది పేరున్న ఆర్టిస్టులు ఉన్నారు. ఫ్యామిలీ ఎమోషన్స్, లవ్, ఎంటర్‌టైన్‌మెంట్‌తో సినిమా మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. మంచి ఫీల్ గుడ్ చిత్రమిది'.

క్రేజీ కాంబినేషన్‌లో 'భైరవం'



బెల్లంకొండ సాయి శ్రీనివాస్

టాలీవుడ్‌లో రూపొందుతున్న మరో మల్టీస్టారర్ సినిమా 'భైరవం'. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ఈ సినిమాలో స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు.

సోమవారం ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ని రిలీజ్ చేశారు. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో కనిపిస్తారని ఫస్ట్‌లుక్ పోస్టర్ సూచించింది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కెకె రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతిలాల్ గడ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.

నియో-నోయిర్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రముఖ తారాగణం, సాంకేతిక సిబ్బంది ఉన్నారు.

మనోజ్ మంచు, నారా రోహిత్ ఫస్ట్ లుక్ పోస్టర్లు కూడా ఒకదాని తర్వాత ఒకటి త్వరలో విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు.

ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే -దర్శకత్వం: విజయ్ కనకమేడల, సినిమాటోగ్రాఫర్: హరి కె వేదాంతం, ప్రొడక్షన్ డిజైనర్: బ్రహ్మ కడలి, ఎడిటర్: చోటా కె ప్రసాద్, సంగీతం: శ్రీ చరణ్ పాకాల, డైలాగ్స్: సత్యర్షి, తూమ్ వెంకట్.

దేవుడినే ఆడించే మనిషి కథ



సతీష్‌బాబు

'ఇంత వరకు ఎవ్వరూ టచ్ చేయని పాయింట్‌తో రగ్డ్‌గా, ఇంటెన్స్ డ్రామాతో 'జాతర' తెరకెక్కింది. చిత్తూరు జిల్లా బ్యాక్‌డ్రాప్‌లో జరిగే జాతర నేపథ్యంలో సాగే సినిమా ఇది' అని హీరో, దర్శకుడు సతీష్‌బాబు రాటకొండ చెప్పారు.

ఆయన హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన సినిమా 'జాతర'. దీయా రాజ్ హీరోయిన్. గల్లా మంజునాథ్ సమర్పణలో మూవీటెక్ ఎల్ఎల్‌సితో కలిసి రాధాకృష్ణ ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 8న థియేటర్స్‌లోకి రాబోతోంది.

ఈ నేపథ్యంలో హీరో, దర్శకుడు సతీష్ బాబు రాటకొండ సోమవారం మీడియాతో మాట్లాడుతూ, 'చిత్తూరు జిల్లా మదనపల్లె పరిసర గ్రామాల్లో ఓ అమ్మవారి గుడి ఉంది.. చుట్టుపక్కల 18 ఊళ్ల ప్రజలు ఈ గుడికి వచ్చి అమ్మవారిని కొలుస్తారు. ఆ అమ్మవారి గురించి తీసిన చిత్రమే ఇది. దేవుడు మనుషులను బొమ్మలుగా చేసి జగన్నాటకం ఆడిస్తాడని మన పురాణాల్లో చెబుతుంటారు. ఇందుకు భిన్నంగా ఒక మనిషి దేవుడిని పితలాటకం ఆడిస్తుంటాడు. ఆ పితలాటకం నుంచి అమ్మవారిని హీరో ఎలా రక్షిస్తాడు అనేది ఈ చిత్ర మూల కథాంశం. మనిషి రాక్షసుడై అమ్మవారిని చెరపడితే మరో నరుడు హరుడై ఆ రాక్షసుడిని ఎలా సంహరించాడు అనేది మా చిత్రంలో చూపిస్తున్నాం. వాస్తవ ఘటనలకు ఫిక్షన్ యాడ్ చేసి రూపొందించాను. హీరో క్యారెక్టర్ మూడు కోణాల్లో ఉంటుంది. అలాగే ఈ సినిమాలో ఓ మంచి ప్రేమ కథ కూడా ఉంది. మనం జంధ్యాల సినిమాల్లో విన్నట్లు విలేజ్‌లో వినిపించే సహజమైన సౌండ్స్ తరహాలో ఈ చిత్రంలో సౌండ్ డిజైనింగ్ చేయించాం. ప్రొడ్యూసర్స్ రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. యూఎస్, యూకేలో ఫిలింస్‌కు వర్క్ చేసే మూవీ టెక్ అనే కంపెనీ ప్రొడక్షన్‌లో ఎంతో సపోర్ట్ చేసింది' అని చెప్పారు.

అదే 'లక్కీభాస్కర్' ప్రత్యేకత..



దుల్కర్ సల్మాన్

'నేను ఎప్పటినుంచో వాస్తవానికి దగ్గరగా ఉండే ఒక మధ్యతరగతి తండ్రి పాత్ర చేయాలని అనుకుంటున్నాను. అది 'లక్కీభాస్కర్' సినిమాతో నెరవేరింది' అని హీరో దుల్కర్ సల్మాన్ చెప్పారు.

'మహానటి', సీతారామం' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత ఆయన నటించిన చిత్రం 'లక్కీభాస్కర్'. ఇటీవల విడుదలైన ఈ సినిమాకి సర్వత్రా మంచి స్పందన లభించింది. ఈ నేపథ్యంలో సోమవారం హీరో దుల్కర్‌సల్మాన్ మీడియాతో మాట్లాడుతూ, 'దర్శకుడు వెంకీ కథ చెప్పినప్పుడు బ్యాంకింగ్ నేపథ్యాన్ని తీసుకొని మధ్యతరగతి కుటుంబ కథగా చెప్పడం కొత్తగా అనిపించింది. నా దృష్టిలో ఇది వాస్తవ కథ. ఇదే ఈ సినిమా ప్రత్యేకత. నా పాత్రలో నెగటివ్ షేడ్స్ ఉన్నాయి. ఇలాంటి పాత్రలు చేసినప్పుడే సంతృప్తి లభిస్తుంది. తెలుగులో 'ఆకాశంలో ఒక తార' సినిమా చేస్తున్నాను' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

దలాల్ స్ట్రీట్‌పై బేర్ పంజా

- సెన్సెక్స్ 942 పాయింట్ల పతనం
- రూ.6 లక్షల కోట్ల సంపద ఆవిరి
- రిలయన్స్, బ్యాంకింగ్ షేర్ల దిగాలు
- అమెరికా ఎన్నికల ప్రభావం
- ఆల్‌టైం కనిష్టానికి రూపాయి



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు మరోమారు కుప్పకూలాయి. రెండు రోజుల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో మదుపర్లు ముందస్తు అప్రమత్తతో అమ్మకాలకు మొగ్గు చూపారు. దీంతో సోమవారం ఒక్క పూటలోనే బిఎస్‌ఇ సెన్సెక్స్ 942 పాయింట్లు పతనమై.. మూడు నెలల కనిష్టానికి పడిపోగా.. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 1 శాతం క్షీణించి 24,000 పాయింట్ల దిగువకు జారింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు వెల్లువ చోటు చేసుకుంది. ఉదయం స్వల్ప నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. క్రమంగా భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఈ క్రమంలోనే బిఎస్ఇ సెన్సెక్స్ 941.88 పాయింట్లు లేదా 1.18 శాతం క్షీణించి 78,782కు దిగజారింది. ఇది ఆగస్టు 6 నాటి కనిష్ట స్థాయి. కాగా.. ఇంట్రాడేలో ఏకంగా 1,491 పాయింట్లు కోల్పోయి.. 78,232.60 కనిష్ట స్థాయిని తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 309 పాయింట్ల నష్టంతో 23,995 వద్ద ముగిసింది.

ప్రధాన కారణాలు..

అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 5న జరగనున్నాయి. దీంతో మదుపర్లు ముందు జాగ్రత్తగా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లపై ఇదే ప్రభావం చూపించింది. మరోవైపు ఈ నెల 7న ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు వెలువడనున్నాయి. భౌగోళికంగా ఇజ్రాయెల్–ఇరాన్‌ల మధ్య ఘర్షణ వాతావరణం మరింత ముదురుతున్న సంకేతాలతో చమురు ధర 2 శాతం మేర పెరిగి 75 డాలర్లకు చేరడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురి చేస్తోంది. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.11 ఆల్‌టైం కనిష్టానికి పడిపోయింది. 2024 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు నిరాశజనకంగా ఉండటంతో వృద్ధిపై అనుమానాలు పెరిగాయి. విదేశీ పోర్టుఫోలియో మదుపరులు భారీగా పెట్టుబడులను తరలించుకుపోవడం దలాల్ స్ట్రీట్‌పై మరింత ఒత్తిడిని పెంచింది. అక్టోబర్‌లో రూ.1,13,858 కోట్ల ఎఫ్ఐఐలు తరలిపోయాయి.

మారుతి సుజుకి ఉత్పత్తి పతనం

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి ఉత్పత్తి భారీగా పడిపోయింది. పండుగ సీజన్‌లోనూ డిమాండ్ లేమితో అక్టోబర్‌లో ఆ కంపెనీ ఉత్పత్తిని 16 శాతం తగ్గించుకుంది. దీంతో గడిచిన నెలలో ప్యాసింజర్ కార్ల ఉత్పత్తి 89,174 యూనిట్లకు పడిపోయింది. గతేడాది ఇదే నెలలో 1,06,190 యూనిట్లను తయారు చేసింది.

మారుతి కొత్త డిజైర్‌కు బుకింగ్స్ షురూ..

మారుతి సుజుకి తన కొత్తగా నాలుగో జనరేషన్ డిజైర్ డిజైర్‌కు బుకింగ్స్‌ను తెరుస్తున్నట్లు ప్రకటించింది. నవంబర్ 11 నుంచి ఈ కారును రూ.11,000తో బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొంది. మారుతి టాప్ 10 అమ్మకాల్లో డిజైర్ ఒక్కటిగా ఉంది. 1.2 లీటర్ త్రి సిలిండర్ పెట్రోల్ ఇంజిన్ కలిగి ఉంది. ఇందులో సిఎన్‌జి వేరియంట్‌ను తెచ్చే యోచనలోనూ ఆ కంపెనీ ఉంది.

గ్లోబల్ మార్కెట్లోకి పోసిడెక్స్ టెక్నాలజీస్

- కొత్త లోగోను ఆవిష్కరించిన పివి సింధు



హైదరాబాద్ : భారత్‌లో కస్టమర్ మాస్టర్ డేటా మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్‌ను అందించే ప్రముఖ ప్రొవైడర్ పోసిడెక్స్ టెక్నాలజీస్ ఇక గ్లోబల్ మార్కెట్‌లోకి విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం వ్యూహాత్మక రీబ్రాండింగ్, ప్రణాళికలు చేపడుతున్నట్లు వెల్లడించింది. సోమవారం హైదరాబాద్‌లో పోసిడెక్స్ టెక్నాలజీ నూతన లోగోను పివి సింధు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోసిడెక్స్ టెక్నాలజీస్ సహ వ్యవస్థాపకులు, సిఇఒ కె వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. సంక్లిష్టమైన డేటా సవాళ్లను, డిమాండ్‌లను నిర్వహించడంలో తమ అపారమైన అనుభవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గ్లోబల్ మార్కెట్లోకి ప్రవేశించడంపై తాము గర్వపడు తున్నామన్నారు. అంతర్జాతీయ సంస్థలకు తమ డేటా సెక్యూర్డ్, క్లౌడ్ ఉత్పత్తులను అందించనున్నామన్నారు. ప్రస్తుతం పోసిడెక్స్ దేశంలోని ఏడు బ్యాంక్‌లకు, తొమ్మిది ప్రముఖ ఎన్‌బిఎఫ్‌సిలకు సేవలందిస్తుందన్నారు. ఈ విజయం ఆధారంగా అమెరికా, దుబాయ్, సింగపూర్, థాయిలాండ్, ఫిలిప్పీన్స్‌లో క్రియాశీల మార్కెట్లపైన దృష్టి సారిస్తున్నామన్నారు. తమ నూతన బ్రాండ్ దృశ్యపరమైన మార్పు మాత్రమే కాదని.. తమ ఆవిష్కరణలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలనేది లక్ష్యమని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దత్తా గౌరవెల్లి పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు క్యూటిస్ ఇంటర్నేషనల్ విస్తరణ

హైదరాబాద్ : నగరంలో తమ కార్యకలాపాలను ప్రారంభించినట్లు యుఎఇ కేంద్రంగా పని చేస్తోన్న క్యూటిస్ ఇంటర్నేషనల్ ప్రకటించింది. భారత్‌లో ఇది తమకు ఎనిమిదవ క్లినిక్ అని ఆ గ్రూప్ వ్యవస్థాపకుడు అండ్ ఛైర్మన్ డాక్టర్ షాజీర్ మాచించేరీ తెలిపారు. ఈ క్లినిక్‌ను డిసిపి ట్రాఫిక్ రాహుల్ హెగ్డే, నటీ తేజా, షాజీర్ ప్రారంభించారు. అధునాతన హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, కాస్మెటిక్ ట్రీట్‌మెంట్లలో తమ సంస్థ అంతర్జాతీయ స్థాయి సేవలను అందిస్తుందని షాజీర్ పేర్కొన్నారు. ఈ యూనిట్ తమ వృద్ధిలో పెద్ద పాత్ర పోషిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ విస్తరణ ప్రణాళికలను సిఇఒ కె జయన్ వెల్లడించారు.

పావ్న ఇండస్ట్రీస్ పెరిగిన అమ్మకాలు

హైదరాబాద్ : ఆటోమొటివ్ విడిభాగాల తయారీ సంస్థ పావ్న ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో 9.94 శాతం వృద్ధితో రూ.83.73 కోట్ల నికర అమ్మకాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.76.16 కోట్ల అమ్మకాలు నమోదు చేసింది. ఇదే సమయంలో కంపెనీ నికర లాభాలు రూ.2.62 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ2లో 4.59 శాతం పెరిగి రూ.2.74 కోట్లకు చేరాయి.

వినూత్న సోలార్ సొల్యూషన్స్‌లోకి సర్వోటెక్ పవర్

హైదరాబాద్ : పునరుత్పాదక ఇంధన పరిష్కారాలను అందించే సర్వోటెక్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్ కొత్తగా వినూత్న సోలార్ సొల్యూషన్స్‌లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. సోలార్ ఆన్ గ్రిడ్ ఇన్‌వర్టర్లు, సోలార్ హైబ్రిడ్ ఇన్వర్టర్లు, సోలార్ మైక్రో ఇన్వర్టర్లు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లు తదితర వినూత్న సర్వీసులను అందిస్తున్నట్లు వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ పథకాలైన పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన, నివాస, వాణిజ్య పైకప్పుల కోసం పిఎం కుసుమ్ స్కీమ్‌లకు అనుగుణంగా పరిష్కారాల మద్దతును ఇవ్వనుందని ఆ సంస్థ ఫౌండర్, ఎండి రామన్ భాటియా తెలిపారు. ఈ అత్యాధునిక పరిష్కారాలు స్వచ్ఛమైన ఇంధనం కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చనున్నాయన్నారు.

సామ్‌సంగ్ 'సీడ్' ల్యాబ్ ఏర్పాటు

బెంగళూరు : సామ్‌సంగ్ ఆర్అండ్‌డి ఇన్స్‌ట్యూట్ ఇండియా బెంగళూరులోని గార్డెన్ సిటీ యూనివర్శిటీ (జిసియు)తో కలిసి సామ్‌సంగ్ స్టూడెంట్ ఎకోసిస్టమ్ ఫర్ ఇంజినీర్డ్ డేటా (సీడ్) ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. విద్యార్థులు, అధ్యాపకులకు ఎఐ, ఎంఎల్, డేటా ఇంజనీరింగ్ ప్రపంచంలోకి ప్రవేశించడానికి ఇది అద్భుతమైన నైపుణ్యాలను నేర్పిస్తుందని పేర్కొంది. తమ సంస్థ ఇప్పటికే దేశంలో నాలుగు సీడ్ ల్యాబ్‌లతో పలు ప్రాజెక్టుల్లో 400 పైగా విద్యార్థులకు అభ్యాసనాలు అందిస్తుందని తెలిపింది.

పాలస్తీనా శరణార్ధుల సంస్థతో సంబంధాలు తెగతెంపులు

- ప్రకటించిన ఇజ్రాయిల్
- గాజాను కరువు కాటకాల్లోకి నెట్టడమే లక్ష్యం?
- గాజాలో 33, లెబనాన్‌లో నలుగురు మృతి
- వెస్ట్ బ్యాంక్‌లో పెరుగుతున్న సెటిలర్ల నేరాలు



గాజా, బీరుట్, జెరూసలేం : పాలస్తీనా శరణార్ధుల కోసం పనిచేసే ఐక్యరాజ్య సమితి సంస్థ (యుఎన్ఆర్‌డబ్ల్యుఎ)తో సంబంధాలు తెగతెంపులు చేసుకుంటున్నట్లు ఇజ్రాయల్ ఐక్యరాజ్య సమితికి సోమవారం తెలియజేసింది. ఆ సంస్థను నిషేధించాలంటూ ఇజ్రాయిల్ ఎంపీలు ఓటు వేసిన అనంతరం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. విదేశాంగ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ ఆదేశాల మేరకు, యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎతో ఇజ్రాయిల్‌కు గల ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు తెలియచేశామని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. గతేడాది అక్టోబరు 7నాటి దాడుల్లో యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ ఉద్యోగులు పాల్గొన్నారని, చాలామంది హమాస్ కార్యకర్తలుగా పనిచేస్తున్నారని కట్జ్ పేర్కొన్నారు. గాజా సమస్యలోనే యుఎన్ఆర్‌డబ్ల్యుఎ ఒక భాగంగా వుందని వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్‌లో, ఆక్రమిత తూర్పు జెరూసలేంలో ఈ సంస్థ కార్యకలాపాలు నిలిపివేయడానికి గత నెల్లో ఇజ్రాయిల్ పార్లమెంట్ ఆమోదించింది. మిత్రపక్షమైన అమెరికాతో సహా అంతర్జాతీయ సమాజం ఈ చర్యను ఖండించినా పట్టించుకోలేదు. ఇప్పటికి ఏడు దశాబ్దాలకు పైగా ఈ సంస్థ ప్రపంచంలో ఎక్కడున్నా పాలస్తీనా శరణార్ధులకు, అలాగే పాలస్తీనా భూభాగాల్లోని ప్రజలకు కీలకమైన సాయాన్ని అందచేస్తూ వస్తోంది. తాజా నిర్ణయంతో గాజాలో మానవతా సాయానికి పెద్ద ఎదురు దెబ్బ అవుతుంది. ఇజ్రాయిల్ దాడుల్లో బతికి బట్టకట్టిన వారిని కరువు కాటకాలతో హతమార్చడమే లక్ష్యంగా వున్నట్లు ఈ చర్యతో స్పష్టమవుతోంది. దాదాపు గత నెలరోజులుగా ఇజ్రాయిల్ ఆర్మీ దిగ్బంధనంలో వున్న ఉత్తర గాజాలో పరిస్థితులు దయనీయంగా వున్నాయని, తక్షణమే అక్కడి వారికి సహాయం అందేలా చూడాల్సి వుందని జర్మనీ, ఇజ్రాయిల్‌ను కోరింది. అంతర్జాతీయ చట్టాల ప్రకారం తన బాధ్యతలను ఇజ్రాయిల్ అత్యవసరంగా నిర్వర్తించాల్సిన అవసరం వుందని జర్మనీ విదేశాంగ శాఖ పేర్కొంది. ఉత్తర గాజాలోని ఆస్పత్రులన్నీ కూడా మూతపడ్డాయని, సేవలందించే పరిస్థితుల్లో ఏవీ లేవని ప్రభుత్వం పేర్కొంది. గాజాలో విచ్చల విడిగా కొనసాగుతున్న ఊచకోత దాడులను ఆపడంలో అంతర్జాతీయ సమాజం విఫలం చెందడం వల్లనే ఆక్రమిత వెస్ట్ బ్యాంక్ వ్యాప్తంగా సెటిలర్ల నేరాలు పెరుగుతున్నాయని పాలస్తీనా విదేశాంగ శాఖ పేర్కొంది. ఎల్ బిరే నగరంలో సెటిలర్లు దాడులు జరిపి పాలస్తీనియన్ల వాహనాలు అనేకం తగలబెట్టారని వార్తలు వచ్చిన నేపథ్యంలో పాలస్తీనా ప్రకటన వెలువడింది. ఇజ్రాయిల్ రాజకీయ నేతల నుండి హామీలు, రక్షణ లేకపోతే సెటిలర్లు ఇంతటి హేయమైన నేరాలకు పాల్పడలేరని పేర్కొంది. ఇందుకు బాధ్యులైన సంస్థలు, వ్యక్తులపై సమగ్రంగా చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరింది.

గాజాలో 33మంది మృతి

గత 24గంటల్లో గాజాలో జరిగిన దాడుల్లో 33 మంది మరణించారని, 156మంది గాయపడ్డారని ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. సెంట్రల్ గాజాలోని నుస్రత్ శరణార్థ శిబిరంపై, వ్యవసాయ భూముల్లో, నివాస భవనాలపై పలు వైమానిక దాడులు జరిగాయి. గాజాలో మానవతా సాయం సంక్షోభం త్వరలోనే తీవ్రమైన కరువు కాటకాలుగా పెచ్చరిల్లే ప్రమాదముందని ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి) హెచ్చరించింది. దీంతో గాజాలో మృతుల సంఖ్య 43,374కి చేరగా, గాయపడిన వారి సంఖ్య 1,02,261కి చేరింది. గాజాలో పోలియో వ్యాక్సినేషన్ శిబిరాలపై తాము దాడి చేశామనడాన్ని ఇజ్రాయిల్ మిలటరీ ఖండించింది. షేక్ రాడ్వాన్ క్లినిక్‌పై ఇజ్రాయిల్ దాడి జరిగిందని, అక్కడకు తమ పిల్లలకు వ్యాక్సిన్ వేయించడానికి వచ్చిన తల్లిదండ్రులతో రద్దీగా వుండగా జరిగిన దాడిలో నలుగురు పిల్లలు గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు. కీలకమైనటువంటి మానవతా సాయం అందే ఇటువంటి ప్రాంతాలను దాడుల నుండి మినహాయించాలని డబ్ల్యుహెచ్‌ఓ సెక్రటరీ జనరల్ టెడ్రోస్ అదనామ్ గెబ్రెయెసెస్ కోరారు.

లెబనాన్‌లో నలుగురు మృతి

బెకా లోయలోని మచ్‌ఘరా పట్టణంలో గత రాత్రి జరిగిన దాడిలో నలుగురు మరణించగా, అనేకమంది గాయపడ్డారు. తూర్పు బాల్‌బెక్, దక్షిణ టెబ్‌నిన్ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్పత్రులపై ఇజ్రాయిల్ ఆర్మీ దాడులు జరిపింది. మొత్తంగా 10మంది గాయపడ్డారు. దక్షిణ లెబనాన్‌లోని బారాచిత్ ఏరియాలో హిజ్బుల్లా కమాండర్‌ను హతమార్చామని మిలటరీ ప్రకటించింది.

కేరళ జర్నలిస్టు సిద్దికి కప్పన్‌కు భారీ ఉపశమనం

- యూపీ పోలీస్‌స్టేషన్‌కు ప్రతీవారం రిపోర్టు అవసరం లేదన్న సుప్రీం



న్యూఢిల్లీ : కేరళ జర్నలిస్టు సిద్దికి కప్పన్‌కు సుప్రీంకోర్టు సోమవారం భారీ ఉపశమనం కలిగించింది. ఉత్తరప్రదేశ్‌లోని పోలీస్‌స్టేషన్‌కు ప్రతీ సోమవారం సిద్దికి కప్పన్ హాజరై రిపోర్టు చేయవల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. గతంలో ఇచ్చిన బెయిల్ షరతులను సుప్రీంకోర్టు తాజాగా సవరించింది. ఈ మేరకు జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ సందీప్ మెహతలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. బెయిల్ షరతుల్లో ఉపశమనం కలిగించాలని సిద్దికి కప్పన్ దాఖలు చేసిన పిటీషన్‌ను విచారించిన ధర్మాసనం '2022 సెప్టెంబర్ 9వ తేదీన ఇచ్చిన ఉత్వర్తులను మార్పు చేస్తున్నాం. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిటీషనర్ ప్రతీవారం రిపోర్టు చేయనవసరం లేదు. పిటీషనర్ ఇతర అభ్యర్థనలు కూడా మన్నించబడతాయి' అని తీర్పులో పేర్కొంది.

ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో జరిగిన దారుణ హత్యాచార ఘటనను రిపోర్ట్ చేయడానికి వెళుతున్న సిద్దికి కప్పన్‌ను 2020 అక్టోబర్‌లో ఆ రాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. హత్రాస్‌లో కుట్రకు పాల్పడుతున్నాడంటూ అసత్య ఆరోపణలతో అదుపులోకి తీసుకుని ఉపా చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో దాదాపు రెండేళ్ల తరువాత 2022 సెప్టెంబరులో సిద్దికి కప్పన్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే ప్రతీ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేయాలని, అక్కడ ఉన్న రిజిస్టర్‌లో సంతకం చేయాలని షరతు విధించింది. ఈ షరతు నుంచి ఉపశమనం కలిగించాలని సిద్దికి కప్పన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాగా, తనపై మోపిన ఉపా, దేశద్రోహం, మనీలాండరింగ్, కుట్ర వంటి అభియోగాల గురించి కప్పన్ గతంలో మాట్లాడుతూ 'హత్రాస్ కేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తన వైఫల్యాన్ని దాచుకోవడానికి నన్ను జైల్లో పెట్టింది' అని తెలిపారు. 'ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అవమానం నుంచి తప్పించుకోవడానికి నన్ను బలిపశువుగా చేసింది. అలాగే, సామూహిక అత్యాచారం, హత్య అనే భయంకరమైన సంఘటనకు మతం రంగు పులమడానికి ప్రయత్నించింది' అని అన్నారు. తనపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మోపిన ఆరోపణలన్నీ నిరాధారమైనవి అన్ని చెప్పారు.

అక్రమ వలసలు, చొరబాట్లపై జార్ఖండ్ హైకోర్టు ఆదేశాలు

- సవాలు పిటిషన్ విచారణకు సుప్రీం అంగీకారం

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ నుండి రాష్ట్రంలోకి అక్రమంగా వలసలు జరుగుతున్నాయన్న ఆరోపణలను పరిశీలించేందుకు నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేయాలంటూ జార్ఖండ్ హైకోర్టు జారీ చేసిన తాత్కాలిక ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీం కోర్టు సోమవారం అంగీకరించింది. సెప్టెంబరులో హైకోర్టు జారీ చేసిన ఆదేశాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అఫిడవిట్ ఆధారంగా ఇచ్చినవి. చొరబాట్లు జరిగినట్లు అంచనా వేయబడిందని ఆ అఫిడవిట్ పేర్కొంది. అయితే కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవాలు చేసింది. ఆ నిర్ధారణకు తగినట్లుగా డేటా లేదని పేర్కొంది. దీనిపై శుక్రవారం విచారణ జరిపేందుకు జస్టిస్ సుధాంశు దూలియా, జస్టిస్ అహసనుద్దీన్ అమనుల్లాలతో కూడిన బెంచ్ నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీల్ తీవ్రమైనదని, ఫైళ్ళన్నింటినీ జాగ్రత్తగా సరిచూసుకోవడానికి బెంచ్‌కు కొంత సమయం అవసరమని జస్టిస్ దూలియా వ్యాఖ్యానించారు. అయితే హైకోర్టు జోక్యాన్ని జస్టిస్ అమనుల్లా ప్రశ్నించారు. ఒకవేళ ఏదైనా సమస్య వుంటే దాన్ని ఎదుర్కొనడానికి రాష్ట్రానికి స్వతంత్ర అధికారాలు వున్నాయని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, న్యాయవాది జయంత్ మోహన్‌లు కోరారు. జార్ఖండ్ సరిహద్దు రాష్ట్రం కూడా కాదని, కానీ కోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రసంగాల్లో ఒక అంశంగా మారిపోయిందని సిబల్ పేర్కొన్నారు. ఒకవేళ ఏదైనా హైకోర్టు ఆదేశాల జారీ వెనుక స్పష్టమైన డేటా వుంటే వెంటనే దాన్ని అందచేయాల్సిందిగా కోరారు.

ఓటుకు నోటు కేసు విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ

మరో ధర్మాసనానికి కేసు విచారణ బదిలీ

నవతెలంగాణ–న్యూఢిల్లీ బ్యూరో



ఓటుకు నోటు కేసును విచారిస్తోన్న జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ సుప్రీంకోర్టు ధర్మాసనం నుంచి తప్పుకున్నారు. ఈ కేసు నుంచి తనను తప్పించాలని జెరూసలేం మత్తయ్య రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న తెలంగాణ హైకోర్టు కేసు నుంచి జెరూసలేం మత్తయ్య పేరును క్వాష్ (తొలగించడం) చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ 2016 జులై 6న తెలంగాణ స్టేట్ యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) సుప్రీంకోర్టుకు పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. అయితే.. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సీజేఐగా తాను గతంలో పనిచేశానని, అందువల్ల ఈ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్టు జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో మరో ధర్మాసనం ఎదుట ఈ కేసు విచారణ చేపట్టనున్నట్టు ధర్మాసనం తెలిపింది. మరోవైపు అమికస్ క్యూరీ స్థానంలో మత్తయ్య మరో న్యాయవాదిని నియమించు కున్నారు. విచారణ సందర్భంగా ఈ విషయాన్ని మత్తయ్య తరపు న్యాయవాది ధర్మాసనానికి నివేదించారు.

కెనడాలో హిందూ ఆలయానికి వచ్చిన వారిపై ఖలిస్తాన్ వేర్పాటువాదుల దాడి

- దాడిని ఖండించిన కెనడా ప్రధాని
- భారత్ వ్యతిరేక శక్తుల పనే ఇది : తీవ్రంగా స్పందించిన భారత హై కమిషన్

ఒట్టావా : కెనడాలోని బ్రాంప్టన్‌లో హిందూ దేవాలయానికి వచ్చిన వారిపై ఖలిస్తాన్ వేర్పాటువాదులు ఆదివారం దాడి చేశారు. దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఖలిస్తానీ జెండాను పట్టుకున్న వ్యక్తులు ఆలయానికి వచ్చిన వారిపై దాడి చేయడం ఆ వీడియోలో కనిపిస్తోంది. ఈ ఘటనను కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడే ఖండించారు. బ్రాంప్టన్‌లోని హిందూ సభ మందిర్ వద్ద చోటు చేసుకున్న ఈ హింసాత్మక ఘర్షణలు ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రతి వ్యక్తికీ తమ మత విశ్వాసాన్ని స్వేచ్ఛగా ఆచరించే హక్కు ఉందని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. భారత్, కెనడా మధ్య దౌత్య సంబంధాలు క్షీణించిన తరుణంలో ఇలాంటి దాడి జరగడం గమనార్హం.టొరంటోకు వాయవ్యంగా 50 కి.మీ దూరంలో గల బ్రాంప్టన్‌లో ఆదివారం హిందూ సభా మందిర్‌లోని భక్తులపై కొందరు సిక్కు వేర్పాటువాదులు దాడి చేయడంతో ఆలయం వద్ద భారీగా భద్రతా దళాలను మోహరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఎవరినీ అరెస్ట్ చేయలేదని పీల్ ప్రాంతీయ పోలీసు ప్రతినిధి పేర్కొన్నారు. ఈ హింసాత్మక ఘటనకు గల కారణాలను వారు వెల్లడించలేదు. ఖలిస్తాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందని కెనడా ఆరోపించిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి.

భారత్ వ్యతిరేక శక్తుల పనే ఇది

ఈ తరుణంలో జరిగిన ఈ దాడిపై భారత హై కమిషన్ తీవ్రంగా స్పందించింది. భారత్ వ్యతిరేక శక్తుల పనే ఇదని వ్యాఖ్యానించింది.

అటోగిరో ప్రమాదంలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ జనరల్ మృతి

టెహరాన్ : పాకిస్తానీ సరిహద్దుకు సమీపంలో మిలటరీ ఆపరేషన్ సందర్భంగా జరిగిన అటోగిరో ప్రమాదంలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్, పైలట్ సోమవారం మరణించారు. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ఈ మేరకు వార్తను ప్రసారం చేసింది. బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో సిర్కాన్ సరిహద్దు ఏరియాలో సైనిక విన్యాసాలు జరుగుతుండగా చోటు చేసుకున్న ప్రమాదంలో జనరల్ హమిద్ మజందరాని మరణించారని తస్నిమ్ వార్తా సంస్థ కూడా పేర్కొంది. రోటోర్ డిజైన్‌లో హెలికాప్టర్‌ను పోలివుండే ఆటోగిరో చాలా చిన్నగా వుండి, సులభంగా పనిచేస్తుంది. దీన్ని ఇరాన్‌లో పైలట్ శిక్షణా కార్యకలాపాల్లో ఉపయోగిస్తారు. అలాగే సరిహద్దుల పర్యవేక్షణలో కూడా వాడతారు. దీంట్లో ఇద్దరు ప్రయాణించవచ్చు.

ఇండోనేషియాలో బద్దలైన జంట అగ్ని పర్వతాలు

- 10మంది మృతి, తగలబడిన ఇండ్లు

ఈస్ట్ ఫ్లోర్స్ (ఇండోనేషియా) : తూర్పు ఇండోనేషియాలోని అగ్నిపర్వతం ఆదివారం రాత్రి విస్ఫోటనం చెందింది. ఈ ఘటనలో వెదజల్లిన బూడిద, వెలువడిన లావా చుట్టపక్కల గ్రామాలను కమ్మేసింది. 10మంది మరణించగా, పలువురు గాయపడ్డారని, పెద్ద సంఖ్యలో ఇళ్ళు దగ్ధమయ్యాయని అధికారులు సోమవారం తెలిపారు. అత్యున్న స్థాయిలో ప్రమాద హెచ్చరికలను జారీ చేశారు. ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతం ఫ్లోర్స్ దీవిలో గల జంట అగ్నిపర్వతాలు మౌంట్ లూటొబి లాకి–లాకి లు గత అర్ధరాత్రికి కాస్త ముందుగా బద్దలయ్యాయి. దీంతో అధికారులు అనేక గ్రామాల నుండి ప్రజలను ఖాళీ చేయించారు. అగ్ని పర్వతం బద్దలైన ధాటికి పడిన ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున బీటలు వారిందని, పెద్ద పెద్ద రాళ్ళు తమ ఇళ్లపైకి అతి వేగంతో వస్తుండడం చూసి తీవ్ర భయభ్రాంతులైనట్లు ప్రజలు తెలిపారు. రాత్రివేళలో నిద్ర పోతున్న సమయంలో జరగడంతో ప్రజలు అయోమయంలో,గందరగోళంతో బయటకు పరుగులు తీశారు. ఎక్కడ చూసినా బూడిద, రాళ్ళు రప్పలేనని తెలిపారు. దాదాపు 10వేలమందికి పైగా ప్రజలు దీని బారిన పడ్డారని దేశ విపత్తుల నిర్వహణా సంస్థ ప్రతినిధి అబ్దుల్ ముహారి తెలిపారు.

కృష్ణా ప్రాజెక్ట్‌పై విచారణ వాయిదా

తెలంగాణ, ఏపీ పిటిషన్లను కలిపి విచారించనున్న సుప్రీం ధర్మాసనం

నవతెలంగాణ–న్యూఢిల్లీ బ్యూరో



కృష్ణా ప్రాజెక్టుల పరిధిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ ఈనెల 7కు వాయిదా పడింది. కృష్ణా బేసిన్‌పై ఉన్న నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబీ) పరిధిలోకి తెస్తూ 2021లో కేంద్రం గెజిట్ రిలీజ్ చేసింది. అయితే కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విద్యుత్ కేంద్రాలను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకురావాలని ఏపీ ప్రభుత్వం 2021, జులై 14న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సంబంధిత అథారిటీ అనుమతి లేకుండా తెలంగాణ ప్రభుత్వం తమ పరిధిలో ఉన్న విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని పిటిషన్‌లో ఆరోపించింది. తెలంగాణ నిర్ణయం వల్ల ప్రాజక్టుల్లో నీటి వాటా వినియోగంలో తేడాలు వస్తున్నాయని పేర్కొంది. మరోవైపు కేంద్రం తెచ్చిన ఈ గెజిట్‌ను రద్దు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబర్‌లో సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ రెండు పిటిషన్లు సోమవారం సుప్రీంకోర్టులోని వేర్వేరు ధర్మాసనాలు విచారించాయి. తొలుత తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్ జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్‌ల ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. అయితే ఈ కేసులో సుదీర్ఘ వాదనలు వినాల్సి ఉన్నందున ఈ విచారణను బెంచ్ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసింది. కొద్ది సేపటికి ఏపీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌ల మరో ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ప్రత్యేక ఆర్డర్ కావాలంటే ఆదేశాల్లో కోరవచ్చని ఏపీ తరపు న్యాయవాదానికి మెహతా సూచించారు. అయితే ఈ వాదనలపై ఏపీ తరపు న్యాయవాదులు పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఇదే అంశానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించిందని, అయితే సోమవారం జరిగిన విచారణ సందర్భంగా ఎలాంటి వాదనలు జరగలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తెలంగాణ దాఖలు చేసిన కేసుతో ఓవర్ ల్యాప్ అవుతాయని అభిప్రాయపడింది. అందువల్ల ఏపీ పిటిషన్‌ను తెలంగాణ పిటిషన్ విచారిస్తున్న ధర్మాసానికి బదిలీ చేయాలని చెబుతూ ఈ విషయాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దృష్టికి తీసుకెళ్లాలని రిజిస్టార్‌ను ఆదేశించింది. కాగా రెండు పిటిషన్లు గురువారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు వచ్చే అవకాశం ఉంది.

వామపక్ష అభ్యర్థులను గెలిపించండి

- దీపాంకర్ భట్టాచార్య విజ్ఞప్తి

కొల్‌కతా: ఆర్జీ కర్ ఆందోళనల నేపథ్యంలో బెంగాల్‌లోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ (ఎం–లిబరేషన్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలు, ఆకాంక్షలు ఈ ఉప ఎన్నికల్లో ప్రతిబింబించాలన్నారు. రాష్ట్రంలో టిఎంసి అరాచక పాలనకు, బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వాలని ఆయన కోరారు.

3 రాష్ట్రాల్లో 14 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నిక తేదీ మార్పు

న్యూఢిల్లీ : కేరళ, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 14 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 13న నిర్వహించాల్సిన ఉప ఎన్నికలను ఈ నెల 20కి వాయిదా వేసినట్లు కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) గతంలో ప్రకటించింది. ఆ రోజున పలు మతపరమైన కార్యక్రమాల కారణంగా బిజెపి, కాంగ్రెస్, బిఎస్‌పి, ఆర్ఎల్‌డి సహా పలు రాజకీయ పార్టీలు పోలింగ్‌ను వాయిదా వేయాలని ఇసిఐని కోరాయి. సాంస్కృతిక, మతపరమైన కార్యక్రమాల కారణంగా ఓటింగ్ శాతం తగ్గే అవకాశం ఉందని రాజకీయ పార్టీలు దృష్టికి తేవడంతో, వాటి అభ్యర్థన మేరకు ఉప ఎన్నికల పోలింగ్‌ను ఈ నెల 20కు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ప్రభావితమైన 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేరళలోని పాలక్కాడ్, పంజాబ్‌లోని డేరా బాబా నానక్, చబ్బేవాల్, గిద్దర్ బాహా, బర్నాల్, ఉత్తరప్రదేశ్‌లోని ఖైర్, మీరాపూర్, కుంద ర్కి, ఘజియాబాద్, కర్హాల్, సిషామౌ, ఫుల్‌పూర్, కతేహరి, మజావాన్ ఉన్నాయి.